honeybee.org
Vol-10 Issue-6
సంపుటి 10 సంచిక 6 సెప్టెంబర్ - అక్టోబర్ 2022

# పల్లెసృజన

www.pallesrujana.org

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక






# అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన మన 'గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్' కీన్యా దేశంలో గోదాసు నర్శింహ 'గుర్రపుడెక్క తీసే యంత్రం'

చెరువుల్లో గుర్రపు డెక్క నిండిపోయినప్పుడు చెరువు అందం పాడవటమే కాక, ఎటువంటి జలజీవరాశులు కూడా మనుగడ చెందే అవకాశం లేకుండా పోతుంది అన్న విషయం అందరికీ తెలిసిందే. ఇదే సమస్య ఒక జాలరికి ఎదురైంది. తమ కులవృత్తి చేపలు పట్టి అమ్ముకుని జీవనం సాగించే బెస్త కుటుంబాలకు ఈ గుర్రపు డెక్క పెద్ద అశనిపాతంలా వచ్చిపడింది నల్గొండ జిల్లా పోచంపల్లి సమీపంలోని ముక్తాపురం గ్రామ చెరువుకు. ఆ గుర్రపు డెక్కను యేటా కొందరు జాలర్లు వంతుల ప్రకారం స్వయంకృషితో నిర్మూలించుకుంటూ ఉండేవారు. అది ఎంతో కష్టంతో కూడుకున్న పని. బురద నీటిలో ఎక్కువసేపు నిలబడటం వల్ల కాళ్ళకు సంబంధించిన ఎన్నో రోగాలతో ఇబ్బందులు, పురుగు పుట్రలతో చాలా కష్టపడేవారు. తన తోటి సామాజిక వర్గం పడుతున్న ఇబ్బందులను గమనించి, ఈ సమస్యకు పరిష్కారం కనుగొన్నాడు ముక్తాపురం గ్రామానికి చెందిన గోదాసు నర్శింహ.

ఈ యంత్రం మాడల్‌ను 2017లో జరిగిన 'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్' జాతీయ ద్వైవార్షిక పోటీలలో ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ప్రదర్శించడం జరిగింది. నాటి ప్రదర్శనను భారత రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ గారు ఈ యంత్రం పనితీరు చూసి, ఇన్నోవేటర్ గోదాసు నర్శింహను అభినందించారు.

2018లో విదేశీ వ్యవహారాయ మంత్రిత్వ శాఖకు ప్రొఫెసర్ అనిల్ గుప్తా గారు 'గోదాసు నర్శింహ' ఇన్నోవేషన్ "గుర్రపు డెక్క యంత్రం"ను సూచించారు. భారత ప్రభుత్వం కీన్యా దేశ ప్రజలకు భారత ప్రజల తరుపున బహుమతిగా ఈ యంత్రాన్ని ఇవ్వటానికి నిశ్చయించడం జరిగింది. 'పల్లెసృజన' పట్టుదల, ప్రొఫెసర్ అనిల్ గుప్తా గారి చొరవ గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లను అంతర్జాతీయంగా వ్యాప్తి చెందడానికి ఈ నిర్ణయం దారి తీసింది.

ఇంత పెద్ద కార్యాన్ని సఫలం చేయడం గోదాసు నర్శింహకు ఒంటరిగా సాధ్యం కాదు. కాబట్టి పల్లెసృజన పెద్ద జాగర్లమూడి దుర్గా ప్రసాద్ గారు ఈ బాధ్యతను స్వీకరించారు. విదేశీ వ్యవహారాల శాఖ నుండి ఆర్డరు వచ్చింది కానీ, ఆర్థిక వనరులు సమకూరక ముందుకు వెళ్ళలేక పోయాము. ఎన్నో బ్యాంకులను, నాబార్డు లాంటి సంస్థలను సంప్రదించాము. లాభం లేకపోయింది. చివరగా బ్రిగేడియర్ గణేశం గారు కెటీఆర్‌తో స్వయంగా చర్చించి, ఆర్థిక సహాయం కోరారు. మంత్రివర్యులు స్పందించి, 25 లక్షల రూపాయల అప్పు ఇవ్వటానికి, ఒక జాతీయ కార్యక్రమాన్ని ముందుకు తీసుకు వెళ్ళడానికి తోడందించారు. ఆవిధంగా పల్లెసృజన పెద్దలు శ్రీకర్ మరియు దుర్గా ప్రసాద్ గారి ఆధ్వర్యంలో గోదాసు నర్శింహ తన స్వగ్రామమైన 'ముక్తాపూర్'లో యంత్రం తయారు చేయడం 2019 ఫిబ్రవరిలో ప్రారంభమైంది. ఆ యంత్రం పని తీరును తయారు చేస్తున్న పనులను పర్యవేక్షించేందుకు 2018 అక్టోబర్‌లో కీన్యా బృందం ఇన్నోవేటర్ గోదాసు నర్శింహను తన స్వగ్రామమైన 'ముక్తాపురం'ను సందర్శించి సంతృప్తిని వెలిబుచ్చింది. నరసింహ అన్నీ తానై అద్భుత నైపుణ్యంతో, ఇంజనీరింగ్ సామర్థ్యంతో ఫిబ్రవరి 2020 నాటి అన్ని హంగులతో యంత్రాన్ని పూర్తి చేశాడు. మార్చి, 2020 లో ఈ యంత్రాన్ని కీన్యా దేశానికి పంపించే ముందు తెలంగాణ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేష్ రంజన్ గారు ముక్తాపూర్ గ్రామానికి వచ్చి చూశారు. శభాష్ అన్ని నర్శింహను మెచ్చుకున్నారు.

ఆ తర్వాత కోవిడ్ మహమ్మారి రావటం వల్ల యంత్రం కీన్యా దేశం చేరినా, నర్శింహ దాన్ని నడిపించడం కుదరలేదు. దుర్గాప్రసాద్ గారి నిరంతర శ్రమ వల్ల చివరికి 24, సెప్టెంబర్, 2022 నాడు నరసింహ, అతని సహచరుడు ఆంజనేయులు, వినోద్ కుమార్ (దుర్గాప్రసాద్ గారి సహచరుడు) కీన్యా చేరుకున్నారు.

విక్టోరియా సరస్సులో పేరుకు పోయిన గుర్రపు డెక్కను నిర్మూలించేందుకు అప్పటికే కొన్ని దేశాలు ప్రయత్నించి, పనులు విజయ వంతంగా జరగటం లేదని విరమించుకున్నాయి. మన ఇన్నోవేటర్ వెళ్ళినప్పుడు కూడా అక్కడ కొన్ని కోట్ల ఖరీదు చేసే యంత్రం ఒకటి గుర్రపు డెక్క నిర్మూలించే పని ప్రారంభించి, ముందుకు సాగలేక విరమించుకున్నది. గోదాసు నర్శింహ తన యంత్రాన్ని అక్కడ ఇన్‌స్టాల్ చేసి, అది పనిచేసే విధానాన్ని వారికి సవివరంగా తెలియజేశారు. ఈ యంత్రం పని తీరును కేన్యా దేశంలోని 'కిసూము' రాష్ట్ర గవర్నర్ మరియు ఇతర అధికారులు కూడా ఎంతో ప్రశంసించారు. కోట్ల ఖరీదు చేసే యంత్రం చెయ్యలేని పని భారత దేశంలోని ఒక సామాన్య ఇన్నో వేటర్ తయారు చేసిన ఈ యంత్రం ఎంతో విజయ వంతంగా పని చేస్తోందని కితాబునిచ్చారు.

ఈ సందర్భంగా 'పల్లెసృజన' వద్ద ఇంకా ఏయే ఇన్నోవేషన్లు ఉన్నాయని వివరంగా అడిగి తెలుసుకున్నారు. అతి త్వరలోనే మళ్ళీ ఒకసారి మీ దేశాన్ని సందర్శించి మాకు అవసరమైన ఇన్నోవేషన్లను మేమే స్వయంగా కొనుగోలు చేసే ప్రయత్నాలు వీలైనంత త్వరలో మొదలు పెడతామన్నారు ఆ దేశ అధికారులు. గుర్రపు డెక్క యంత్రాన్ని బహుమతి గా అందించిన భారతదేశానికి ముఖ్యంగా ఈ సులువైన యంత్రాన్ని తయారు చేసిన గోదాసు నర్శింహకు కృతజ్ఞతలు తెలియజేశారు.



కీన్యా దేశంలోని ఒక గవర్నర్ గారు భారత దేశానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ చేసిన 'ట్వీట్'

ఈ మహాకార్యంలో సహకరించిన ప్రొఫెసర్ అనిల్ గుప్తగారు, తెలంగాణ మంత్రివర్యులు కేటీఆర్ గారు, ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేష్ రంజన్ గార్లకు, ఈ యంత్రం కేన్యా దేశానికి అందించడంతో మన తెలుగు వారి ఖ్యాతి ఖండాంతరాలకు వ్యాపించడం పట్ల 'పల్లెసృజన' వ్యవస్థాపక అధ్యక్షులు బ్రిగేడియర్ పోగుల గణేశం కృతజ్ఞతలు తెలియజేశారు. అసలు హీరో ఇన్నోవేటర్ గోదాసు నర్శింహకు, పల్లెసృజన కలను సాకారం చేసిన పట్టువదలని విక్రమార్కుడు జాగర్లమూడి దుర్గాప్రసాద్ గారికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సంఘటన తెలంగాణ చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతుందని, ఇలాంటి అద్భుత సహయోగం – ప్రభుత్వాలు, పెద్దలు, సంస్థలు, గ్రామ ఇన్నోవేటర్ – ఒక కలలాగి ఉందని వక్కానించారు. 'పల్లెసృజన' కుటుంబానికి ఇదొక పండుగలా ఉండదని బ్రిగేడియర్ గారు భావిస్తున్నారు.

కీన్యాలో విజయవతంగా గుర్రపుడెక్క యంత్రాన్ని వాడుకలోకి తేవటం వల్ల విక్టోరియా సరస్సు చుట్టూ ఉన్న మరో 5 ఆఫ్రికా దేశాలు ఈ యంత్రం సరఫరాకై ముందుకు వస్తాయని తెలుగు క్రియాశీలత విశ్వవిఖ్యాతి పొందుతుదని పల్లెసృజన ఆశిస్తున్నది. ఇంత తక్కువ దరలో ప్రపంచంలో ఇంతవరకు లేని సరళంగా పనుముల్లోంచి గుర్రపు డెక్కను తీసే పద్ధతి మన

Vol-10, Issue - 6 Sept.-Oct. 2022

విషయ సూచిక

సంపుటి-10 సంచిక - 6 సెప్టెంబర్ - అక్టోబర్ 2022

# పల్లెసృజన

పల్లెసృజన, 102, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్- 500 094.
ఫోన్ : 040-40253096, 98660 01678
E-mail : president@pallesrujana.org,
Visit :www.pallesrujana.org

**సంపాదకవర్గం**

ప్రధాన సంపాదకులు :
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం**

సంపాదకులు :
**జమ్మలమడక శశిమోహన్**

ఉప సంపాదకులు :
**పల్లె వీర రాఘవ రెడ్డి**

సలహాదారులు :
**ప్రొ. అనిల్ గుప్త**
**పి. చంద్రకాంత్ శర్మ**
**జాగర్లమూడి దుర్గాప్రసాద్**
**జమ్మలమడక శ్రీకర్**
**కల్పనా శాస్త్రి**

డిజైనింగ్ & ప్రింటింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్**, హైదరాబాద్.
ఫోన్ : 81257 99904,
E-mail : narendragrafixhyd@gmail.com

**Rs. 400/-**
**for 2 years Subscription**

## ఈ సంచికలో.....

* గోరెంట్ల శివచంద్ర ప్రసాద్ ఇన్నోవేషన్ - చీర నాణ్యతను పెంచే రోలింగ్ యంత్రం - 4
* ఆపిల్ మొక్కల సాగుకు సూచనలు - ఆపిల్ పండిస్తున్న సిరిసిల్ల జిల్లా రైతు బాబు అనుభవాలు - 7
* ఉపాధ్యాయుల డైలమా ! ..... - 9
* రాజేశ్వరీ రవికుమార్ - తక్కువ ఖర్చుతో పౌష్టిక ఆహార ప్రదాత - 11
* పునాది స్థాయి ఇన్నోవేషన్లతో గ్రామీణ యువతకు స్వయం ఉపాధి - 13
* జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు - 18
* 42వ చిన్నశోధయాత్రీకుల అనుభవాలు - 20
* ఇతర రాష్ట్రాల పల్లె జ్ఞానం - 23
* సాంప్రదాయ జ్ఞానంతో వన్య ప్రాణుల నుండి రక్షణ - అల్లాడి ప్రభాకర్ - 26
* రైతు లోకానికి 'వెల్లె శ్రీనివాస్' అద్భుత ఇన్నోవేషన్ - సులువుగా మోటార్ 'ఆన్ - ఆఫ్' చేసే రిమోట్ - 27
* ఆయుర్వేద జ్ఞాన మథనం - 30
* స్పందన - 31

**కవర్ లోపలి పేజీలో ...**
కీన్యా దేశంలో తెలంగాణ గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్ -
గోదాసు నర్సింహ 'గుర్రపు డెక్క' తీసే యంత్రం
అమ్మకానికి సిద్ధంగా వున్న రైతుల కోసం రైతుల ఇన్నోవేషన్లు
**మధ్య పేజీలో :**
సెప్టెంబర్-అక్టోబర్ 2022 లో జరిగిన 'పల్లెసృజన' విశేషాలు

Printed, Published and Owned by **P. Ganesham** and Printed at **M/s Narendra Grafix**, 1-5-1055/2/14, Saibaba Nagar, Old Alwal, Secunderabad, Medchal- Malkajgiri Dist. - 500010.Telangana State and Published at 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. –500094. Telangana State, Editor : **J. Sesimohan.**

**HoneyBee Regional Collaborators & Publications**

**Honey Bee (English)**
AES Boys Hostel Campus, Near Gujarat University Library & SBI Bank, Navrangapura, Ahmedabad - 380 009 Gujarat, India.
Phone: 91-79-27912792, Fax: 91-79-27913293 Email: honeybee@sristi.org

**Karshakan Samsarikkatte (Malayalam)**
Fr Hubby Mathew
Peermade Development Society,
Peermade, Idukki - 685531,
Kerala hmathew@gmail.com

**Nam Vali Velanmai (Tamil)**
Mr P Vivekanandan
45, T P M Nagar,Virattipathu,
Madurai - 625010 Tamil Nadu
vivekseva@gmail.com

**Palle Srujana (Telugu)**
Brig Pogula Ganesham VSM (Retd)
102, Vayupuri, Sainikpuri Post
Secunderabad-500 094 Telangana.
president@pallesrujana.org, www.pallesrujana.org

**Loksarvani (Gujarati)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

# వ్యవస్థ 'నిస్తేజం' - గ్రామాల 'సమృద్ధి'కి అడ్డు

గ్రామీణుల జీవితం ఎక్కువగా ప్రకృతితోనే ముడిపడి ఉంటుంది. భూమి, నీరు, పశువులు, అడవులు, కొండలు, వర్షాలు, ఎండలు ప్రకృతి వరాలు. ఇవన్నీ ఒక్కో గ్రామానికి ఒక్కో రకంగా గ్రామీణులకు లభిస్తాయి. వాటిని ప్రకృతి ప్రసాదించిన వరంగా భావించి పరిపూర్ణంగా వాడుకుంటారు గ్రామీణులు. దీనికి తోడుగా ఆధునిక సాంకేతికతను జోడిస్తే, గ్రామ ప్రజల అభివృద్ధి ఇంకా జోరుగా సాగుతుంది. వ్యవస్థ అంటే ప్రభుత్వం. వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, ఎక్స్‌టెన్షన్ విభాగం, కృషి వికాస కేంద్రాలు, వ్యవసాయ పరిశోధనా సంస్థలు, గ్రామ ప్రజల నిజమైన సమస్యలను క్షుణ్ణంగా అర్థం చేసుకుని వాటి పరిష్కారాలను పరిశోధన చేసి, తయారు చేయించి, వారికి అందుబాటులో ఉండేట్లుగా చేస్తేనే నిజమైన గ్రామీణాభివృద్ధి కనిపిస్తుంది. ప్రస్తుతం "మాకు తోచింది ఇస్తాం" అనే దృక్పథంతోనే అందరూ పనిచేయుటం వల్ల గ్రామవాసులకు లాభం చేకూరటం లేదు. గ్రామాలతో సంబంధం లేని కార్పోరేట్లకు, పారిశ్రామిక సంస్థలకు, కొన్ని ప్రభుత్వేతర సంస్థలకు, కొందరు వ్యక్తులకు మాత్రమే ఈ దృక్పథం లాభం చేకూరుస్తుంది. దానికి బదులుగా 'గ్రామవాసులకు కావాల్సింది ఇద్దాం' అన్న దృక్పథంతో చేస్తే సత్ఫలితాలు రాగలవు. వ్యవస్థలో ఉన్న మేధావులు, సైంటిస్టులు, ప్రభుత్వ ఉద్యోగులు, వారి జ్ఞానంపై, వారి అనుభవంపై  కాకుండా, విదేశాల్లోని పద్ధతులపై ఎక్కువ మక్కువ చూపుతున్నారు. గ్రామాల్లోని క్రియాశీల వ్యక్తులు తాము అనుభవిస్తున్న బాధల నుండి విముక్తి చేయటానికి ఎవరి సహాయం లేకుండా వారు తయారు చేసిన పరిష్కారాలపై ఈ వ్యవస్థ అస్సలు దృష్టి పెట్టడం లేదు. గ్రామస్తులు ఎలా చేయగలరన్న ధోరణే తప్ప, వారిలో కూడా క్రియాశీలత ఉంటుంది, వారి పరిష్కారాలు కూడా అత్యున్నత స్థాయిలో సమస్యలను తీరుస్తాయన్న విశ్వాసం, అవగాహన వ్యవస్థలో లేదు. గ్రామ ప్రజల వ్యక్తిత్వాన్ని, సంవేదనను, వారి ఆత్మ గౌరవాన్ని, వారు సమాజానికి చేస్తున్న శ్రమను గుర్తించి వారికి గౌరవం ఇవ్వాలన్న ఆలోచనే ఈ వ్యవస్థకు రావటం లేదు.

జాతీయ స్థాయిలో ఆర్థిక గణాంకాలను విశ్లేషించి ఆర్థిక, రాజకీయ వేత్తలు భారతదేశం బంగారు బాటలో నడుస్తుందని వాదిస్తున్నారు. గణాంకాలు ప్రజల క్షేమానికి, అభివృద్ధికి, ఆనందమయ జీవితానికి ప్రతిబింబం కావు. అసలు సత్యం గ్రామాల్లో, పట్టణాల్లోని సామాన్య బస్తీల్లో ఉంటుంది. గణాంకాలు అక్కడి నుండి సంపాదించాలి. వాటి విశ్లేషణ చేసే జాతీయ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మార్చాలి. ప్రభుత్వ పాలకులు, శాస్త్రవేత్తల పరిశోధనలు, పారిశ్రామిక ఉత్పత్తులు, విద్యారంగంలో విద్యార్థులకు చెప్పవలసిన సత్యాలు, దేశ నిజ పరిస్థితి అవగాహన, సార్వజనిక చర్చలు, యువతకు భాగస్వామ్యం, ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ దిశలు మార్చాలి. అందరి దృష్టి ప్రజల శ్రేయస్సుపై కేంద్రీకృతమై ఉండాలి.

పల్లెసృజన గ్రామాల్లో యాత్రలు చేస్తూ, గమనించింది ఏమిటంటే గ్రామవాసుల క్షేమం, వారి సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారాలు వెతకడం. గ్రామాలను స్వయం సమృద్ధిగా చేయడం, ఆకలితో ఎవరూ నిద్రపోకుండా చూడటం, చిన్న పిల్లల ఆరోగ్యానికి కృషి, ఆడపిల్లల దేహ దారుఢ్యం, ఉన్నత ఆరోగ్య పరిస్థితి మెరుగు పరచడం. ఎందుకంటే వీరే భారత భవిష్యత్తు పాలకులకు జన్మనిస్తారు కాబట్టి. అలాంటి మానవాభివృద్ధి, జీవితంలో శాంతి, ఆరోగ్య అభివృద్ధి వంటి లక్ష్యాలతో వ్యవస్థ ముందుకు సాగాలి. ఇది జరగటం లేదు. బహిరంగంగా గ్రామవాసుల స్థితిని నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రభుత్వాలు, రాజకీయాలు పదవీ వ్యామోహంతో పని చేస్తున్నాయి. పారిశ్రామికులు మోసపూరిత, స్వార్థంతో నిండిన వ్యాపారం చేస్తున్నారు. సైంటిస్టులు తమ పేరు, ప్రమోషన్ల కొరకు మాత్రమే ఎక్కువ మంది పని చేస్తున్నారు. విద్యా సంస్థలు విద్యార్థులను సమాజం నుండి దూరం చేయటానికి శాయశక్తులా కృషి చేస్తున్నాయి. ఆస్పత్రులు మందుల కంపెనీలకు లాభాలు చేకూర్చడానికి పని చేస్తున్నాయి. మీడియా పాలకులకు, కార్పోరేట్లకు బానిసలుగా వ్యవహరిస్తోంది.

ఇలాంటి పరిస్థితుల్లో గ్రామవాసులు నిరాశ, కోపంతో అసహనంగా జీవితాన్ని లాగుతున్నారు. కోపమొచ్చినప్పుడే మనిషి కార్యోన్ముఖుడు అవుతాడు. ఎలాగైనా తన సమస్యను తీర్చుకోవాలని, తన జీవితంలో ఎంత కష్టం తగ్గితే అంత ఆనందం వస్తుందన్న లక్ష్యంతో ముందుకు సాగుతాడు. ఏ సహాయం, తగిన పరిజ్ఞానం, సాంకేతిక జ్ఞానం లేకుండా మొండి ధైర్యంతో తన చుట్టూ వున్న సమస్యల పరిష్కారానికి ముందుకు సాగుతాడు. వీరినే పల్లెసృజన "గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్లు" అని సగౌరవంగా సమాజంలో ఒక ఎత్తైన పీఠంపై నిలబెడుతోంది. వీరి కథలు వింటుంటే ఒళ్ళు గగుర్పొడుస్తుంది. సిగ్గుగా కూడా అనిపిస్తుంది. అంతర్మథనం మొదలవుతుంది. వీరు తమ క్రియాశీలతతో ఆవిష్కరించిన పరిష్కారాలు గ్రామవాసులకు ఎంతగానో తోడ్పడతాయి. వారి కష్టాలను తీర్చి, ఉత్పాదకతను పెంచి, సమయాన్ని పెట్టుబడిని తగ్గిస్తాయి. వీటిని ఊళ్ళల్లోనే తయారు చేసుకోవచ్చు, అతి తక్కువ ధరలో, గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండేట్టుగా చేయవచ్చు. ఈ సరళమైన, సరియైన, అద్భుత ఇన్నోవేషన్లను సమానాంతరంగా గ్రామం నుండి గ్రామానికి, రైతు నుండి రైతుకు చేరవేస్తే కోట్లకొద్దీ గ్రామవాసులు ఈ పరిష్కారాల వల్ల వచ్చే ఆనందాన్ని, అభివృద్ధిని పొందగలుగుతారు. పదిహేడు సంవత్సరాల పల్లెసృజన ప్రయాణంలో ఈ అద్భుత ఆవిష్కరణలను చూసే భాగ్యం మా అందరికీ కలిగింది. వ్యవస్థ చూడని, నిర్లక్ష్యం చేసిన ప్రజల సమస్యలకు పరిష్కారాలు గ్రామాల్లోనే ఉన్నాయి. ఇవి వారంతట వారే వ్యవస్థ సహాయం లేకుండా చేసుకున్న గొప్ప ఆవిష్కరణలు. వాటిని దేశమంతా విస్తరింప చేయడం వ్యవస్థ కనీస ధర్మం. కానీ... అర్థం కాని నిస్తేజం



( Inertia) వ్యవస్థలో కనిపిస్తోంది. గ్రామాల్లోని ప్రజలు ఇన్నోవేషన్లు ఎలా చేయగలరు అన్న న్యూనతా భావం, అహంకారం పెరిగిపోయి వ్యవస్థను గుడ్డివారిగా, చెవిటివారిగా తయారు చేసింది. ఈ మూర్ఖత్వ భావనను సమర్థించుకోవడం ఒక గొప్ప లక్షణంగా తయారైంది వ్యవస్థ. 'సమర్థించుకోలేని సమర్థన' తత్వంతో, మూర్ఖత్వంతో ఈ వ్యవస్థ నిరర్థకమై పోతోంది. వీరిని తట్టి లేపడానికి, కర్తవ్యోన్ముఖులను చేయడానికి పల్లెసృజన 17 సంవత్సరాలుగా కృషి చేస్తూనే ఉంది. గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లను వ్యవస్థకు చూపి, వాటి అసామాన్య లాభాలను వివరించడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నది. ఎంత వరకు వ్యవస్థను కదిలించ గలిగామో పాఠకులు, సమాజ సేవకులే అంచనా వేయాలి.

"వ్యవస్థలో ఈ చెత్త నిస్తేజం ఎందుకున్నది? ఎలా వచ్చింది? దీన్నుండి ఎలా బయట పడాలి?". అన్నవి మనల్ని మాట్లాడకుండే చేసే పెద్ద ప్రశ్నలు. "నిస్తేజం" అని ఎందుకన్నామో స్పష్టంగా తెలియాలంటే కొన్ని 'గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్ల ప్రభావం' ప్రజలపై ఎంతగా ఉందో, ఉంటుందో పరిశీలిద్దాం.

'చింతకింది మల్లేశం' అనే ఇన్నోవేటర్ "తన తల్లి బాధ తగ్గించడానికి 22 సంవత్సరాల క్రితం తయారు చేసిన 'ఆసు యంత్రం' ఇప్పటికి పోచంపల్లి నేత కార్మికుల కుటుంబాలకు పూర్తిగా చేరలేదు. పల్లెసృజన వెంటబడితే ప్రభుత్వం ఇంతవరకు కేవలం 150 యంత్రాలు మాత్రమే అందులో 25% ఖర్చు మాత్రమే ఇచ్చింది. మన చేనేత మహిళల కష్టాలు తీర్చడానికి, వారి ఆరోగ్యాలను కాపాడటానికి ప్రభుత్వాలకు ఇన్ని సంవత్సరాలు కావాలా? ఇది అనవసరమైన నిస్తేజం, నిర్లక్ష్యం కాదా?

చిత్తూరు జిల్లా కు చెందిన మరో ఇన్నోవేటర్ 'గల్లా చంద్రశేఖర్' నిమటోడ్స్‌ను చంపి పంటలను కాపాడటానికి, వరి పంటలో కలుపు రాకుండా చేయటానికి వన మూలికలతో అత్యంత ప్రభావం కలిగిన మందులు తయారు చేశాడు. వీటికి పేటెంట్లు, శాస్త్రీయ సర్టిఫికెట్లు కూడా ఉన్నాయి. ఈ రెండు సామాన్య రైతుల ఖర్చులను తగ్గిస్తాయి. రసాయనాలు వాడకుండా చేస్తాయి. పంట ఉత్పాదన కూడా పెరుగుతుంది. ఇలాంటి మానవాళికి, వాతావరణానికి, ప్రకృతికి అనుకూలమైన ఇన్నోవేషన్లను వ్యవసాయ శాఖ కాని, వ్యవసాయ శాస్త్రజ్ఞులు కాని, పారిశ్రామికవేత్తలు కాని దేశమంతా విస్తరింప జేయటానికి ముందుకు రాకపోవడం గర్హనీయం. ఈ నిస్తేజానికి అర్థముందా?

చేనేత మగ్గాలు నడిపేవారు కాళ్ళ నొప్పులతో 45 సంవత్సరాలకే నేత నేయడం మానేస్తున్నారు. వారికి కాళ్ళ నొప్పులు రాకుండా ఈ వ్యవస్థ ఏ పరికరాన్ని ఆవిష్కరించలేదు. ఎంతసేపు సబ్సిడీలు, సంక్షేమ కార్యక్రమాలని లక్షల కోట్లు ఖర్చు పెడ్తారే తప్ప చేనేత కుటుంబాల అభివృద్ధికి, ఆరోగ్యవంతమైన, ఆనందకరమైన జీవన శైలికి ప్రయత్నాలు చేపట్టరు. 'మోధ శివకుమార్' ఓ ఇన్నోవేటర్ ఈ సమస్యకు సరళమైన, తక్కువ ధరలో పరిష్కారం కనుగొన్నాడు. విజయవంతంగా వాడారు. వంద చేనేత మగ్గాలకు ఈయంత్రాన్ని బిగించాడు. ఈ యంత్రం దేశంలో 24 లక్షల మగ్గాలకు బిగిస్తే చేనేత కార్మికులు కాళ్ళ నొప్పులు లేకుండా నేత పనిని జీవితాంతం కొనసాగిస్తారు. దీనిపై ప్రభుత్వాలు కార్యాచరణ ఎందుకు చేపట్టడం లేదు?

ఆరున్నర లక్షల గ్రామాల్లో ట్రాక్టర్లు, లారీలు, బండ్లపై బరువులు దించడం, ఎక్కించడం ఇప్పటికీ మనుషులతోనే జరుగుతున్నాయి. క్రేన్లు ఈ గ్రామవాసులకు ఇంతవరకు లభ్యం కాలేదు. ఈ సవతి ప్రవర్తన గ్రామ ప్రజలపై వ్యవస్థ ఎందుకు చూపుతుంది? హనుమకొండ జిల్లాకు చెందిన ఇన్నోవేటర్ మహిపాల్ చారి ట్రాక్టరుకు క్రేను బిగించి, తమ గ్రామంలో అందరికీ సహాయం చేస్తున్నాడు. ఈ క్రేను 15 అడుగుల ఎత్తు, 10 క్వింటాళ్ళ బరువు లేపుతుంది, దించుతుంది. ఊళ్లో జరిగే ఎన్నో బరువులతో కూడుకున్న పనులకు ఈ క్రేన్ ఎంతో సహాయకారిగా ఉంది. ట్రాక్టరుకు తగిలించడం, విడదీయటం లాంటి పనులు కూడా చాలా తక్కువ సమయంలో చేయవచ్చు. దీని ధర కూడా 10 వేల లోపే ఉంటుంది. మరి వ్యవస్థ ఇలాంటి క్రేన్ సౌకర్యాన్ని గ్రామాల్లోని 50 కోట్ల ప్రజలకు చేరవేయడానికి ఎందుకు ముందుకు రావటం లేదు? మరో ప్రత్యామ్నాయం కూడా లేదు కదా! ఇంత నిస్తేజమా?

రైతులు వరి పొలాల్లో మందు పిచికారి చేయడం తప్పనిసరి. అయితే దానికి కావలసిన యంత్రాలు రైతులకు హాని కలిగించేలా, కష్టాన్ని పెంచేలా ఉన్నాయి. మందు పిచికారి చేస్తూ వెళుతుంటే రైతు ప్రాణానికి ముప్పు ఏర్పడుతోంది కదా! ఒక ఎకరం స్ప్రే చేయాలంటే 150 లీటర్ల మందునీళ్ళు కావాలి. ఈ బరువునంతా మోస్తూ రైతు కూలీలు కష్టపడుతున్నారు. వారి గురించి ఆలోచించే వారే లేరా? వారిని కష్టాల నుండి, ప్రాణ హాని నుండి కాపాడే యంత్రాలు లేవా? లేక వ్యవస్థకు వీరి ప్రాణాల విలువ తెలియదా? 'మౌలాలి' అనే గుంటూరు జిల్లాలోని ఓ రైతు వ్యవసాయం చేస్తూ, ఈ బాధలన్నీ అనుభవిస్తూ ఉండేవాడు. ఏదైనా చెయ్యాలన్న తాపత్రయం. బుర్రకు పని పెట్టి తైవాన్ స్ప్రేయర్ శక్తిని పెంచి, 300 అడుగుల దూరం వరకు ఎటువంటి అలసట లేకుండా, మందు నీళ్ళను ఒడ్డున పెట్టి పొలంలోకి వెళ్ళి సునాయాసంగా పిచికారి చేయగలిగాడు. ఇలాంటి ఆవిష్కరణలు రైతులకు ఎంతగానో ఉపయోగ పడతాయి. వారి పెట్టుబడులు, కష్టాలు తగ్గుతాయి. ఈ యంత్రం వారికి అందుబాటులో ఉంటుంది. ఇలాంటివి ప్రతి ఊరికి చేరాలి. రైతులు దేశమంతా ఇలాంటి ఇన్నోవేషన్‌లను వాడి లాభపడాలి. ఇది వ్యవస్థ ముందుకు వస్తేనే సాధ్యమౌతుంది. ఇంత మంచి పనికి వ్యవస్థలో ఈ నిస్తేజమెందుకు?

పల్లెసృజన ఇలాంటి రైతుకు లాభం కలిగించే గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లను, వందల కొద్దీ గ్రామాల్లోని సృజనాత్మక వ్యక్తులను వెతికి, వారి అనుమతితో వ్యాప్తి చేస్తున్నది. తమ శక్తివంచన లేకుండా తమ పరిధిలో వ్యవస్థకు వీటిని పరిచయం చేస్తున్నది. నిర్లక్ష్యం, నిస్తేజంతో నిండుకొని వున్న వ్యవస్థ జడత్వాన్ని పోగొట్టడానికి, గ్రామవాసుల అవసరాలను తీర్చే ఇన్నోవేషన్ల అభివృద్ధి, విస్తరణ కొరకు గత 17 సంవత్సరాలు చాలలేదు. మరెన్ని సంవత్సరాలు పడుతుందో ఏమో! ఈ పని వీలైనంత త్వరగా జరగడానికి పాఠకుల సలహాలను ఆహ్వానిస్తున్నాము.

ప్రతి బుధవారం నిర్వహించే ఇన్నోవేషన్లపై వెబినార్లు 85 దాటి శతకం వైపు పరుగెడుతున్నాయి. మీరంతా వారానికి ఒక గంట వెబినార్లకై కేటాయించి, వాటిలో పాల్గొనండి. మీ అభిప్రాయాలు, సమస్యలు, పరిష్కారాలు పల్లెసృజన వేదికగా అందరికీ తెలియజేయండి.

పల్లె జ్ఞాన ఉద్యమానికి మీ మద్దతు మరింతగా భవిష్యత్తులో వస్తుందన్న ఆశతో.....

భవదీయ

బ్రిగేడియర్ పోగుల గణేశం (రిటైర్డ్)

# గోరెంట్ల శివచంద్ర ప్రసాద్ ఇన్నోవేషన్

# చీర నాణ్యతను పెంచే 'రోలింగ్ యంత్రం'



- వీరరాఘవ రెడ్డి


మానవుడికి అత్యంత అవసరమైన 'కూడు, గూడు, గుడ్డ' అంటారు. ఈ మూడు ప్రధాన అవసరాల్లో 'గుడ్డ'లను పూర్వం శుభ్రంగా ఉతుక్కోవడం, తొడుక్కోవడం చేసేవారు. కొంత కాలానికి దాన్ని 'ఇస్త్రీ' చేయటం మొదలైంది. పురుషుల దుస్తుల్లో ఆ ఇస్త్రీ ఇంకా అలాగే కొనసాగు తూ ఉన్నది కాని, మహిళల చీరల విషయంలో కొద్ది కొద్దిగా మార్పులు వస్తూనే ఉన్నాయి. మొదట ఇస్త్రీ చేసే వారు, ఆ తర్వాత కొంత కాలానికి 'రోలింగ్' ప్రక్రియ మొదలైంది. ఈ రోలింగ్ ప్రక్రియ మొదట ఒక కర్రకు ఉతికి, ఆరబెట్టి, అవసరమైన వాటికి 'గంజి' పెట్టి, ఒక కర్రకు బిగుతుగా చుట్టడం చేసేవారు. ఆ పద్ధతి కొంత కాలం కొనసాగిన తర్వాత ఈ చీరల రోలింగ్‌కు పనిచేసే వారు ఎక్కువ అవసరం అవుతున్నారని ఇప్పుడు మార్కెట్లో యంత్రాలు కూడా వచ్చేసాయి. అయితే ఈ పనిని మహిళలు, కొందరు నిరుద్యోగులు గృహ పరిశ్రమగా చేసుకుని ఉపాధి పొందుతున్నారు. వీరిలో చాలా వరకు పేద, మధ్య తరగతి వారే కావటం వల్ల 4–5 లక్షల ఖరీదు పెట్టి యంత్రాలు కొనే తాహతు లేక చీరలను కర్రలకు చుట్టే ప్రక్రియలోనే కొంత మార్పు చేర్పులు చేసి, తక్కువ మంది పనిచేసేలా చాలా ఇన్నోవేషన్లు చేశారు.

ఇన్ని రకాల పద్ధతులున్నా, చీర రోలింగ్ చేసిన తర్వాత వాటిలో నాణ్యత, ఆరబెట్టే సమయం విషయంలో పెద్దగా మార్పు తీసుకు రాలేక పోయారు. యంత్రాలపైన ఒకే వ్యక్తి పని చేయవచ్చు కాని, ఆరబెట్టే సమయంలో పెద్దగా మార్పు రాలేదు. తమ చీరలను రోలింగ్‌కు ఇవ్వాలనుకునే మహిళలు 'రోలింగ్ చేయటం వల్ల చీరలు షాపునుండి కొనుగోలు చేసిన కొత్త వాటిలా ఉంటాయి' అని ఈ పద్ధతికి బాగా అలవాటు పడి పోయారు. ఈ రోలింగ్ ప్రక్రియ ఇప్పుడు చిన్న పట్టణాలకు కూడా ప్రాకింది.

> **చీర రోలింగ్ చేసిన తర్వాత వాటిలో నాణ్యత, ఆరబెట్టే సమయం విషయంలో పెద్దగా మార్పు తీసుకు రాలేక పోయారు. యంత్రాలపైన ఒకే వ్యక్తి పని చేయవచ్చు కాని, ఆరబెట్టే సమయంలో పెద్దగా మార్పు రాలేదు. తమ చీరలను రోలింగ్‌కు ఇవ్వాలనుకునే మహిళలు 'రోలింగ్ చేయటం వల్ల చీరలు షాపు నుండి కొనుగోలు చేసిన కొత్త వాటిలా ఉంటాయి' అని ఈ పద్ధతికి బాగా అలవాటు పడి పోయారు.**

గతంలోని అన్ని ప్రక్రియలను మిళితం చేస్తూ, చీర నాణ్యత అద్భుతంగా ఉండేలా, తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో, ఒకే వ్యక్తి చీరల రోలింగ్ చేసేలా మధ్య తరగతి వారు కొనుగోలు చేసుకుని ఉపాధి పొందేలా సరికొత్త యంత్రాన్ని అభివృద్ధి చేసాడు ఇన్నోవేటర్ 'గోరెంట్ల శివచంద్ర ప్రసాద్'. కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన గోరంట్ల వెంకట రమణయ్య (కాలధర్మం చేశారు), రామ సుబ్బమ్మలకు నలుగురు అబ్బాయిలు, ఒక అమ్మాయి. వీరిలో చివరి అబ్బాయి 'గోరంట్ల శివచంద్ర ప్రసాద్'. వయస్సు 45 సంవత్స రాలు, భార్య శ్రీదేవి. శివచంద్ర ప్రసాద్ ఒక చిన్న 'టెక్స్‌టైల్' రంగంలోనే "క్లాత్ ప్రాసెసింగ్ యూనిట్" నడుపుకుంటూ ఉపాధి పొందుతుండగా, భార్య ఇంట్లో చీరల రోలింగ్ చేస్తూ ఉపాధి పొందు తుంటారు. ప్రసాద్ చదివింది పదవ తరగతి వరకే అయినా తన చుట్టూ ఉన్న సమస్యల పరిష్కారం గురించి ఆలోచించే వాడు.

తన పదవ తరగతి తర్వాత అక్కడక్కడా కొన్ని రోజులు ఉద్యోగం చేసి, ఇక ఈ ఉద్యోగాల వల్ల ఇంటి అవసరాలకు సరిపడా సంపాదించలేమని తనే ఒక స్వంత వ్యాపారం 'క్లాత్ ప్రాసెసింగ్ యూనిట్' ఏర్పాటు చేసుకున్నాడు. ఇలా కాలం గడుస్తూ ఉండగా, ఇంటి చాకలి ఇస్త్రీ సమంగా చేయటం లేదని తన తల్లి అతనితో తరచూ గొడవ పడటం చూసి ఈ సమస్యకు ఒక పరిష్కారం కనుగొనాలని ఆలోచించాడు. అప్పుడే చీర రోలింగ్ కొత్తగా వచ్చిన సంగతి తెలుసుకుని ఇంట్లో వీళ్ళకు కూడా ఒక యూనిట్ ఏర్పాటు చేయిస్తే బావుంటుందని ఆలోచించాడు. తన ఆలోచనలలో ఒక మిషన్ రూపం ఏర్పరచుకొని తన వ్యాపారానికి సంబంధించి



బట్టలకు రంగులతో డిజైన్లు వేసే యంత్రంలా తాను కూడా ఒక యంత్రం తయారు చెయ్యా లని అనుకున్నాడు. అలా చీరలకు కలర్లు వేసే యంత్రాలు తెలంగాణ లోని భువనగిరిలో ఉన్నాయని తెలుసుకుని అక్కడికి వెళ్ళి వాటిని పరిశీలించాడు. చీర రోలింగ్ మిషన్ లో కూడా టెక్స్‌టైల్ యంత్రాలలోని కొన్ని భాగాలు ఉన్నాయని గ్రహించాడు. ఈ అనుభవంతోనే తానే స్వయంగా ఒక యంత్రాన్ని తయారు చేయటానికి పూనుకున్నాడు. దాదాపు రెండు సంవత్సరాల పాటు తన వ్యాపారం చూసుకుంటూ, చీర రోలింగ్ మిషన్‌ను కష్టపడి తయారు చేశాడు.

చీరలు రోలింగ్ చేయటానికి మార్కెట్‌లో 4-5 రకాల పద్ధతులు ఉన్నాయి. అందులో ఒకటి యంత్రం ఉండదు కానీ, చీరను ఇద్దరు ముగ్గురు వ్యక్తులు కలిసి ఒక టబ్‌లో చీరకు అవసరమైన గంజి, చీర నాణ్యంగా కనిపించే కొన్ని రకాల రసాయనాలు వేసి చీరను అందులో అద్ది, బిగుతుగా ఒక కర్రకు చుట్టడం, దాన్ని ఎండలో ఆరబెట్టి ఆ తర్వాత దాన్ని విప్పదీసి చక్కగా మడతలు వేసి ఇవ్వటం ఒక పద్ధతి. ఇలా చీరలు రోలింగ్ చెయ్యటానికి వ్యాపారాన్ని బట్టి చీరలను చుట్టేందుకు కొన్ని కర్రలను తయారు చేయించుకోవాల్సి ఉంటుంది. ఇదంతా దాదాపు 20 నుండి 30 వేల వరకు ఖర్చవుతుంది.

మరో పద్ధతి ఇద్దరు వ్యక్తులు చీరను ఇరువైపుల ఒక కర్రకు బిగించి బిగుతుగా పట్టుకుంటే మరో వ్యక్తి చీరపైన అవసరమైన గంజి, రసాయనాలను స్ప్రే చేసి, ఆ చీరను చుట్టడానికి ఒక చక్రం ఏర్పాటు చేసుకుని ఉంటారు. దానికి చేతితో ఒక పెడల్‌ను తిప్పటం ద్వారా చీర కర్రకు చుట్టుకుంటుంది. ఈ పద్ధతికి కూడా దాదాపు 50 వేల వరకు ఖర్చవుతుంది.

మరో యంత్రం ఒకటి మార్కెట్‌లో లభిస్తోంది అందులో చీరలను వెయ్యాల్సిన రసాయనాలను నింపి ఉంచితే ఆ యంత్రం చీరపై స్ప్రే చేసి, ఇస్త్రీ చేసి ఇస్తుంది. కానీ ఈ యంత్రం వల్ల చీర రోలింగ్‌లో పెద్దగా నాణ్యత లేకపోవటం వల్ల చాలామంది ఈ యంత్రాన్ని రెండున్నర నుండి 3 లక్షల దాకా పెట్టుబడి పెట్టి కొనుగోలు చేసి మోసపోయిన వాళ్ళు కూడా ఉన్నారు. పైగా ఈ యంత్రానికి గ్యాస్, కరెంటు ఖర్చు కూడా కొద్దిగా ఎక్కువగానే ఖర్చవుతుంది. పని అయితే కాస్త త్వరగానే అవుతుంది కానీ, నాణ్యత అంతగా లేకపోవటం వల్ల వినియోగదారులు పెద్దగా నచ్చక పోవటం వల్ల వ్యాపారం అనుకున్న విధంగా జరగక నష్టపోవాల్సి వస్తుంది. యూట్యూబ్‌లో ఈ యంత్రాలను చాలామంది చూసి, రోజుకు 4-5 వేల వరకు సంపాదించుకోవచ్చు అని తీసుకుని



**చేతితో చీరను రోలింగ్ చెయ్యటానికి - ఈ యంత్రంతో చెయ్యటానికి మధ్య తేడా ఈ విధంగా ఉంటుంది.**

| వ. | వివరము | చేతితో చేసే పని | ఈ యంత్రం చేసే పని |
|---|---|---|---|
| 1. | అవసరమయ్యే మనుషులు | 3-4 | ఒక్కరు |
| 2. | ఒక చీర చేయటానికి పట్టే సమయం | 15-20 ని. | 5 నిమిషాలు |
| 3. | చీరకు పెట్టే గంజి | హెచ్చు తగ్గులుగా ఉంటుంది. | చీరంతా ఒకేవిధంగా ఉంటుంది |
| 4. | చీర రోలింగ్ వాడే కర్ర సైజు | 4 అంగుళాల చెక్క | 15 అంగులాల చతురస్రాకారపు రోలర్ |
| 5. | పగటి సమయంలో చీర ఆరే సమయం | 10-12 గంటల సమయం (వాతావరణాన్ని బట్టి) | 3-6 గంటల సమయం (వాతావరణాన్ని బట్టి) |
| 6. | ఆరబెట్టే పద్ధతి | ఎండలో ఆరబెట్టాలి. అందువల్ల చీరల రంగు వెలిసిపోయే ప్రమాదం. | నీడలో అయినా ఆరబెట్టవచ్చు. అందువల్ల రంగులు వెలిసిపోవు. |
| 7. | అవసరమైన స్థలం | కనీసం 8-20 అడుగుల స్థలం అవసరం | 8-8 అడుగుల గది సరిపోతుంది |
| 8. | నాణ్యత | సాధారణంగా ఉంటుంది | కొత్త చీరలాగా మెరుస్తుంది |

మోసపోయిన వాళ్ళే ఎక్కువ అంటాడు శివచంద్ర ప్రసాద్.

ఇలా ఇంకా ఎన్నో రకాల యంత్రాలు మార్కెట్లో లభిస్తున్నాయి కానీ, అవి చాలా ఖరీదైనవి, సామాన్య మధ్యతరగతి వారు వాటిని కొని ఏర్పాటు చేసుకోలేరు. పైగా వాటిని ఏర్పాటు చేసుకునేందుకు చాలా ఎక్కువ స్థలం వున్న గది అవసరమవుతుంది.

వీటన్నిటిలోని లోపాలను గమనించి, ఈ సమస్యలన్నీ తీర్చేలా తన యంత్రం ఉండాలని ఎంతో ఆలోచించి రూపొందించాడు శివచంద్ర ప్రసాద్. ఇతను తయారు చేసిన యంత్రంలో ఏర్పాటు చేసిన రబ్బర్ రోలర్ చీరను సరియైన ఒత్తిడితో ముందుకు జరపటం వల్ల చీరపైన ఎటువంటి ముడతలు లేకుండా చాలా నాణ్యంగా బయటకు వస్తుంది. రోలర్ నుండి బయటకు వచ్చిన చీరను చుట్టేందుకు చిన్న కర్రలా కాకుండా ఒక పెద్ద డ్రమ్ములా ఉండేలా కేవలం నాలుగు ఇనుప కడ్డీలు ఇరువైపుల రెండు వృత్తాకార కడ్డీలతో తయారు చేయటం వల్ల చీర పెద్దగా చుట్టుకుని త్వరగా ఆరిపోయే అవకాశం కల్పించాడు. ఈ యంత్రంపైన ఒకే మహిళ అన్ని పనులు చేసుకుని నాణ్యమైన చీరల రోలింగ్ చేస్తుంది. రోలర్ల సామర్థ్యం, చీర చుట్టుకునే పద్ధతులు, చీరను నానబెట్టేందుకు వేసే రసాయనాలు అన్నీ ప్రత్యేకంగా ఉండటం వల్ల ఈ యంత్రంపైన రోలింగ్ చేసిన చీర ఇంచుమించు కొత్తగా షాపులో కొన్న చీరతో సమానంగా మెరుస్తూ ఉంటుంది. అందువల్ల వినియోగ దారులు కూడా ఈ రోలింగ్ చాలా బావుందని కితాబునిచ్చారు. గిరాకీ కూడా బాగా పెరిగింది.

ఒక చీర రోలింగ్ చేస్తే, ప్రాంతాలను బట్టి చీరకు రూ. 50 నుండి 100 రూపాయల వరకు తీసుకుంటారు. ఎక్కడ ఎంత సొమ్ము తీసుకున్నా, ఒక చీర రోలింగ్ చెయ్యాటానికి ఈ యంత్రం ద్వారా అయ్యే ఖర్చు కరెంటుతో సహా 10–15 రూపాయలకు మించదు అంటాడు శివచంద్ర ప్రసాద్. రోలింగ్ యంత్రంతో పాటు చీరలు చుట్టి ఆరబెట్టే రోలర్లు 5 ఇస్తాడు. గిరాకీ ఎక్కువగా ఉన్నవారు, ఆరబెట్టేందుకు కొద్దిగా స్థలం ఉన్నవారు ఇంకా ఎక్కువ రోలర్లు తీసుకోవాల్సి ఉంటుంది. ఒక యంత్రానికి 10 రోలర్లు ఉన్నట్లయితే రోజుకు ఒక వ్యక్తి 8 పని గంటలలో 40కి పైగా చీరలను రోలింగ్ చేసుకోవచ్చు. ఈ యంత్రం ఏర్పాటు చేసుకునేందుకు ఒక చిన్న బెడ్‌రూం అంత గది, రోలింగ్ చేసిన చీరలను ఆరబెట్టుకోవటానికి ఇంటిముందు లేదా వెనక లేదా ఇంటిపైన కొద్దిగా స్థలం ఉంటే చాలు. ఈ యంత్రం ఖరీదు దాదాపు రెండున్నర లక్షల దాకా ఉంటుంది.

ఇప్పటిదాకా కేవలం మూడు యంత్రాలను చేసి ఇచ్చాడు. కానీ, వాటిని తీసుకున్న అందరూ చాలా సంతోషంగా ఉన్నారు. చీర





రోలింగ్‌లో నాణ్యత వల్ల తమకు గిరాకీ బాగా ఉందని, ఆరబెట్టడానికి స్థలం సరిపోవటం లేదు. ఈ యంత్రంలోనే చీర త్వరగా ఆర గలిగేలా ఏదైనా హీటర్ లాంటిది ఏర్పాటు చేస్తే బావుంటుందని సలహా ఇస్తున్నారు. ఆ విషయమై కొద్దిగా ఆలోచిస్తున్నాను అన్నాడు ఇన్నోవేటర్ శివచంద్ర ప్రసాద్.

ఎటువంటి ప్రత్యేక శిక్షణ, నైపుణ్యం అవసరం లేకుండా ఒక మహిళ ఈ యంత్రంతో రోజుకు 30 చీరల రోలింగ్ చేసి, సరాసరిన చీరకు  సరాసరిన 100 రూపాయలు వేసుకున్నా రోజుకు 3 వేల వరకు సంపాదించవచ్చు. అవసరమైన రసాయనాలు, కరెంటు ఖర్చు, యంత్రం కొనుగోలు ఖర్చును అరుగుదల ఖర్చులు అన్నీ పోను రోజుకు కనీసం 1500 దాకా మహిళకు మిగులుతుంది. ఎవ్వరి పైనా ఆధారపడకుండా మహిళలు తమ స్వంత కాళ్ళపై నిలబడి సంపాదించు కోవచ్చు.

ప్రభుత్వం లేదా ఎవరైనా స్వచ్ఛంద సహాయం చెయ్యగలిగితే యంత్రాన్ని ఇంకా తక్కువ ధరలోనే, నాణ్యంగా తయారు చేసి ఇవ్వ గలనని, చీరలు ఇంకా త్వరగా ఆరే విధంగా కూడా ఇదే యంత్రంలోనే ఏర్పాటు చెయ్యాలన్న ఆలోచనలో ఉన్నట్లు తెలిపాడు ఇన్నోవేటర్ శివచంద్ర ప్రసాద్. ఇతనికి అవసరమైన పెట్టుబడి కోసం, ఇతని రోలింగ్ యంత్రాన్ని తయారు చేయటానికి 'పల్లెసృజన' తన శాయశక్తులా కృషి చేస్తుంది. ఈ రోలింగ్ మిషన్ సమాజంలోని కొన్ని అవసరాలను తీర్చడమే కాకుండా ఉపాధి పొందడానికి సరైన మార్గమని 'పల్లెసృజన' భావిస్తోంది. నిరుద్యోగ యువతీ యువకులు ఈ యంత్రాన్ని కొనుగోలు చేసుకుని, ఇంట్లోనే స్వయం ఉపాధి పొంది సమాజంలో ధైర్యంగా బ్రతికే అవకాశాన్ని జారవిడుచుకోవద్దని తెలియజేస్తోంది 'పల్లెసృజన'. ●

**ఇన్నోవేటర్ శివచంద్ర ప్రసాద్, ఫోన్ : 9642249555**



# హెచ్.ఆర్.ఎం.ఎన్.-99 రకం ఆపిల్ మొక్కల సాగుకు సూచనలు



ఇన్నోవేటర్ హరిమాన్ శర్మ

హిమాచల ప్రదేశ్‌కు చెందిన హరిమాన్ శర్మ 'ఆపిల్' పండించే ఒక సాధారణ రైతు. ఎన్నో సంవత్సరాలు రైతుగా పరిశోధనలు చేసి ఆపిల్ కేవలం శీతల ప్రదేశాల్లో మాత్రవే కాదు, 48 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత ఉన్న ప్రాంతాల్లో కూడా పంట వచ్చే విధంగా మొక్కను అభివృద్ధి చేశాడు. ఇతను చేసిన సృజన (ఇన్నోవేషన్)ను 'హనీబీ నెట్‌వర్క్' ద్వారా వెలుగులోకి వచ్చింది. 2017వ సం. 'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.)' వారి 10వ ద్వైవార్షిక ఇన్నోవే షన్ & సాంప్రదాయ జ్ఞానం పోటీలలో 'రాష్ట్రపతి పురస్కారం' పొంది నాటి రాష్ట్రపతి 'ప్రణబ్ ముఖర్జీ' గారి చేతుల మీదుగా హరిమాన్ శర్మ పురస్కారం అందుకోవడం జరిగింది.

ఎన్.ఐ.ఎఫ్. కొలాబరేటర్‌గా, హనీబీ నెట్‌వర్క్ లో భాగంగా ఉభయ తెలుగు రాష్ట్రాలలో పనిచేసే 'పల్లెసృజన' ద్వారా మన తెలుగు రైతాంగానికి ఈ మొక్కలను పరిచయం చెయ్యడం జరిగుతోంది. 'పల్లెసృజన' సౌజన్యంతో ఇన్నోవేషన్‌లను 'పల్లె కిసాన్' మరియు 'క్రియేటివ్ మైండ్స్' సంస్థల ద్వారా సమాజానికి అందజేయడం జరుగుతోంది.

ఈ 'హెచ్.ఆర్.ఎం.ఎన్.-99 ఆపిల్' రకం ఏ రకమైన పొలం లో నైనా సరే పెరిగి, 48 డిగ్రీల ఎండను కూడా తట్టుకుని దిగుబడి వస్తుంది. ఈ మొక్కలు ప్రతి సంవత్సరం నవంబర్ నెలలో నవెూదు చేసుకుని, డిశంబర్ మాసం లో రైతులకు సరఫరా చేయబడుతున్నాయి. ఈ పరంపరలో గత 3 సంవత్సరాలుగా దాదాపు 10 వేలకు పైగా మొక్కలను రైతులకు అందజేయడం జరిగింది. సరఫరా చేసిన వాటిలో 65 నుండి 95 శాతం మొక్కలు చిగురించి మొక్కలు పెరుగు తున్నాయి.



ఆపిల్ తెలుగు రాష్ట్రాల్లోని దాదాపు అన్ని జిల్లాలకు సరఫరా చేయబడ్డ మొక్కలు ఎక్కువ శాతం రైతులవి ఏపుగా పెరుగు తున్నాయి. కొందరి మొక్కలు కాయలు కాయటం, వాటిని రుచి చూడటంతో ప్రస్తుతం రైతులు వినూత్నమైన యాపిల్ చెట్లు నాటేందుకు మొగ్గు చూపుతున్నారు.

## HRMN-99 ఆపిల్ సాగు వివిధ దశల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు

**1. భూమి తయారీ, గుంటలు తీయటం, నింపటం:** మొక్కలు నాటడానికి ఒక నెల ముందు వరుసల మధ్య 5 నుండి 6 మీటర్లు, మొక్కల మధ్య 2.5 మీటర్లు ఎడం ఉండేలా గుంతలు త్రవ్వుకోండి. వెడల్పు, పొడవు, లోతు ఒక మీటరు ఉండేలా గుంతలను తయారు చేసి ఉంచుకో వాలి. గుంతలో మొక్క నాటడానికి ముందు 10–20 కిలోల పేడ ఎరువు, 50–75 గ్రా. డిఎపి, 20–25 గ్రా. పొటాష్ లను మట్టిలో కలిపి గుంతలను పూడ్చాలి.

**2. మొక్కలు నాటడం:** ఈ ఆపిల్ మొక్కలను డిశంబర్ నుండి ఫిబ్రవరి మాసాల్లో నాటుకోవచ్చు. కాబట్టి మీకు మొక్కలు చేరిన వెంటనే నర్సరీలో ఉపయోగించే పాలిథిన్ కవర్లు లేదా మట్టి కుండీలలో పెంచి, చిగుర్లు వేసిన తర్వాత నాటుకుంటే మంచిది. మొక్కను గుంట మధ్యలో



రైతుకు చేరే మొక్కలు ఇలా ఉంటాయి. కేవలం ఒక పుల్ల, క్రింద వేర్లు, రెండూ కలిపి అంటు కట్టిన ప్లాస్టిక్ పేపరు ఉంటుంది.

# ఆపిల్ పండిస్తున్న సిరిసిల్లా జిల్లా రైతు 'బాబు' అనుభవాలు



నేను 2020లో ఆపిల్ చెట్లు మనవద్ద కూడా పండుతాయి అని వేములవాడకు చెందిన 'బాలకృష్ణ' అనే మిత్రుడు చెప్పాడు. వీటిని కూడా చూద్దాం ఎలా వస్తాయో అని బాలకృష్ణ 25, నేను 10 మొక్కలు తెప్పించుకున్నాము. నేను నాటిన 10 మొక్కలలో 7 మొక్కలు బాగా ఎదిగాయి. నేనేమీ వీటి పట్ల ప్రత్యేక శ్రద్ధ అయితే పెట్టలేదు, మామూలు గా నా తోటలోని జామ, శ్రీగంథం చెట్లతో పాటే సోపతి చేశాను.

రెండవ సంవత్సరం ఒక్కో చెట్టుకు 5–6 కాయలు కాశాయి. పిందెలు మొదట లేత ఆకుపచ్చ రంగులో వచ్చాయి. ఇవి ఇలాగే గ్రీన్ ఆపిల్ లాగా ఉంటాయేమో అనుకున్నాను. కానీ కాయ సైజు పెద్దగా అయ్యే కొద్దీ ఎరుపు రంగు జీరలు పెరగటం జరిగింది. మొత్తాని కి కాయ పెద్దగా అయ్యాక మార్కెట్‌లో లభించే ఆపిల్ పండ్లలాగే ఎరుపు రంగులోకి వచ్చాయి. ఈ పండ్లు పాకానికి వచ్చాయని గుర్తు పట్టడం ఎలాగో తెలియదు కాబట్టి తెంపకుండా అలాగే ఉంచాను. కొద్ది రోజులకు కాయలు పగలటం ప్రారంభమైంది. అప్పుడు అర్థమైంది. ఈ పండ్లు పక్వానికి వచ్చినట్లు ఎలా గుర్తు పట్టాలో. చెట్లు చిన్నవిగా ఉండ టం వల్లనేమో కాయ సైజు పెద్దగా రాలేదు. పండ్లను నేను మా మిత్రులు, కుటుంబ సభ్యులము తిన్నాము. చాలా తియ్యగా ఉన్నాయి. రుచి చూసిన తర్వాత అనిపించింది. ఈ పండ్లు మన వద్ద తప్పక కాస్తాయి అని. మొక్కలను అందించిన 'పల్లెసృజన' మరియు సుభాష్ గారికి ధన్యవాదములు.



తెలంగాణ లో రైతు బాబు ఆడపిల్ తోటలోని పంట

రైతు 'బాబు', ఫోన్ నెం. 9603852434

నాటి, మొక్క చుట్టూ కాలితో మృదువుగా (తేలికగా) తొక్కాల్సి ఉంటుంది. ఇలా తొక్కడం వల్ల వేర్లు బలంగా పెరుగుతాయి. మొక్క గ్రాఫ్టింగ్ భాగం భూమికి 10 నుండి 20 సెంటీమీర్లు పైకి ఉండేలా చూసుకోవాలి.

**3. నీరు అందించడం :** మొదటిసారి నీరు మొక్క నాటిన వెంటనే అందించాలి. ఎండా కాలంలో అయితే నెలకి 3-4 సార్లు, చలికాలంలో అయితే నెలకి 2 సార్లు నీరు తప్పక అందించాలి. వర్షా కాలంలో గుంతలలో నీరు నిలువకుండా ఉండేలా ఏర్పాటు చేసుకోవాలి. వర్షాకాలంలో మొక్కల చుట్టూ ఉన్న గుంటలలో ముఖ్యంగా మొక్క వేర్లు వున్న ప్రదేశంలో నీరు ఆగకుండా చూసుకోవాలి. మొక్కల వద్ద నీరు నిలిచినట్లయితే మొక్క 24 గంటల్లో చనిపోయే ప్రమాదముంది. ఎండాకాలం నెలకు 5 లేదా 6 సార్లు, చలి కాలంలో నెలకు 2-3 సార్లు మొక్కకు నీరు తప్పక అందించాలి.

**4. కలుపు నివారణ:** గుంట లోపల, గుంట చుట్టూ ఎటువంటి కలుపు మొక్కలు పెరగకుండా చూసుకోవాలి. సంవత్సరానికి కనీసం నాలుగు సార్లు కలుపు తీయాల్సి ఉంటుంది. కలుపు తీసేటపుడు మొక్క వేర్లు చెదిరిపోకుండా జాగ్రత్త పాటించాలి. కలుపు నివారణ రసాయనాలు ఎట్టి పరిస్థితుల్లో వాడవద్దు. అవి మొక్కకు హాని కలిగించవచ్చు. గుంటలోపల మరియు గుంట చుట్టూ తడి ఆరిపోకుండా పాలిథిన్ పేపరు లేదా ఎండు గడ్డిని కప్పి ఉంచితే మంచిది.

**5. మొక్కల రక్షణ:** సాధారణంగా ఆపిల్ పంట సముద్ర మట్టానికి 1,524 మీటర్ల ఎత్తున వున్న ప్రదేశాల్లో మాత్రమే వేస్తారు. కానీ, ఈ **HRMN-99** ఆపిల్ రకం వేడి ప్రాంతాల్లో కూడా పండుతుంది. దీనికి ప్రత్యేకించి ఏ రసాయనాలు వాడవలసిన అవసరం లేదు. కానీ, పండ్లు కాసే సమయంలో వచ్చే కొన్ని రకాల చీడల పీడల నుండి రక్షించుకునేందుకు copper oxychlorside 2.5 ppm సంవత్సరానికి ఒకసారి పిచికారి చేస్తే సరిపోతుంది. అదేవిధంగా Tree Spray Oil (10 ppm) డిశంబర్ నెలలో తప్పక పిచికారి చేయాలి. ఇలా చేయటం వల్ల నాణ్యత కలిగిన ఆపిల్ పండ్ల దిగుబడి పొందవచ్చు. ఏదైనా పురుగు కానీ, తెగులు కానీ సోకినట్లయితే దాన్ని ఫొటో తీసి పంపినట్లయితే తగిన సూచనలు అందించగలం. స్థానికంగా లభించే పురుగు మందులు, చీడపీడల నివారణకు ఉపయోగించవచ్చు.

**6. ప్రూనింగ్ (కత్తిరింపులు):** మొక్క నాటిన ఒక సంవత్సరం తర్వాత అంటే డిశంబర్‌లో మొక్క పై భాగంలో వున్న 4-5 కొమ్మలను వదిలి క్రింద వున్న మొత్తం కొమ్మలను కత్తిరించాలి. రెండో సంవత్సరం లో ఇలా వదిలిన 4-5 కొమ్మలను కత్తిరించుకొని కవర్లలో నాటినట్లయితే కొత్త మొక్కలు తయారౌతాయి. అంటే మీ మొక్కలు మీరే తయారు చేసుకోవచ్చు. మొత్తంమీద మీ మొక్క రెండవ సంవత్సరం నుండి గొడుగులా ఉండాలి. అంటే తిరగేసిన ఆంగ్ల అక్షరం 'వి' (V) ఆకారం ఉండాలన్నమాట. క్రింది భాగంలో మాత్రం కొమ్మలు ఏమాత్రం రాకుండా కత్తిరిస్తూ ఉండాలి. అంటే కాండం బలంగా తయారయ్యేలా చూసుకోవాలి.



మొక్కలు నాటిన 7 నుండి 15 రోజులలో ఇలా చిగుర్లు వేస్తాయి. భూమి నాణ్యతను బట్టి 2-3 రోజులు అటు ఇటు కావచ్చు.

ప్రతి డిశంబర్ నెలలో చెట్లను తప్పక ప్రూనింగ్ చేసి, చెదల నివారణకై 10 మి.లీ. chlorpyrifos లేదా Trisil లేదా 'తులసి' సేంద్రియ పురుగు మందు లేదా ఏదైనా మీవద్ద లభించే మందు 0.03 శాతం తీసుకుని 5 లీటర్ల నీటిలో కలిపి మొక్కకు పిచికారి తప్పక చేయాలి.

అ) ఎండిపోయిన ఆకులు, కొమ్మలు, చీడ పట్టిన ఆకులు కొమ్మలు పొలం నుండి తీసి దూరంగా వేయాలి.

ఆ) అంటు కట్టిన భాగానికి క్రింద వచ్చిన కొమ్మ లను, ఆకులను ఎప్పటికప్పుడు తప్పక తీసివేయాలి.

ఇ) మొదటి రెండు సంవత్సరాల్లో వచ్చే పూతను తప్పక త్రుంచి వేయాలి.


ఈ) ప్రతి డిశంబర్ నెలలో తప్పక చెప్పిన పద్ధతిలో ప్రూనింగ్ చెయ్యాలి.



మీ మొక్కలు మామూలుగా ఇలా పెరుగుతాయి



మొక్కలను 'డిశంబర్' మాసంలో ప్రూనింగ్ చేసినట్లయితే ఇలా ఉంటాయి




హెచ్.ఆర్.ఎం.ఎన్.-99 ఆపిల్ మొక్కలు కావలసిన రైతులు క్రింది ఫోన్ నెంబర్లలో సంప్రదించండి: పల్లె వీరరాఘవ రెడ్డి, 'పల్లెకిసాన్', ఫోన్: 81257 99904, సుభాష్ చందర్, 'క్రియేటివ్ మైండ్స్', ఫోన్: 9652801700

## ఉపాధ్యాయుల డైలమా ......

# సమాధానం చెప్పలేని విద్యార్థుల ప్రశ్నలు

**- అనామక ఉపాధ్యాయుడు**

ప్రభుత్వ పాఠశాలల్లో కొంతమంది విద్యార్థులు అడిగే ప్రశ్నలు **గొప్ప గొప్ప శాస్త్రవేత్తలని తలపిస్తాయి.** అలా ఒక ఉపాధ్యాయుడి సర్వీస్ లో ఎదురైన సంఘటనల ఆధారంగా విద్యార్థులు అడిగిన కొన్ని ప్రశ్నలు మీ ముందు :

**"చంద్రునిపై కాలు మోపడం"** నిజమే అని నేను నమ్మాను. అయిదో తరగిలో ఈ వార్త చదివి వినిపిస్తే.... పిల్లలంతా ఆశ్చర్యంగా నమ్మారు. ఒక్క సతీష్ గాడు తప్ప....

నమ్మిన మిగతా పిల్లలందర్నీ జాలిగా చూసాడు. నన్ను, పేపర్ లోని అమెరికా వాళ్ళు దిగిన చంద్రమండలం లోని బొమ్మని మార్చి మార్చి చూసాడు. వాడి చూపులు నన్ను కలవర పెట్టాయి.

'నీ డౌట్ ఏంట్రా ..... అమెరికా వాళ్ళు ఖచ్చితంగా చంద్ర మండలానికి వెళ్ళి వచ్చారు. అదే ఈ వార్త' అన్నాను. "నేను నమ్మట్లేదు సార్...." అన్నాడు ధృడంగా.. "ఎందుకురా.. నువ్వేమైనా చూసొచ్చావా" అన్నాను కోపంగా. ప్రపంచమంతా ఒప్పుకుంటుంటే వీడేంటి అన్న అసహనం పుట్టుకొచ్చింది. **"చంద్రమండలం మీద గాలి లేదన్నారు కదా సార్, మరి అమెరికా వాళ్ళ జెండా ఎలా రెపరెపలాడుతుంది?"** అన్నాడు. ఖంగుతిన్నాను.....

వాడి ప్రశ్న వందలాది వేట కొడవళ్ళుగా మారి అమెరికా వైపు దూసుకెళ్తున్నట్టు.... అగ్రరాజ్యాన్ని నిలదీస్తున్నట్టు.... కలవర పెట్టింది వాడి మొహంలో చిద్విలాసం.

**నిజమే. ఇప్పుడు నాకూ నమ్మకం కలగట్లేదు.....**

ఇరవై ఏళ్లలో ఎన్ని బదిలీలైనా.... ఏ వూరుకెళ్ళినా ఆ ప్రశ్నలు వెండాడుతుంటాయి. ప్రశ్న వేసిన ఆ పిల్లల మొహాలు మర్చిపోలేనంతగా వేటాడుతాయి.

పదేళ్లకింద చర్లపల్లె స్కూల్లో అలాంటి ప్రశ్నే ఎదురైంది.

నేను ప్రశ్న వేసిన నాలుగో తరగి చదివే 'రమేష్' గాడి మొహం ఇప్పటికీ మనసులోంచి చెక్కు చెదరలేదు.

అప్పట్లో నాలుగో తరగతి తెలుగు వాచకంలో **'కల్పవృక్షం'** అనే పాఠం ఉండేది. తాటిచెట్టు కల్పవృక్షం లాంటిది. తాటికొమ్మలు గుడిసె వేసుకోవటానికి, తాటి ముంజలు తినటానికి... తాటి దూనెలు నీరు పారించుకోవటానికి, ఇలా తాటిచెట్టులోని ప్రతీది మనిషికి పనికొస్తుంది. ఇలా అడిగిందల్లా ఇస్తుంది కాబట్టి తాటిచెట్టును కల్పవృక్షంతో పోల్చారు అంటూ పాఠాన్ని వివరించినప్పుడు.... చెబుతున్నంతసేపూ.... రమేష్ గాడి మొహం చిన్నబోయింది. వాడి కళ్ళల్లో తడి......... నేను అబద్ధం చెప్తున్నట్టు కోపం... నాకేమీ అర్థం కాలేదు.. "రమేష్.... ఏమైందిరా...' అనడిగాను.

"మా అయ్య రోజూ తాటికల్లు తాగొచ్చి అమ్మనూ, నన్నూ, తమ్ముణ్ని బాగా కొడతాడు. తాటిచెట్టు మంచిదెట్లయితది సార్..."

వాడి ప్రశ్నకి.... షాక్ తిన్నాను. నన్నే కాదు.... విద్యా వ్యవస్థనే ప్రశ్నించినట్లయింది వాడి ప్రశ్న. నిజానికి తాటిచెట్టు పాఠంలో 'కల్లు' ప్రస్తావన ఎక్కడా లేదు. **తాటిచెట్టు కల్పవృక్షంతో పోల్చదగిందేనా....**

వాడికి నేను సమాధానం చెప్పాలి. ఏం చెప్పాలి...???

చివరకు "తాటికల్లు మంచిదేరా.... కాకపోతే ఓ కప్పుగాని, అరకప్పుగాని తాగితే మంచిది, కాని మీ నాన్న కుండల కొద్దీ తాగుతాడు కాబట్టి అలా ప్రవర్తిస్తున్నాడు" అంటూ ఇంకొంచెం విపులంగా చెప్పాను. అయినా నా సమాధానం వాన్ని సంతృప్తి పర్చలేదు. అంతకు మించి చెప్ప డానికి నాక్కూడా ఏం తోచలేదు. వాడు అయిష్టంగానే కూర్చున్నాడు.

వాడి ప్రశ్న ఇప్పటికీ నన్ను వెంటాడుతునే ఉంటుంది.

సుజాత టీచర్ ఓరోజు మూడో తరగతిలో 'బంగారు బాతు గుడ్డు' పాఠం చెప్పింది. ఒక బాతు రోజూ బంగారు గుడ్లు పెడుతుంటే.... అత్యాశతో దాన్ని కోసి.... యజమాని భంగ పడ్డాడని అనే పాఠ్యాంశాన్ని చెప్పింది.

**"బాతుని కోస్తే తప్పేంటి టీచర్... బాతు కడుపులో గుడ్డు తయారవుతుంది కాని బంగారం తయారు కాదు గదా... అందుకే బాతుని కోసి చూసాడేమో టీచర్** యజమాని. తప్పేంటి? కాదంటారా?" అని అడిగాడు.

ఈమధ్య మా స్కూళ్ళలో 'నిజాయితీ పెట్టె'లు పెట్టాలని విద్యాశాఖ సూచించింది. ఏ పిల్లవాడికైనా ఏదైనా దొరికితే దాంట్లో వేయాలి. టీచర్ దాన్ని తీసి అది పోగొట్టుకున్న పిల్లలకి అందజేస్తాడు. ఇది పిల్లల్లో నిజాయితీని పెంచుతుంది. పిల్లలు కూడా ఏవి దొరికినా ఉత్సాహంగా దాంట్లో వేస్తున్నారు. మొన్నీమధ్య 'తిరుపతి నా పెన్ను దొంగతనం చేసాడు సార్' అంటూ రాధిక అనే అమ్మాయి నాకు ఫిర్యాదు చేసింది.

"అవును... వాడు పెన్ను దొంగతనం చేసాడు సార్" అంటూ పిల్లలందరూ చెప్పారు. తిరుపతి గాడిని పిలిచి షడిగితే మౌనంగా ఉండిపోయాడు. వాడి బ్యాగ్ తీసి పుస్తకాలు బయట పడేసి వెతికినా దొరకలేదు. చివరికి గట్టిగా "ఎక్కడ దాచావురా" అని అడిగితే 'నిజాయితీ పెట్టె'ని చూపించాడు. నాకు ఆశ్చర్యం వేసింది.

పెట్టెని తెలిచి చూస్తే, రాధిక పెన్ను అందులో ఉంది. "దాంట్లో ఎందుకు వేశావురా?'' అని అడిగాను. రోజూ అందరికీ ఏవేవో దొరుకుతున్నాయి. పెట్టెలో వేస్తున్నారు. నాకేం దొరకట్లేదు....... అందుకే పెన్ను తీసి అందులో వేసాను" అని చెప్పాడు. నాకు బుర్ర తిరిగి పోయింది.



పిల్లలందరిలోను ఒకటే ప్రశ్న. తిరుపతి దొంగనా, నిజాయితీ పరుడా. దొంగతనం చేసాడు కాబట్టి దొంగే కదాసార్ అన్నారు కొందరు. పెట్టెలో వేసాడు కాబట్టి నిజాయితీ పరుడే కదాసార్.... అని మరి కొందరు పిల్లలు వాదించారు.

చివరికి వాడు **నిజాయితీ పరుడే** అని వాళ్లని సమాధాన పర్చడానికి ఒక పీరియడ్ అయిపోయింది.

ఇలాంటి ఇబ్బందికర ప్రశ్నలకి సమాధానం దొరక్క చాలా మంది టీచర్లు సహనం కోల్పోతారు.

**ముఖ్యంగా తరగతి గదిలో దొంగతనం, కులం ఈ రెండు ఉద్రిక్తతని సృష్టిస్తాయి.**

అలాగే కులం ప్రస్తావన వచ్చినప్పుడల్లా నాకు 'వేదవతి' అనే పాప గుర్తుకు వస్తుంది. శ్రీరాములపల్లె స్కూల్లో పనిచేసేటపుడు మధ్యాహ్నం భోజనం సమయంలో ప్రతి మంగళవారం ఉడకబెట్టిన కోడిగుడ్డు పెట్టేవాళ్లం.

మూడో తరగతి చదివే వేదవతి అనే పాప మాత్రం తన ప్లేటులో వేసిన గుడ్డుని టీచర్లు చూడకుండా వేరే పిల్లలకి ఇచ్చేది. ఓసారి అది గమనించిన నేను హెడ్‌మాస్టర్‌కి చెప్పాను. ఆయన పాపను పిలిచి గుడ్డు తింటే గుండెకు బలం వస్తుందని బుజ్జగించి మరీ చెప్పటంతో చాలా ఇష్టంగా కోడిగుడ్డు తింది.

ఆ తర్వాత వేదవతి నాలుగు రోజుల వరకు పాఠశాలకు రాలేదు. అనుమానంతో నేను హెడ్మాస్టరు కలిసి వాళ్లింటికి వెళ్లాం. మమ్మల్ని చూడగానే వాళ్లమ్మ దాడి చేసినంత వేగంగా కయ్యానికి దిగింది. "మేం బ్రాహ్మలం... మా పాపచేత కోడిగుడ్డు తనిపిస్తారా... మీ స్కూల్‌కి నా బిడ్డని చస్తే పంపించను" అంటూ గొడవ పడింది. గుడ్డు తిన్న పాపానికి వేదవతిని బాగా కొట్టినట్టుంది. జ్వరంతో పడుకుంది. మమ్మల్ని చూడగానే భయంగా నీరసంగా లేచి నుల్చుంది.

కోడిగుడ్డు శాఖాహారమే అంటూ మహాత్మాగాంధీ చెప్పిన మాటలు కూడా ఆమె దగ్గర ఏం పని చెయ్యలేదు. చివరికి పాప చదువు పాడైపోతుందని, కోడిగుడ్డు తనకి పెట్టించమని మేం హామీ ఇచ్చాక గానీ బడికి పంపడానికి ఒప్పుకోలేదు.

వేదవతి జ్వరంతోనే మర్నాడు స్కూల్‌కొచ్చింది. వేదవతి మెల్లిగా తలొంచుకొని నా దగ్గరకొచ్చింది. "హోంవర్కు చేసావా?" అనడిగాను. మాట్లాడలేదు..... నిమిషం సేపు నిశ్శబ్దంగా నా కళ్లలోకి సూటిగా చూస్తూ.... **"మేమెందుకు కోడిగుడ్డు తినకూడదు సార్?"** అనడిగింది. ఎవరో గుండెమీద సర్రున చరిచినట్లయింది నాకు..... ఆ ప్రశ్నకు ఏ సమాధానం లేదు నా దగ్గర......... ఇంట్లో స్వేచ్ఛని చంపే ఆచారాలు బడిలో కూడా ఎంతగా ప్రభావం చూపిస్తాయో వేదవతి ప్రశ్న నన్ను ఇప్పటికీ వెంటాడుతుంది.

"దానికి బదులుగా నీకు అరటిపండు తెప్పిస్తాను సరేనా" అని భుజం తట్టి పంపించాను.

పల్లల ప్రశ్నలకు మనమంతా నమ్మకం నిండేలా జవాబు చెప్పకపోతే ఏదో వెలితిగా వుంటుంది. వాళ్ల అనుమానంలోంచి పుట్టే ప్రశ్నకి రాగద్వేషాలుండవు.

సినారేకి జ్ఞానపీఠం అవార్డు వచ్చాక చాలామంది పండిత పామరులు రకరకాల ప్రశ్నలతో ఇంటర్వ్యూ చేసారు. ఓసారి స్కూల్ పిల్లలు కూడా ఆయన్ని ఇంటర్‌వ్యూ చేస్తున్నప్పుడు... మెధావులెవరూ అడగని ప్రశ్న ఒక పాప అడింంది.

**"మీ పూర్తి పేరు సింగిరెడ్డి నారాయణ రెడ్డి కదా. మరి మీపేరు ముందు 'ఎస్' రావాలిగాని 'సి' ఎలా వస్తుంది?"** అని.

ఆయన ఆశ్చర్యపోయారట.... ఇప్పటివరకూ ఎవరూ అడగని ప్రశ్న... "పదో తరగతి మార్కుల మెమోలో 'ఎస్'కి బదులు 'సి' అనిం పండిందమ్మా. అప్పట్నించి సి. నారాయణ రెడ్డి అనే పిలుస్తున్నారు అని నవ్వేసారట.

తరగతి గది లోపల పుట్టే ప్రశ్నలో నిజాయితీ వుంటుంది. **సమాధానం కూడా అంతే నిజాయితీగా లేనప్పుడు రానురాను వాళ్లు ప్రశ్నలు వేయటం మానుకుంటారు.**

ప్రశ్నించే స్వేచ్ఛని పాఠశాలల్లో బాగా విస్తరిస్తే ప్రతి పాఠ్యాంశం గురించి మేమంతా హోంవర్క్ చేసుకోవాల్సిందే.....

"పల్లెసృజన" మొదటినుంచి విద్యార్థుల మనో భావాలు వెలుగులోకి రావాలి అని చెప్తున్న అంశం ఇప్పటికి బయటకు రావటం ముదావహం. ఉపాధ్యాయులు చిన్నారులలో ప్రశ్నించే గుణాన్ని పెంపొందించటానికి ప్రయత్నించటం వల్ల ఎన్నో కొత్త విషయాలు వెలుగులోకి వస్తాయని నమ్మిన 'పల్లెసృజన' భావానికి ఈ సంఘటనలు రూపమిచ్చాయి అనటంలో ఎలాంటి సందేహం లేదు. ●

## సమస్యలకు ఆహ్వానం

**'పల్లెసృజన' ఇంతవరకు సమాజంలోని సమస్యలకు పరిష్కారాలు (ఇన్నోవే షన్‌లను) వెతికి, వెలుగులోకి తీసుకు రావడానికి స్వచ్ఛందంగా గత పదిహేడు సంవత్సరాలుగా ప్రయత్నాలు చేస్తున్నది. వాటివల్ల పునాది స్థాయి ఇన్నోవేటర్ల సృజనాత్మక శక్తి వెలుగులోకి రావటంతో పాటు, ఎంతోమందికి శారీరకంగా, ఆర్థికంగా, సమయ పరంగా ఎంతో లాభం చేకూరింది. ఈ ప్రయాణంలో పరిష్కారాలు వెతికిన అనుభవంతో సమాజంలో వున్న సమస్యలను కూడా వెతికి పల్లెసృజన కుటుంబంలో వున్న ఇన్నోవేటర్ల ద్వారా పరిష్కారాలు చేయిస్తే సమాజానికి ఇంకా లాభం చేకూరు తుందని భావించాం.**

**గ్రామాల్లో మీరెవరైనా వ్యక్తిగతంగా లేదా నలుగురికీ సంబంధించిన ఏదైనా సమస్యకు పరిష్కారం వుంటే బావుంటుంది అనుకుంటున్నారా? ఐతే అటువంటి సమస్యలను క్రింద ఇచ్చిన వాట్స్ యాప్ నంబర్లకి పంపగలరు. ఎన్ని సమస్యలైనా పంపవచ్చు. పరిష్కారాలను మా ఇన్నోవేటర్ల సహాయ సహకారాలతో వెతికే ప్రయత్నాలను, వాటి ప్రగతిని మీకు 'పల్లెసృజన' పత్రిక ద్వారా తెలియజేస్తూ వుంటాము.**

**వాట్స్ యాప్ నంబర్లు : బ్రిగేడియర్ గణేశం, 9866001678, సుభాష్ చందర్, 9652801700**



# రాజేశ్వరీ రవికుమార్
# తక్కువ ఖర్చుతో పౌష్టిక ఆహార ప్రదాత

తమిళనాడు తంజావూర్ జిల్లాలోని తిరువయ్యూరులో నివసించే 58 సంవత్సరాల రాజేశ్వరి 10వ తరగతి వరకు చదువుకొన్నది. భర్త రవికుమార్ మరియు ఇద్దరు కుమార్తెలతో సంసారం చేసుకుంటూనే "సుగ డైట్ నాచురల్ ప్రోటీన్ ఫుడ్స్" పేరిట చిన్న వ్యాపారం ప్రారంభించి, దినదిన ప్రవర్ధమానంగా ఎదుగుతూ ఇప్పుడు మరో ఏడుగురికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగింది. తను వ్యాపారం ప్రారంభించటానికి ముందు పత్రికలలో, రేడియోలో పౌష్టిక ఆహారం గురించి, ఆహారం – ఆరోగ్యం గురించి చిన్న కథనాలు, ఉపన్యాసాలు ఇచ్చేది. ఆ ప్రక్రియలో వచ్చిన ప్రోత్సాహంతో ఆర్థికావసరాలు ఉన్న తోటి మహిళలకు కూడా ఉపాధి కల్పించాలన్న సదుద్దేశ్యంతో ఈ వ్యాపారం ప్రారంభించింది.

పౌష్టిక ఆరోగ్యాన్నిచ్చే కొర్రలు, అవిశలు, అరికలు, రాగులు, దంపుడు బియ్యం, బ్రౌన్ రైస్, ఉలవలు, జొన్నలు, సజ్జలు, పచ్చ జొన్నలు, మక్కజొన్నలు, బార్లీ, సోయ, అరికలు, ఊదలు, అండుకొర్రలు, బరిగలు మొదలైన ధాన్యాలు, వాటితో పాటు, మెంతులు, వాము, మిరియాలు, జీలకర్ర, శొంఠి, వెల్లుల్లి, యాలకులు మొదలైన అనేక ఔషధ దినుసులను మేళవించి చాలావరకు పొడులు, మిశ్రమాలు తయారు చేస్తారు. ఇవి సాధారణ రోగ నిరోధక శక్తిని ఇవ్వటం, మధుమేహం (చక్కెర) వ్యాధి నియంత్రణ, రక్తపోటు (బీపీ) నియంత్రణ, అదనపు కొవ్వును కరిగించటం, గుండె సంబంధిత వ్యాధులను అరికట్టటం, రక్తంలోని ఎర్ర రక్తకణాలలో హిమోగ్లోబిన్‌ని పెంచటం, కడుపుతో వున్న, బాలింత మహిళలకు పౌష్టిక ఆహారం, పిల్లలకి రుచికరమైన పౌష్టిక ఆహారం మొదలైన విషయాలలో ఎంతో మేలు చేస్తాయి.

శ్రీమతి రాజేశ్వరీ రవికుమార్ గత ఎనిమిది సంవత్సరాల క్రితమే ఈ సంస్థని ప్రారంభించి, ఇప్పడు మంచి ప్రాచుర్యం పొందారు. ప్రారంభించినపుడు కేవలం రెండు మిశ్రమాలు, ఇద్దరు సహాయకులతో ప్రారంభించి తెలిసిన వారికి, స్నేహితులకి, చుట్టాలకి, ఇరుగు పొరుగు వారికి అమ్మేది. వారు ఇచ్చిన సూచనలు, సలహాలను పాటించి, తగిన మార్పులు చేర్పులు చేస్తూ కొత్త కొత్త మిశ్రమాలను రూపొందించారు. దీనికి అవసరమైన నూతన యంత్రాల కొరకు బ్యాంకు నుండి 'ముద్ర' ఋణాలను చాలా కష్టపడి సంపాదించ గలిగింది. ఇప్పుడు తన గ్రామంలోనే ఒక చిన్న కర్మాగారాన్ని స్థాపించింది.

ప్రారంభంలో తన ఉత్పత్తులని అమ్మటానికి అనేక కష్టాలు పడ్డ ఈమె క్రమంగా తమిళనాడు లోని సూర్వోదయ సంఘం మరియు ఖాదీ గ్రామోద్యోగ భవన్‌ల ద్వారా తన ఉత్పత్తులని విక్రయించసాగింది. తరువాత ఇంకా ఎన్నో రకాల ఉత్పత్తులలని జోడించి తన వ్యాపారం విస్తరించటానికి IIFPT వారిని సంప్రదించింది. ఆ తర్వాత NIFTEM వారివద్ద శిక్షణ పొంది, ప్రస్తుతం తమిళనాడు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 250 రకాల చిరు ధాన్యాల ఉత్పత్తులను విక్రయిస్తోంది. ఈమె ప్రత్యేకత ఏమిటంటే, ఆమె తన ఉత్పత్తులలో ఏవిధమైన రసాయనాలు, రంగులు వాడదు. అందుకే వినియోగదారుల వద్దనుంచి మంచి ప్రోత్సాహం లభిస్తోంది అంటారామె.

ఈ మధ్య ఈమె నెలకు 7 నుంచి 10 టన్నుల వరకు తన ఉత్పత్తులను పెంచారు. ప్రస్తుతం ఈమెవద్ద ఏడుగురు సహాయకులుంటే వీరు ప్రతిరోజు 50 వేల మంది వినియోగదారుల అవసరాలను తీరుస్తున్నారు. ఈమె సాంప్రదాయ చిరుధాన్యాల ఉత్పత్తులతో పాటు కాలమాన పరిస్థితులకు అనుగుణంగా డాక్టర్ల సలహా మేరకు రోగులకు, సామాన్య ప్రజలకి కూడా అవసరమైన ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. ఈ కార్మాగారం ద్వారా కొందరికి ఉపాధి కలిగించటమే కాక పరోక్షంగా ఇంకా ఎంతోమందికి తన ఉత్పత్తుల అమ్మకాలతో ఉపాధి




కల్పిస్తున్నది.

ఈమె వసతి గృహాల్లో విద్యార్థులకు కూడా తన ఉత్పత్తులని వ్యాపింపజేసి, యువతలో ఆరోగ్యకరమైన చిరు ధాన్యాలు తినటం అలవాటు చేస్తున్నది. ఆస్పత్రులలోని రోగులకు శక్తినిచ్చే మిశ్రమాలు, సూపులు, మూలిక 'టీ'లు మొదలైనవి చాలా మేలు చేస్తున్నాయనీ, అదేవిధంగా అమ్మటానికి కృషి చేస్తున్నామనీ తెలిపారు. తద్వారా వారు చక్కని అదనపు ఆదాయం పొందుతున్నారు.

మన పూర్వీకుల నుంచి ఆహారపు అలవాట్లు వారికి పెద్ద వయస్సులో కూడా ఆరోగ్యంగా ఉండేలా చేసిందనీ, వారు ప్రధానంగా చిరు ధాన్యాలు తినేవారు కానీ ఈ రోజుల్లో అవి కాదని, రకరకాల ఏమాత్రం పౌష్టిక శక్తిని ఇవ్వని ఆహారాలు తినటం వలన తక్కువ వయస్సులోనే అనారోగ్యాల పాలు పడుతున్నారు. ఆహార మార్పుల వలన కలిగిన అనర్థాలను తిరిగి ఆహార మార్పు వల్లనే సరిదిద్దాలని తాను ప్రయత్నిస్తున్నాని అంటారామె. తన దేశాన్ని ఆరోగ్యవంతంగా చెయ్యాలన్నదే తన ఉద్దేశ్యమని చెప్తారామె.

ఈమె తన "సుగ డైట్ అండ్ ఫుడ్స్" సంస్థ ద్వారా మన దేశంలో ఇదివరకున్న సాంప్రదాయ ఆహారపు అలవాట్లను పునరుజ్జీవింప చెయ్యటానికి తనవంతు కృషి చేస్తోంది. మన పూర్వీకులు ప్రకృతి ధర్మంగా సహజ సిద్ధమైన ధాన్యాలు, పప్పులు వాడేవారు. వారు చిరుధాన్యాలతో సంకటి, జావ, ముద్దలు చేసుకొని తినేవారు. అందుకే ఏవిధమైన అనారోగ్యాలు లేక చాలా ఆరోగ్యంగా జీవించేవారు. జ్వరానికి, జలుబు లాంటివొస్తే కూడా మందులు చాలా అరుదుగా, అది కూడా సహజంగా మన వంటింట్లో లభించే దినుసులతో చేసినవే తినేవారు. ఇప్పుడు చిరు ధాన్యాలు తినటానికని, యువతని



ప్రోత్సహించటానికి కేవలం సంకటి, జావలే కాకుండా, వడలు, బిస్కట్లు, కేకులు, అట్లు, పొంగల్, ఉప్మా, దోశ, అడయ్ లాంటి ఇంకా ఎన్నో రకాలు అందుబాటులోకి వాడకానికి తెచ్చారు. ఈవిధంగా మన యువత చిరు ధాన్యాలపై మక్కువ పెంచుకొని ఆరోగ్యకరమైన ఆహారం తింటారని ప్రయత్నిస్తున్నారు. వారిలో ఒకరు రాజేశ్వరి గారు. స్వల్ప సమయంలో తయారు చేసుకొనే విధంగా ఏవిధమైన కల్తీ, రసాయనాలు, రంగులు లేకుండా సహజ సిద్ధమైన స్వచ్ఛమైన ఆహారం అందిస్తున్నది.

ఏదైనా ఒక వ్యాపకం, వ్యాపారం చేస్తూ తమ కాళ్ళపై తాము నిలబడాలని కోరుకునే ఔత్సాహికులైన ఇన్నోవేటర్లు, వ్యాపారస్తులకి ఆమె స్ఫూర్తిదాయినిగా నిలుస్తారు. పట్టుదలతో పాటు, కష్టపడే తత్వం ఉంటే, అయినవాళ్ళ తోడ్పాటు ఉంటే మహిళలు కూడా ఏదైనా సాధించగలరని చెప్పటానికి ఈమె మంచి ఉదాహరణగా ఎంచవచ్చు. ఈమె ఇదేవిధంగా అభివృద్ధి చెందుతూ అనేకమంది మహిళలకు స్ఫూర్తి ప్రదాయినిగా నిలవాలని 'పల్లెసృజన' కోరుకుంటోంది. ●

**శ్రీమతి రాజేశ్వరి, ఫోన్ : 8608260308**

## 'పల్లెసృజన'కు జాతీయ స్థాయి గుర్తింపు

మన 'పల్లెసృజన' కు జాతీయ స్థాయిలో "సంత్ ఈశ్వర్ సేవా సమ్మాన్" పురస్కారం లభించింది. నవంబర్ 13న న్యూఢిల్లీలోని విజ్ఞాన భవన్‌లో మన దేశ ఉప రాష్ట్రపతి శ్రీ జగదీప్ ధన్‌కర్ గారి చేతుల మీదుగా ఈ పురస్కారం అంద జేయ బడుతుందని 'సంత్ ఈశ్వర్ ఫౌండేషన్' వారు ప్రకటించారు. అహర్నిశ సేవలు అందించే వారికి/సంస్థలకు ఈ పురస్కారం అందజేస్తారు. ఈ సందర్భంగా పల్లెసృజన కుటుంబం, ఇన్నోవేటర్లు, స్వచ్ఛంద కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, ప్రోత్సాహం అందించిన వారందరికీ మనసారా శుభాభినందనలు, ధన్యవాదములు తెలియజేసుకుంటోంది 'పల్లె సృజన'.

# 'పునాది స్థాయి ఇన్నోవేషన్ల'తో గ్రామీణ యువతకు స్వయం ఉపాధి



- వీరరాఘవ రెడ్డి

గ్రామల్లో యువతీ యువకులు వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు, ఇతర కారణాల రీత్యా ఉన్నత చదువులు చదవలేక పోతున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే మన దేశంలో ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత స్థాయి చదువులకు వెళ్తున్న యువత కేవలం 23 శాతం. అంటే 73 శాతం యువత ఉన్నత చదువులు చదవలేక పోతున్నారు. ఎంతోమంది ఉపాధి కోసం ఎదురు చూపులు చూస్తున్న సంగతి అందరికీ విదితమే. తమ చదువుకు తగిన ఉపాధి లభించటం లేదని కొందరు, ఏదైనా ఉద్యోగం సాధిద్దామంటే తగినంత చదువు చదవలేక పోయామే అని కొందరు, ఏదైనా వ్యాపారం చేసుకుందామంటే బ్యాంకులు ఎలాంటి తనఖా లేకుండా తమకు రుణం ఇవ్వటం లేదని కొందరు..... ఇలా ఎన్నో రకాలుగా ఆలోచిస్తూ, ఏమి చెయ్యాలో తెలీక నిస్సహాయంగా గ్రామ యువత కాలం గడుపుతున్నారు.

ఇలాంటి యువత కొరకు తమ గ్రామంలోనే వుండి, తాము తల్లిదండ్రులపైన ఆధార పడకుండా తమ ఖర్చులకు అవసరమైన ధనాన్ని తామే సంపాదించుకోవటంతో పాటు తామే కుటుంబానికి కాస్త చేదోడుగా తయారవుతూ, తమను తిట్టిన నోళ్ళే పొగిడేలా తయారు కావడానికి అవసరమైన ఎన్నో పునాది స్థాయి ఇన్నోవేషన్లను 'పల్లెసృజన' వెలుగులోకి తెచ్చింది. ఏ పని చేస్తున్నామన్నది ముఖ్యం కాదు, తాము చేస్తున్న పని ఎంత మందికి ఉపయోగ పడుతున్నది, దానివల్ల తాము ఎంత సంపాదిస్తున్నాము, గతంకన్నా ఇప్పుడు మనపైన ఎంత గౌరవం పెరిగింది అన్నది ఆలోచిస్తే చాలు మీ భవిష్యత్తును మీరే తీర్చి దిద్దుకున్నవారు అవుతారు. ఈ పరంపరలో 2021 జులై–ఆగస్టు సంచిక నుండి యువత ఉపాధి కొరకు వెలుగులోకి వచ్చిన ఇన్నోవేషన్లను గురించి తెలియజేస్తోంది 'పల్లెసృజన'.

– ఎడిటర్.

## కరెంటు వైర్లలోని లోహాన్ని సులభంగా తీయటం ఉపాధితో పాటు పర్యావరణ పరిరక్షణ

ఆధునికత వైపు పరుగు పెడుతున్న గ్రామాల్లోకి ప్రస్తుతం దాదాపు అన్ని రకాల వ్యాపారస్తులు చేరుకుంటున్నారు. వీరిలో ఉపయోగంలో లేని విద్యుత్ (కరెంటు) వైర్లను కొనుగోలు చేయటం కూడా ఒక వ్యాపారం. ఆ సంచార వ్యాపారస్తులు ఉపయోగంలో లేని విద్యుత్ వైర్లను టోకుగా కొనుగోలు చేసి దానికి బదులుగా వినియోగ దారులకు తినుబండారాలు, వస్త్రాలు, వంట సామాగ్రి లేదా నగదును ఇస్తూ ఉంటారు. అలా కొనుగోలు చేసిన వైర్లను పోగు చేసిన తర్వాత వాటిని జనసంచారం లేని చోటకు తీసుకు వెళ్ళి కాల్చడం ద్వారా వైరు పైన వున్న ప్లాస్టిక్ మొత్తం కాలిపోయి, కేవలం లోపల ఉన్న వైరు మాత్రమే మిగులుతుంది. చల్లారిన తర్వాత ఆ కాలిన వైర్లను తిరిగి తమ స్వస్థలానికి తీసుకు వచ్చి, చేతితో శుభ్రం చేసి, లోహపు తీగలను సేకరించి విక్రయిస్తూ ఉంటారు. ఇదో పెద్ద ప్రసహనంతో కూడుకున్న ప్రక్రియ.

ఇలా చేయటం వల్ల పర్యావరణానికి, మనుషులకూ కలిగే నష్టాలు చాలా ఉన్నాయి. వైర్లను కాల్చటం వల్ల ఒకరకమైన వాసనతో కూడిన దట్టమైన పొగ పర్యావరణంలో కలిసిపోయి, గాలి కలుషితం కావలం వల్ల ఎన్నో నష్టాలు సంభవిస్తాయి. మనుషులు, పశు పక్ష్యాదులు ఈ కలుషితమైన పొగను పీల్చటం ద్వారా కొన్ని రోగాలు సంభవించే అవకాశం ఉంది. ఇది క్యాన్సర్ రోగానికి కూడా దారితీసే ప్రమాదం ఎంతైనా ఉంది. ఈ కలుషితమైన దట్టమైన పొగ ప్రకృతితో పాటు, పంటలకు కూడా నష్టం చేకూర్చే అవకాశాలుంటాయి. కాల్చిన వైర్లను చేతులతో శుభ్రం చేసి, లోహపు వైర్లను సేకరించే పనిలో అందులో పనిచేసే వ్యక్తులు ఆ కాలిన వైర్ల వాసన వల్ల రోగగ్రస్తులు అయ్యే అవకాశాలు ఎక్కువ. చేతులకు కాలిన ప్లాస్టిక్ తగలటం వల్ల చేతులు అపరిశుభ్రంగా మారటమే కాదు, వాటిని సరిగ్గా శుభ్రం చేసుకోలేక పోతే ఆ ప్లాస్టిక్ వున్న చేతులతోనే భోజనం చేయటం వల్ల కడుపులోకి కూడా కొంతమేర వెళ్ళే అవకాశం ఉంటుంది. అందువల్ల కూడా ఎన్నో రోగాలకు కారణం అవుతుందీ ఈ ప్లాస్టిక్ మహమ్మారి. పైగా ఈ పనికి ఎంతోమంది కూలీలు అవసరం అవుతారు కాబట్టి ఇది చాలా ఖర్చుతో కూడుకున్న పని. ప్లాస్టిక్ కాలి, కరగటం వలన భూమిలో కలిసి కలుషితం చేస్తుంది. భూమిలోని జీవాలకు ఇది ప్రాణహాని చేస్తుంది. భూమి మెల్లమెల్లగా నిస్సారమౌతుంది.

ఇలా వ్యాపారస్తులు శుభ్రం చేసిన లోహపు వైరును మార్కెట్‌లో విక్రయించేటపుడు వాటికి సరియైన ధర లభించదు. కారణం ఆ లోహపు తీగలను ఎంతగా శుభ్రం చేసినా, అందులో ఇంకా కాలుష్యం ఉంటుంది కాబట్టి ఈ లోహపు తీగలను కొనుగోలు చేసిన





టోకు వ్యాపారులు వాటిని ప్రత్యేక యంత్రాల ద్వారా మళ్ళీ శుభ్రం చేసి, అందులోని మలినాలను పూర్తిగా తీసివేయటం వల్లనే అవి తిరిగి ఉపయోగంలోకి వచ్చే అవకాశం ఉంటుంది. కాలిన వైర్లలో క్వాలిటి తక్కువగా ఉండటం వల్ల ధర కూడా తక్కువగా లభిస్తుంది. ఈవిధంగా వాడిన వైర్లనుండి లోహాలను తీసేవారు నష్టాలకు గురవతారు. ఈ పని మన సమాజానికి ఎంతో అవసరం. కానీ వ్యవస్థలో ఎలాంటి సాంకేతిక సహాయం ఈ పనికి చెయ్యటం లేదు.

ఈ సమస్యలన్నిటికి కేవలం ఒక చిన్న యంత్రాన్ని తయారు చేసి పరిష్కరించాడు విజయవాడకు చెందిన ఇన్నోవేటర్ 'జలీల్'. ఇతను తయారు చేసిన యంత్రాన్ని వినియోగించడం ద్వారా కేవలం ఒకరిద్దరు వ్యక్తులు వైర్లను కాల్చకుండా, లోహాన్ని వేరు చేయకుండా, పర్యావరణానికి ఎటువంటి హాని చెయ్యకుండా వైర్లలోని లోహపు తీగలను బయటకు తీయవచ్చు. ఇలా బయటకు తీసిన లోహపు వైర్లు ఎంతో పరిశుభ్రంగా ఉంటాయి కాబట్టి మార్కెట్‌లో ఎంతో ఎక్కువ ధర లభిస్తుంది. వైర్లను కాల్చి, లోహాన్ని వేరు చేయటానికి ఉపయోగ పడే వ్యక్తుల ఖర్చు సగానికి పైగా తగ్గుతుంది. పర్యావరణానికి ఎటువంటి హాని ఉండదు. ఈ యంత్రం ఉపయోగం వల్ల వినియోగ దారునికి చేకూరే అదనపు ఆదాయం ఒకటి ఉంది. లోహపు తీగలను వేరు చేసిన తర్వాత వచ్చే ప్లాస్టిక్ పొరలను కూడా విక్రయించి అదనపు ఆదాయాన్ని పొందవచ్చు. ఈ పనులన్నీ చేయటానికి కేవలం ఇంట్లో ఒక చిన్న గది





చాలు. వైర్లను కాల్చటానికి నిర్మానుష్య ప్రదేశానికి తీసుకు వెళ్ళే ఖర్చు అస్సలు ఉండదు. చేతికి ఎటువంటి ప్లాస్టిక్ వ్యర్థాలు అంటుకునే అవకాశం లేదు కాబట్టి ఆ పనిచేసే వారి ఆరోగ్యానికి ఎటువంటి ఢోకా లేదు. ఈ యంత్రం ప్రత్యేకత ఏమిటంటే, మీరు కొనుగోలు చేసే ఏ పరిమాణం (సైజు)లో ఉన్న వైరునైనా సరే ఇదే యంత్రం మీద వేరు చేయవచ్చు. లావుగా ఉన్న వైరుకు ఓ యంత్రం, సన్నగా ఉన్న వైరుకు మరో యంత్రం ఇలా వేరువేరు యంత్రాలను కొనుగోలు చేయాల్సిన అవసరం లేదు. ప్లాస్టిక్ వైరును యంత్రానికి అందిస్తే చాలు, దాన్ని లోహపు తీగకు ఎటువంటి హాని జరగకుండా, వేరు చేస్తుంది. బయకు వచ్చిన వైరును చేతితో సులభంగా వేరు చేయటం ద్వారా ప్లాస్టిక్, లోహపు వైరు వేరువేరుగా చేసుకోవచ్చు. ఈ యంత్రంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల పరిమాణాల్లోని నొక్కుల ద్వారా మీరు అందించే వైరు ఏ పరిమాణానికి సరిపోతుందో అందులోకి చొప్పించడమే మీ పని.

వైరు నుండి ఈ యంత్రం ఉపయోగించి, లోహాన్ని వేరు చేయడం చాలా సులభం, శ్రమ తక్కువ. నైపుణ్యం అవసరం లేని పని. అందుకే గృహ పరిశ్రమలా, ఇంట్లో ఖాళీగా వున్న పెద్దవాళ్ళు, పిల్లలు, మహిళలు ఈ పనిని ఆరంభించి, కొంత ఆదాయాన్ని పొందవచ్చు.

ఇన్ని రకాల ఉపయోగాలున్న ఈ యంత్రాన్ని కొనుగోలు చేయటం ద్వారా యువకులు తమ చుట్టుపట్ల గ్రామాల్లోని వృదా కరెంటు వైర్లను కొనుగోలు చేసి, ఇంట్లోనే ఉండి పని చేసుకోవటం ద్వారా అదనపు ఆదాయాన్ని సమకూర్చుకొని నిరుద్యోగ సమస్య నుండి తమతట తాము బయట పడటమే కాదు, ఒకరిద్దరికి ఉపాధి కల్పించిన వారవుతారు కూడా. ఈ ప్లాస్టిక్ వైర్ల కొనుగోలు అయ్యే ఖర్చు తక్కువ, కానీ అందులోని లోహాన్ని వెలికి తీసి విక్రయించడం ద్వారా లభించే ఆదాయం చాలా ఎక్కువ.

కాబట్టి గ్రామీణ యువతీ యువకులు ఈ యంత్రాన్ని కొనుగోలు చేసి, మీ ఇంట్లోనే స్వయం ఉపాధి పొందమని సలహా ఇస్తోంది 'పల్లెసృజన'. ఈ యంత్రం ఖరీదు కూడా చాలా తక్కువ. సమాన్యుడికి కూడా అందుబాటు ధరలోనే ఉంటుంది.

యంత్రం రూపొందించిన **ఇన్నోవేటర్ జలీల్ (ఫోన్ నెం. 99124 99061)**ను సంప్రదించండి. ఇంకా పూర్తి వివరాల కొరకు సంప్రదించండి **'సుభాష్ చందర్, ఫోన్ : 96528 01700 లేదా వీరరాఘవ రెడ్డి, ఫోన్ : 81257 99904'** లను సంప్రదించి పూర్తి వివరాలు తీలుసుకో గలరు. **ఎవరి గ్రామంలో వారు నివసిస్తూనే ఉపాధి పొందటమే లక్ష్యంగా యువతకు ఇన్నోవేషన్‌ల ద్వారా వ్యాపార మార్గాలను పరిచయం చేస్తోంది 'పల్లెసృజన'.**

National Innovation Foundation-India

# నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) - ఇండియా

స్వయంప్రతిపత్తి గల సంస్థ, శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వము.

# జాతీయ 13 వ ద్వైవార్షిక పోటీలు

**పునాది స్థాయిలో సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలు (ఇన్నోవేషన్లు) మరియు సంప్రదాయ జ్ఞానముల గుర్తింపు**



## ఆకాశాన్ని అందుకోవాలన్న ఆశ....

ఉత్తమమైన వాటిగా గుర్తించ బడిన వాటిలో జాతీయ మొదటి **బహుమతిగా రూ. 5,00,000, జాతీయ** రెండవ **బహుమతిగా రూ. 3,00,000, జాతీయ మూడవ బహుమతిగా రూ. 1,00,000**లను వివిధ వర్గాలలో ఇవ్వబడును. జీవిత కాలపు సాఫల్యత పురస్కారం క్రింద రూ. **7,50,000**లు గొప్ప ఇన్నోవేటర్‌కు లేదా ఇన్నోవేషన్లనే జీవితంగా ఏర్పరచుకొన్న వారికి ఇవ్వబడును. అంతే కాదు ప్రోత్సాహక బహుమతి క్రింది రూ. **10,000**లను వివిధ వర్గాలలో ఎన్నుకోబడిన ఇన్నోవేషన్లు, సమాజ శ్రేయస్సుకు, పర్యావరణానికి తోడ్పడ్డ వాటికి ఇవ్వబడును.

ఇవే కాక పునాది స్థాయిలో సాంకేతిక విజ్ఞానాన్ని వెతికి వెలికి తీయటానికి దోహదపడిన వ్యక్తులు లేదా సంస్థలకు కూడా గుర్తింపు ఉంటుంది. అదేవిధంగా సాంకేతిక జ్ఞానం కలవారు, పునాది స్థాయిలో ఇన్నోవేషన్లను వెలికి తీయటానికి కృషి చేసిన ఎలక్ట్రానిక్/ ప్రింట్ మీడియా జర్నలిస్టులకి కూడా గుర్తింపు ఉంటుంది. ఈ దరఖాస్తులను **31 మార్చి, 2023** లోగా మాకు చేరేలా పంపండి.

**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్** (ఎన్.ఐ.ఎఫ్.) తన 13వ జాతీయ ద్వైవార్షిక పోటీలకు గాను ఎవరి సహాయమూ లేకుండా రూపొందించిన పునాది స్థాయికి చెందిన సాంకేతిక ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞానం గురించిన దరఖాస్తులను కోరుతున్నది. ఈ ఇన్నోవేషన్లను రైతులు, కళాకారులు, చేతివృతుల వారు, జాలర్లు, మహిళలు వ్యక్తిగతంగా కాని, సామూహికంగా కాని పంపవచ్చు. మహిళలు, మురికి వాడల్లో నివసించే వారు, వర్క్‌షాప్ మెకానిక్‌లు, విద్యార్థులు, స్థానిక సమాజాలకి ప్రాధాన్యత ఇవ్వబడును. ఈ సృజనలు వ్యవసాయం (పనిముట్లు, యంత్రములు, కొత్త పద్ధతులు, కొత్త వంగడాలు మొదలైనవి), గృహోపకరణాలు, రవాణా, శక్తి (ఎనర్జీ), ఉత్పత్తి/ పరిరక్షణ, పని భారాన్ని తగ్గించటము, మూలికా వైద్యము (మానవులు మరియు జంతువులు) మొదలైన వాటికి సంబంధించినవై మరియు తక్కువ ఖర్చుతో కూడుకుని, ఎక్కువ కాలం మనగలిగి, పర్యావరణానికి హానికరం కానివై ఉండాలి. ఈ ఆలోచనలు లేదా నమూనాలు బయటివారి సహాయము/ పర్యవేక్షణ లేకుండా తాము స్వంతంగా తయారు చేసినవై, ఇతరుల నుండి ఎటువంటి సాంకేతిక సలహాలు తీసుకోకుండా రూపొందించినవై ఉండాలి. మహిళల కొరకు మహిళలచే, వికలాంగుల కొరకు వికలాంగులచే రూపొందించబడిన ఇన్నోవేషన్లు, ఉత్తమమైన సాంకేతిక జ్ఞానానికి ప్రత్యేకమైన బహుమతులు ఇవ్వబడుతాయి.

## దరఖాస్తు దారులకు గమనిక

**వ్యక్తిగతంగా కానీ, సమూహంగా కానీ ఎన్ని ఐడియాలనైనా వ్రాసి పంపవచ్చు.**
**మీ ఐడియా/ ఇన్నోవేషన్/ సాంప్రదాయ జ్ఞానానికి సంబంధించిన సాంకేతిక వివరాలు, ఫొటోలు, వీడియోలు ఏవి వున్నా పంపాలి.**
**దరఖాస్తుదారుడు తన విద్యార్హతలు, మీ వృత్తి వివరాలను తెలియజేయాలి.**
**మీ గుర్తింపు కార్డు (ఆధార్/ ఓటర్ కార్డు/ ప్రభుత్వం నుండి పొందిన ఏదైనా) కాపీని తప్పనిసరిగా జత చేయాలి.**
**మీ పూర్తి పోస్టల్ చిరునామా తప్పనిసరిగా పంపాలి.**

## దరఖాస్తు చేయుటకు చివరి తేది 31 మార్చి, 2023

**మీ ఆవిష్కరణలను పంపవలసిన చిరునామా :**

**National Innovation Foundation,**
**C/o Gram Bharati, Amrapur, Gandhi Nagar-Mahudi Road, Gandhi Nagar, Gujarat-382 721.**
**Phone: (02764) 350001/ 02/ 03/ 04/ 05/ 06 Email: campaign@nifindia.org, Website: www.nif.org.in**

**సూచన :** వృత్తిపరమైన అనుభవం కలవారు లేదా వృత్తి కళాశాలలో చదువుకొనే విద్యార్థులు ఎన్.ఐ.ఎఫ్. నుండి ఏవిధమైన ఆర్థిక సహాయానికి కాని, పురస్కారాలకు కానీ అర్హులు కారని గమనించవలెను. అయినప్పటికీ అటువంటి వారు గ్రామస్థాయి ఇన్నోవేషన్లకి మెరుగు దిద్దినట్లయితే ఎన్.ఐ.ఎఫ్. వారిని గుర్తిస్తుంది. అర్హత వివరాలు, ఇతర మార్గదర్శకాలకై https://nif.org.in/announcement/biennial_competition సంప్రదించండి. లేదా **'పల్లెసృజన'** కార్యాలయాన్ని (**ఫోన్ : 040–40253096**) సంప్రదించండి.

# సెప్టెంబర్ - అక్టోబర్ 2022 లో జరిగిన 'పల్లెసృజన' విశేషాలు







అక్టోబర్9, 2022 నాడు 'వందేమాతరం' ఫౌండేషన్ నిర్వహించిన 'విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయటం' అనే కార్యక్రమం మహబూబాబాద్ జిల్లాలోని దాదాపు అన్ని పాఠశాలల ఉపాధ్యాయులతో 'ఓరియంటేషన్ వర్క్‌షాప్' నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 250 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శశాంక్ మరియు వరంగల్ ఎన్ఐటి డైరెక్టర్ రమణరావు గార్లు పాల్గొని 'పల్లెసృజన ఇన్నోవేటర్లు షణ్ముఖరావు, మహిపాల్ చారి, వెంకటేష్, వెల్లె శ్రీనివాస్, ముప్పారపు రాజు, యాకర గణేశ్ మరియు 'పల్లెసృజన' కో-ఆర్డినేటర్ సుభాష్‌లను సత్కరించి అభినందించారు.





ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంలో వరినాటు యంత్రం తయారీ,
పని విధానం పరిశీలించిన కామారెడ్డి జిల్లా కలెక్టర్ శ్రీ జితేష్ వి. పాటిల్ గారు
ఇన్నోవేటర్ నాగస్వామి చారిని అభినందించడం జరిగింది.
ఈ సందర్భంగా జుక్కల్ నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీ హన్మంత్ షిండే గారు
ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్నప్పటి చిత్రం.



'మంకీగన్' తయారు చేసిన యువ రైతు ఇన్నోవేటర్ 'మహేష్ రెడ్డి'కి ఇంటింటా
ఇన్నోవేటర్ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి
మరియు జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి లు ప్రశంసా పత్రాన్ని అందిస్తున్న చిత్రం.

## సెప్టెంబర్ 18న జరిగిన 'టెడెక్స్' కార్యక్రమంలో పాల్గొన్న ఇన్నోవేటర్ల చిత్రాలు




















# జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి రెడీ టు సేల్' ప్రచురణ సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## కుదుపులను తట్టుకొనే చంక ఊతకర్రలు (క్రచెస్) :

**సమస్య - పరిష్కారం :**

కాళ్ళులేని అవిటివారు చంకలో ఊతకర్రలు పట్టుకుని నడవటానికి ఎంతలా కష్టపడుతుంటారో అందరికీ తెలిసిందే. రోజంతా నడవాలంటే మరీ కష్టంగా ఉంటుంది. ఇటువంటి వారి కష్టాన్ని గమనించి అస్సాం రాష్ట్రానికి చెందిన 'అర్చన కొక్వర్' ఈ సమస్యను పరిష్కరించాలి అనుకొంది. ఎక్కువ సమయం ఇటువంటి కర్రలు ఉపయోగించి నడిచేవారు చంకల్లో నొప్పి తట్టుకోవటానికి, ద్విచక్ర వాహనాల చక్రాలు కుదుపులని తట్టుకొనేందుకు అనువుగా ఏర్పాటు చేయబడ్డ 'షాక్ అబ్జార్బర్' పద్ధతిని ఉపయోగించి ఈ ఊత కర్రలు రూపొందించింది.

**పరికరం :**

ఈ ఊత చంక కర్రలు కుదుపులని తట్టుకోవటానికి వీలుగా స్ప్రింగులు ఏర్పాటు చేయబడ్డాయి. నడిచేటప్పుడు భుజాలకి, మెడకు, రొమ్ములకు నొప్పి కలుగకుండా కుషన్‌ను ఏర్పాటు చేసింది. అదేవిధంగా స్ప్రింగులు అమర్చడం వలన హెచ్చు తగ్గులున్న ప్రాంతాలలో నడిచినా సరే నొప్పి లేకుండా ఉండేలా వీటిని తయారు చేసింది. ఈ చేతికర్రలు వికలాంగులకు ఎంతో ఉపయుక్తంగా పనిచేస్తాయి.

**ముఖ్యాంశాలు :**

- పట్టుకోవటానికి ఒడుపుగా తయారు చేసిన ఈ కర్రలు పల్లెలో చేయబడాయి





- చంకలో నొప్పిని తగ్గిస్తుంది.
- సజావుగా, ఎక్కువసేపు నడిచే అవకాశం ఉంటుంది.

**పురస్కారాలు :**

- 2010లో ఇగ్నైట్ పోటీలలో ఉత్తమ బహుమతిని, ఎన్ఐఎఫ్ 2013లో నిర్వహించిన 7వ ద్వైవార్షిక గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్స్ మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలో రాష్ట్ర స్థాయి బహుమతి గెలుచుకున్నది ఇన్నోవేటర్ అర్చన.

## కరెంటు అవసరం లేని వాటర్ కూలర్ :

**సమస్య - పరిష్కారం :** భారతదేశంలో వేసవికాలంలో వేడిని భరించటం, తాగటానికి నీళ్ళు దొరకటం కష్టం, గ్లాసెడు చన్నీళ్ళు దొరకటం కూడా దుర్లభమనే చెప్పాలి. చల్లటి నీళ్ళకోసం ఎంతో కష్టపడి, డబ్బు వెచ్చించి వాటర్ బాటిళ్ళు కొనుక్కోవటం మనం చాలాసార్లు చూశాము. ప్రత్యేకించి ప్రయాణం చేసేవారికి, గ్రామాల్లో కరెంటు సవ్యంగా నిరాటంకంగా వుండని పరిసిస్థతుల్లో చన్నీటి అవసరం బాగా తెలుస్తుంది. మట్టి కుండలు ఉన్నా ఎండ ఒకస్థాయి దాటితే అవీ పని చేయవు. బజార్లో వాటర్ కూలర్లు లభించినా, అవి ఖరీదు ఎక్కువ, పైగా



కరెంటు తప్పనిసరిగా కావాలి. ఈ సమస్యని పరిష్కరించటా నికి గుజరాత్‌కు చెందిన అరవింద్ భాయ్ పటేల్ సహజంగా నీటిని చల్లగా చేసే పరికరం రూపొందించాడు. ఇది చాలా చవకైనది, నిర్వహణ కూడా అసలు లేనట్టే.

**పరికరం :** ఈ సహజసిద్ధమైన వాటర్ కూలర్ ఖర్చు లేకుండా, బైట వేడి, తేమశాతాన్ని బట్టి నీటిని చల్లగా చేస్తుంది. దూది తాడు చుట్టబడి ఎల్లప్పుడూ డ్రిప్పర్ల ద్వారా తడిగా ఉంచటం వల్ల రాగి గొట్టాల లోంచి పారే నీటిని చల్లగా చేస్తుంది. రాగిపైపులపైన చుట్టబడిన దూదిలోని తేమ ఆరకుండా, తిరిగి నీరు పడేలా చేస్తుంది. దీనితో రాగిపైపులు ఎప్పుడూ చల్లగా ఉండి, దానిలోనుంచి పారే నీరు చల్లబడుతుంది. నీరు శుభ్రంగా ఉండటానికి నీటి ఫిల్టర్ కూడా అమర్చబడింది. రాగి పైపులు, ఫిల్టర్







కనడకుండా ఒక స్టీలు డబ్బాలో ఈ కూలర్ ఏర్పాటు చేయబడింది. కేవలం ఒక డ్రమ్ము, దానికి అమర్చబడిన నల్లాలు మాత్రమే కనిపించేలా ఏర్పాటు చేశాడు అరవింద్ భాయ్.

**సాంకేతిక వివరాలు :**

❀ ఈ కూలర్లు 100 లీటర్లు, 150 లీటర్ల సామర్థ్యత కలిగిన రెండు రకాల నమూనాల్లో (మాడల్స్) లభ్యమవుతాయి.

❀ గంటకి 65 నుండి 70 లీటర్ల నీటిని చల్లబరుస్తుంది.

❀ 30–30–80 అంగుళాల కొలతలతో పొడవు, వెడల్పు, ఎత్తు కలిగి వుంటుంది.

❀ స్టెయిన్‌లెస్ స్టీల్ 304 రకంతో తయారు చేయబడింది.

**ముఖ్యాంశాలు :**

❀ బైట వాతావరణ కంటె 8 నుండి 10 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు నీటిని చల్లబరుస్తుంది.

❀ ఎటువంటి శక్తి అవసరం లేదు.

❀ రిపేరు ఖర్చులు కూడా ఉండవు.

❀ రాగి పైపులు వాడటం వల్ల ఆరోగ్యానికి మంచిది.

❀ పదిమంది చేరేచోట వాడటానికి చాలా అనువుగా ఉంటుంది.

**బహుమతులు :** 2013లో ఎన్.ఐ.ఎఫ్. వారి 7వ జాతీయ ద్వైవార్షిక పోటీలలో రాష్ట్రపతిచే బహుమతి అందుకున్నాడు ఇన్నోవేటర్ అరవింద్ భాయ్.

ఇన్నోవేటర్ జయమీన్ పటేల్, ఫోన్ : 9096590358
sales@notiontech.in

**పరికరాలు కావాలనుకున్నవారు సంప్రదించండి :**

**పల్లెసృజన, ఫ్లాట్ నెం. 77, వాయుపురి,**
**సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ – 500 094.**
**ఫోన్ : 040–40253096**
**సెల్ : 96528 01700 (సుభాష్ చందర్)**

# 42వ చిన్న శోధయాత్రీకుల అనుభవాలు



**16–18 సెప్టెంబర్, 22 తేదీలలో ఏలూరు జిల్లా దెందులూరు నుండి గుంటుపల్లి వరకు దాదాపు 50 కి.మీ. జరిగిన శోధయాత్రలో పాల్గొన్న యాత్రీకుల అనుభూతులు.**

శోధయాత్రలో పాల్గొన బోతున్నానని నిర్ణయించు కొన్నప్పటి నుంచి చాలా ఉత్సాహంగా అనిపించింది. నాకు ఇంతకు ముందు లేని అనుభవాలు, నాకు తెలియని విషయాలు ఎన్నో తెలుసుకోవచ్చు అనిపించింది.

నేనూహించినట్లుగానే ఈ శోధయాత్ర నన్ను నాకింతకు ముందు ఎప్పుడూ తెలియని, ప్రపంచానికి తీసుకువెళ్ళింది. స్వచ్ఛమైన ప్రకృతి, గ్రామాలు, గ్రామస్తులు, నాలాంటి యాత్రీకులు ..... ఇదంతా కలా నిజమా అనిపించింది. మంత్రముగ్ధురాలినైపోయాను.

కేవలం భౌతిక విషయాల వెనుక పరిగెడుతున్న ఈ ప్రపంచం కాకుండా నాకు వేరే ప్రపంచం చూపించి నా ఆత్మకి చల్లదనాన్ని అందించిన 'పల్లెసృజన' కు కృతజ్ఞతలు తెలియజేసుకోవాలి. పల్లెల్లో తిరుగుతూ, పల్లెవాసుల జీవితాన్ని తెలుసుకొంటూ పచ్చని ప్రకృతి ఒడిలో రహస్యాలు ఆస్వాదించటానికి ఉద్దేశించబడిన ఇలాంటి శోధయాత్రలు ఎవరినైనా ఆకర్షిస్తాయి.

నా కళ్ళకు కనిపించిన విషయం ఏమిటంటే నాలాటి యాత్రీకులందరికి పల్లెసృజన గురించి, ఈ శోధయాత్ర ఉద్దేశ్యం గురించి ఇంతకుముందే తెలిసి ఉండటం. ఎవరితో మాట్లాడినా వ్యవసాయం గురించి, ప్రకృతి గురించి, పల్లెవాసుల జీవన విధానాల గురించి ఎక్కువగా వివరించ గలవారిలా ఉన్నారు. పల్లీయులు కూడా యాత్రీకుల ను అతిథుల్లా ఎంతో ఆప్యాయతతో స్వీకరించారు.

నేను పల్లెసృజన కుటుంబంలో భాగమైపోయినందుకు చాలా ఆనందిస్తున్నాను. ఆ బంధాన్ని ఇలాగే కొనసాగించాలనుకొంటున్నాను. నా తరుపునుండి పల్లెసృజన ఏవిధమైన సహాయం కావాలన్నా చెయ్యటంలో ముందుండాలని నిశ్చయించుకున్నాను. కుటుంబ సభ్యురాలిగా అది నా బాధ్యత కూడానూ.

యాత్రలో ఇన్నోవేటర్ల కష్ట సుఖాలను కళ్ళకి కట్టినట్లు వివరించిన అంజిరెడ్డి గారికి, సుభాష్ గారికి నా కృతజ్ఞతలు. వారికి పల్లెసృజన అందించిన చేయూతకి నా మనస్సు కరిగిపోయింది. అంజిరెడ్డి గారు నిజంగా విజ్ఞాన ఖని అని చెప్పవచ్చు.

పచ్చనోటు వెనక పరుగెడుతున్న మన ఈ జీవితంలో పచ్చదనానికి, ప్రకృతికి, స్వచ్ఛతకు చిహ్నామైన పల్లెలకు మరియు పల్లెవాసులకు మన సోల్‌ని కనెక్ట్ చేసుకునే ఒక గొప్ప ప్రయాణమే ఈ శోధన యాత్ర.

వెలకట్టలేని ఎన్నో జ్ఞాపకాలు, మరెన్నో పరిచయాలు, ఎటువంటి విద్యా సంస్థలలో బోధన చేయని ఎన్నో ప్రకృతి పాఠాలు నాకు ఈ యాత్ర బహుమతిగా ఇచ్చింది.

'పల్లెసృజన' అనే ఒక కుటుంబంలో నేను కూడా కుటుంబ సభ్యురాలిని అయినందుకు చాలా సంతోషంగా ఉంది. ఈ గొప్ప బంధం భవిష్యత్తులో కూడా ఇలాగే కొనసాగాలని ఆశిస్తున్నాను.

'నిస్వార్థం' అనే పదానికి నిర్వచనమే మన 'పల్లెసృజన' సంస్థ. దీనికి కారణమైన బ్రిగేడియర్ గణేశం గారికి అభినందనలు మరియు కృతజ్ఞతలు. త్వరలో మిమ్మల్ని ప్రత్యక్షంగా కలవాలని ఆశిస్తున్నాను సార్.

'స్వార్థం' అనే పదమే ఎరుగని స్వచ్ఛమైన ఒక ప్రపంచానికి (పల్లెసృజన) నన్ను పరిచయం చేసిన నా స్నేహితుడు హరీష్ గారికి కృతజ్ఞతలు.

**- మహేశ్వరి, బెంగుళూరు**

ప్రియమైన స్నేహితులకు నమస్సులు. నేనొక ఇంజనీరింగ్ విద్యార్థిని. కాలేజిలో నాకు అందరితో కలిసి మెలిసి ఉంటూ, మాట్లాడటం నేర్చుకున్నాను కానీ, జ్ఞానప్రాప్తి కాలేదు. అక్కడ నేర్చుకున్నాను.

యాత్ర ముందు నాకేం తెలీదు. యాత్రలో చాలా తెలుసుకోవాలనుకొని బయలుదేరాను. యాత్రలో చాలానే నేర్చుకొన్నాననే చెప్పాలి. ముఖ్యంగా శ్రీకాంత్, సుభాష్ అన్నలు చాలా సహకరించారు.



జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో 'పిల్లల క్రియాశీలత' ను రాబట్టడానికి మేము నిర్వహించిన కార్యక్రమం జయప్రదంగా జరిగింది. పాల్గొన్న విద్యార్థులు ఎన్నో కొత్త ఆలోచనలు చెప్పారు.

యాత్ర మధ్యలో నేను తోటి యాత్రీకులకి టీ, భోజనం అందించాను. దానితో భోజనాల తరువాత మంచి పరిచయాలు ఏర్పడి ఎన్నో అనుభవాలను వారివద్దనుండి నేర్చుకొన్నాను. అంజిరెడ్డి గారు, సుభాష్ అన్న ఇన్నోవేటర్‌ల కథలను హృద్యంగా చెప్పారు. ముఖ్యంగా రాత్రుళ్ళు మాట్లాడకుండా, "సైలెంట్ వాక్" (నిశ్శబ్ద నడక) చీకట్లో నడవటం అన్నది చాలా కొత్త, చక్కని అనుభవం. రెండవ రోజు మేమంతా జట్లు జట్లుగా చేరి నడవటం చాలా బాగుంది. గ్రామస్తులు కూడా మమ్మల్ని ఎంతో ఆదరంగా చూసుకొన్నారు. మా యాత్ర గురించి తెలుసుకోవటానికి వారు ఉత్సాహం చూపించారు. వారికి కొన్ని కరపత్రాలు, పల్లెసృజన పత్రికలు ఇచ్చాము.

ఈసారి బ్రిగేడియర్ గారు మాతో రాలేక పోవటం బాధ కలిగించింది. ఆయన యాత్రలో లేని లోటు కనిపించింది. ఈ మూడు రోజులు చాలా నేర్చుకొన్నాను. యాత్ర మూడు రోజుల్లో నలుగురు గురువుల (ప్రకృతి, ప్రజలు, తోటి యాత్రీకులు, నేను) నుంచి ఎంతో నేర్చుకొన్నాను.

"ఒరే మోహన్ కాలేజీలో నువ్వేం నేర్చుకొనలేక పోయినా
ఈ మూడు రోజుల యాత్రలో నువ్వు నేర్చుకొంది,
అనుభవించిందీ వచ్చే సెమెస్టర్ పరీక్షలను ఎదుర్కోవటానికి
సరిపోతుంది".

తదుపరి శోధయాత్ర మా పరీక్షల మధ్యలో రాకూడదని కోరుకుంటున్నాను. మంచి హృదయంతో ఇటువంటి యాత్రలని నిర్వహిస్తున్న గణేశం గారితో తదుపరి యాత్రలో పాల్గొనాలని ఉవ్విళ్ళూరుతున్నది నా మనస్సు.

'పల్లెసృజన' నిస్వార్థతకి మారుపేరు. నన్ను ఇటువంటి ఉన్నత భావాలు కలిగిన పల్లెసృజన ప్రపంచానికి పరిచయం చేసిన నా స్నేహితుడు హరీష్‌కి ధన్యవాదాలు, కృతజ్ఞతలు.

**- మోహన్, నర్సారావు పేట**

**శోధనకై యాత్ర**

యాత్రలో నన్ను కదిలించిన అంశాలు.
కుల మతాలకతీతమైన యాత్ర
వర్ణ వర్గాల వాసన లేని యాత్ర
ధనిక పేద భేదము లేని యాత్ర
పరిష్కారం కొరకు సమస్యల వైపు యాత్ర ఈ శోధయాత్ర
అపరిచితుల పరిచయార్థం యాత్ర
ఆత్మశుద్ధి గావించుటకు యాత్ర
ప్రకృతి మాతను పలకరించుటకై యాత్ర
పల్లెతల్లి పాద ధూళిని స్పర్శించుటకై యాత్ర ఈశోధయాత్ర

**- హరీశ్, సిద్దిపేట జిల్లా**

**శోధయాత్ర అంటే సంతృప్తి:**

**దెందులూరు :** రెండు ఇడ్లీ ఇవ్వమ్మా ఫస్ట్. రెండు చాలు అన్నాను. ఆ అమ్మాయి మరియు వాళ్ళ అమ్మ కలిసి ఆ చిన్న టిఫిన్ బండి నడుపుతున్నారు. రెండు చట్నీలు సూపర్‌గా ఉన్నాయి. దోసె వాసన నన్ను టెంప్ట్ చేసింది. ఒక్క దోశె వెయ్యండి అని పురమాయించాను. ఒక దోశె రెండు చట్నీలు. అద్భుతమైన రుచి. ఇంకో దోశె తినకుండా ఆపుకోలేక పోయాను. ఎంత అయింది, అని అడిగాను. పదిహేను రూపాయలు అన్నది ఆమె. ప్లేట్ పదిహేనా అని అడిగా. కాదు అన్నీ కలిపి పదిహేను అన్నది. ఎంత ఒక దోశె అన్నా. ఐదు రూపాయలు ఒక దోశె అని జవాబు. అవాక్కవటం నావంతు. మళ్ళీ అడిగాను. ఈమధ్య చెవుడు వచ్చేందేమో అని. మళ్ళీ అదే సమాధానం. అన్నీ కలిపి పదిహేను రూపాయలు అని. సంపాదన కోసం కాక, కేవలం జరుగుబాటు కోసం పనిచేసే స్వచ్ఛమైన పనసులు. కక్కుర్తి పడకుండా క్వాలిటీ రుచితో చేసే తల్లివంటి చేతులు. ఇలాంటి అనుభవాలు చిన్న శోధయాత్రలోనే సాధ్యం.

శోధయాత్ర అంటే జ్ఞానధార :

మొదటిరోజు యాత్రలో రాత్రి బస ఒక ఫాంహౌస్‌లో. మరునాడు ఉదయం ఆ ఫాం హౌస్ నిర్వాహకుడు శ్రీ విజయ్ సారధి గారి నుండి అపారమైన జ్ఞాన ప్రసారం. అనుభవం స్థితప్రజ్ఞత కొట్టొచ్చినట్లు కనిపించింది వారి మాటల్లో. భాష, స్పష్టత, ఓపిక, అవగాహన ఇవన్నీ కలిపి ఎంత బాగా మాట్లాడారో. వక్క చెట్లు, కోక్ చెట్లు, వెనీలా తీగలకు కాయలు, మిరియాల తీగలు, పచ్చి బుజ్జి మిరియాల రుచి, అన్నీ కలిపి కొంగ్రొత్త జ్ఞానం. అనుభవజ్ఞుల పరిచయం చిన్న శోధయాత్రలోనే సాధ్యం.

**శోధయాత్ర అంటే ప్రకృతిలో పరవశం:**

సగం రోజు అంతా ఎటు చూసినా పైరులు, పచ్చదనం. ఆ తరువాత ఎత్తైన పామ్ వృక్షాలు, మధ్యలో పంట కాలువలు, ఫాం హౌస్‌లు, కొలనులు, బోరింగుల నుండి ధారగా నీళ్ళు, ఆ ప్రకృతి





అందాలు ఆస్వాదిస్తూ కళ్ళలో నింపుకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ, ఒక ఊరినుండి ఇంకో ఊరికి సహయాత్రికులతో నడక. వాగుల్లో స్నానాలు, తోటల్లో భోజనాలు.

**శోధయాత్ర అంటే పల్లె జీవిత సారం:**

రోడ్డు పక్కన ఒక పెద్దాయన కూర్చుని గేదెలు మేస్తుంటే కాపలా కాస్తున్నాడు. ఆయనతో మాట కలిపాను. ఎన్ని గేదెలు బాబాయ్ అని అడగగా, 20 ఉన్నాయి అని సమాధానం చెప్పాడతను. నెలకు కనీసం 25 వేల వరకు సంపాదిస్తాయి. ఒక 5 ఎకరాల పొలం కూడా ఉంది, పామాయిల్ తోట. ఒక కొడుకు ఆస్ట్రేలియాలో ఉద్యోగం, ఇంకో కొడుకు ఇక్కడ వ్యవసాయం చూస్తుంటాడు. ఇలా ఊరూరా రైతులు, పశువుల కాపరులు, బ్యాగులు రిపేరు చేసేవారు, మోటార్లు రిపేరు చేసేవారు, అన్ని రకాల వృత్తులవారు ఎంతో మందిని పలకరిస్తూ, బాబాయ్ అని, అన్నా అని మాట కలుపుతూ వారి జీవితానుభవాలు పల్లె జీవితాలు తెలుసుకుంటూ సాగిపోవటం చిన్నశోధయాత్రలోనే సాధ్యం.

**శోధయాత్ర అంటే విజ్ఞానం, సైన్స్, సృజనాత్మకత, కామన్ సెన్స్:**

నాగ శ్రీనివాస్ అనే ఇన్నోవేటర్ గారిని కలిసాము. 6–7 రకాల ఇన్నోవేషన్‌లు కనిపెట్టారు వారు. చదువు నాలుగో తరగతి. అపారమైన సృజనాత్మక తృష్ణ. మాకు అవన్నీ వివరించారు. ఎంతో వినయవంతుడు. మిగతా యాత్ర అంతా ఒకయెత్తు, ఇన్నోవేటర్‌ని కలిసాము అనే అనుభవం ఒకయెత్తు. చదువుకు సంబంధం లేని సృజనాత్మకత ఎలా సాధ్యం, అంటే ఏమిటి? అనేది తెలుస్తుంది. ఈ ప్రాథమిక పరిజ్ఞానం చిన్న శోధయాత్రతోనే సాధ్యం.

**శోధ యాత్ర అంటే నాయకత్వం మరియు శిష్యత్వం, ఒక బాణం రెండు పిట్టలు:**

యాత్ర ప్రారంభంలో పరిచయ కార్యక్రమం. యాత్ర నియమ నిబంధనలు తెలియజేయడం, దిశా నిర్దేశం. దారి పొడవునా ఇన్నోవేటర్ల స్టోరీలు చెప్పడం. సందేహాలు తీర్చడం. అందరినీ కనిపెట్టి ఉండటం. ఇంకా భోజనం తదితర ఏర్పాట్ల పర్యవేక్షణ. ఇవన్నీ కాక ప్రతి మొక్క గురించి, ఆకు గురించి, చెట్టు గురించి అపారమైన విజ్ఞానం ఆయన సొంతం. అంజిరెడ్డి గారు ఇంతకుముందు కాలేజీ నడిపారు. ఆ బోధనానుభవం మాకు పనికి వచ్చింది. వారివద్ద మా సందేహాలు తీర్చుకోవటానికి. దరిమిలా మొత్తంమీద గొప్ప నాయకత్వం అంజిరెడ్డి గారిది. నాయకత్వ లక్షణాలు తెలుసుకోవటం, నాయకత్వ శిక్షణ ఇవ్వటం చిన్న శోధయాత్రతోనే సాధ్యం.

**శోధయాత్ర అంటే వైవిధ్యం, స్నేహం:**

ఒకరు స్కూలు పిల్లాడు. ఇంకొకరు టీచర్. ఇంకా చాలా మంది ఐటి ఉద్యోగులు, చాలామంది వ్యవసాయం చేస్తున్నవారు, యాత్ర రంగంలోవారు, మొత్తం ముప్పై మంది వివిధ రంగాలవారు ఒకచోట కలిసారు. అందులో నలుగురు మహిళలు, యువతులు కూడా. ఇంత మంది కలిసి గ్రామాల నుండి ఏవైనా నేర్చుకోవాలి అని బయలు దేరాము. ఇంతమంది వివిధ రంగాలవారు, వయసులవారితో కలిసి నడుస్తూ నడుస్తూ కబుర్లు చెప్పుకుంటూ, ఒకరి గురించి ఒకరం తెలుసుకొంటూ వారివారి జ్ఞానం, విద్య, జీవితానుభవాలు పంచుకుంటూ, అడిగి తెలుసుకుంటూ, మూడు రోజులపాటు మైండ్స్ ట్యూన్ చేసుకుంటూ, ఇంత వైవిధ్యభరితమైన ఏక లక్ష్యం చిన్న శోధయాత్రలోనే సాధ్యం.

ఇన్ని విధాల, ఇంకా ఎన్నో విధాల వ్యక్తిత్వ వికాసం, మనోల్లాసం, సమాజ శ్రేయస్సు అన్నీ కలిపి బహుళార్థ సాధకం చిన్నశోధయాత్ర.

**- నాగమోహన్, హైదరాబాద్.**




**'పల్లెసృజన' చందాదారులు కండి ! - పల్లె జ్ఞానం ప్రతి పల్లెకూ చేరేలా చూడండి!!**


'పల్లెసృజన' ద్వారా ఎన్నో పునాది స్థాయి ఇన్నోవేషన్లు, ఇన్నోవేటర్లు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందటంతో పాటు వారి ఇన్నోవేషన్లు కూడా విస్తృత స్థాయిలో సమాజం వినియోగించటం జరుగుతోంది. తక్కువ ఖర్చుతో, ఎక్కువ పనితనాన్ని అనుభవిస్తున్న వినియోగదారులే ఇందుకు సాక్షి. కావున 'పల్లెసృజన' పత్రికను మీరు చదవటమే కాదు, మీ తోటి వారికి కూడా ఈ పత్రికను గురించి తెలియజేసి, వారిని చందాదారులుగా చేర్పించండి. పునాది స్థాయి జ్ఞానాన్ని ప్రపంచ స్థాయికి చేర్చడంలో మీరూ సహకరించండి. - ఎడిటర్

# ఇతర రాష్ట్రాల పల్లె జ్ఞానం

'హనీబీ' ఆంగ్ల పత్రిక సౌజన్యంతో

**రెండుసార్లు నాటు వేయటం ద్వారా 'క్యాబేజి, క్యాలిఫ్లవర్' పంటల అధికోత్పత్తి:**

ఒరిస్సాలోని సుందర్ ఘర్ ప్రాంతంలోని స్థానిక కొండజాతివారు క్యాలిఫ్లవర్, క్యాబేజి పంటల అధికోత్పత్తికి ఈ పద్ధతిని ఉపయోగిస్తున్నారు. ముందుగా విత్తనాలను నారుమడిలో పోసి, మారాకు మొలకెత్తిన తర్వాత ఆ మొలకలను జాగ్రత్తగా తీసి ఇంకొక మడిలో నాటాలి. అక్కడ మొక్కకి దాదాపు ఎనిమిది ఆకులు వచ్చేవరకు ఉంచాలి. ఆ తర్వాత వాటిని తీసి పొలంలో నాటినచో ఆ మొక్క బలంగా, ఆరోగ్యంగా ఉండటంతో పాటు, అధికోత్పత్తిని ఇస్తాయి. షెడ్యూల్డు తెగలకు చెందిన రైతు గణనాథ గత కొన్ని సంవత్సరాలుగా ఈ పద్ధతిని ఉపయోగించి, అధికోత్పత్తిని సాధించాడు.



**కాకర ఆకుల రసంతో పశువుల పుండ్లకు వైద్యం:**

పశువులకు దెబ్బలు, పుండ్లను అలాగే వదిలేస్తే అవి చీము పట్టి సెప్టిక్ అయ్యే ప్రమాదముంది. ఒరిస్సాలోని తర్చర్ అనే గ్రామ ప్రజలు తాజా కాకర ఆకులను మెత్తగా దంచి, ఆ ముద్దను పశువుల పుండ్లు, గాయాలపై పూయటం ద్వారా అవి త్వరగా మానిపోవటం జరుగుతోంది. దీనివలన గాయాలు త్వరగా మానటమే కాకుండా, క్రిమి కీటకాలను కూడా దరి చేరకుండా నిరోధిస్తుంది. ముద్దగానే కాకుండా కాకర ఆకులను చేతితో నలిపి ఆ రసాన్ని గాయం పై వేస్తే కూడా గుణం కనిపిస్తుంది. ప్రకాష్ అనే రైతు ఈ పద్ధతిలో చాలా పశువులకు ఉపశమనం కలిగించాడు.



**నిమ్మజాతికి చెందిన దబ్బ (కర్ణ) కాయ చెట్ల ఆకులతో పశువులలో నులిపురుగుల నివారణ:**


ఒరిస్సా రాష్ట్రంలోని పూరి, అంగూల్, కలహంది ప్రాంతాల్లోని



ప్రజలు దబ్బ (కర్ణ) కాయలను ఆహారంలో వాడు తారు. కానీ లక్ష్మీబెన్ (60 సం.) ఈ చెట్ల ఆకులను పశువులలో నులి పురుగుల నివారణకు వాడుతుంది. ఆమె మూడు నాలుగు ఆకుల రసానికి కొద్దిగా ఉప్పు కలిపి, 150 మి.లీ. నీటిలో కలిపి జ్యూస్ తయారు చేసి పశువులచేత తాగిపిస్తుంది. దీంతో పశువుల కడుపు శుభ్రపడి కడుపు నొప్పితో పాటు నులి పురుగులు కూడా నివారించబడతాయి. ఈ పద్ధతిలో ఈమె ఎన్నో దూడలకు వైద్యాన్ని చేసింది. మూడు నాలుగు ఆకుల రసానికి కొద్దిగా ఉప్పు కలిపి, 150 మి.లీ. నీటిలో కలిపి జ్యూస్ తయారు చేసి పశువులచేత తాగిపిస్తుంది. దీంతో పశువుల కడుపు శుభ్రపడి కడుపు నొప్పితో పాటు నులి పురుగులు కూడా నివారించబడతాయి. ఈ పద్ధతిలో ఈమె ఎన్నో దూడలకు వైద్యాన్ని చేసింది.

**ప్రత్తి నాటడంలో నర్సరీ పద్ధతి:**

గుజరాత్‌కు చెందిన కేశవ్‌భాయ్ 1999 నుండి తన పొలంలో




'శంకర్-4' అనే హైబ్రిడ్ ప్రత్తిని నాటేవాడు. వర్షాలు బాగుంటే ఫర్వాలేదు కాని, వర్షాభావ పరిస్థితుల్లో పొలంలోని కొన్ని ప్రాంతాల్లో ప్రత్తి మొక్కలు ఏపుగా పెరగక పోవడాన్ని గమనించాడు. ఈ సమస్య పరిష్కారం కొరకు అతను పొలంలో ప్రత్తి నాటినప్పుడే కొన్ని విత్తనాలను నర్సరీ పద్ధతిలో విడిగా కుండీలలో పెంచాడు. వీటిని 25 గ్రా. ఆవుపేడ, 50 గ్రా. మట్టి కలిపి అందులో మొక్కలు నాటేవాడు. తక్కువ ఎండ వుండేచోట వీటిని తగినంత నీరు పోసి 25 నుండి 30 రోజుల వరకు పెంచుతాడు.

ఈలోగా పొలంలో వేసిన ప్రత్తి మొక్కలలో ఏవైనా మొలకెత్తకపోయినా, లేదా సరియైన ఎత్తుకు ఎదగకపోయినా ఈ కుండీలలోని మొక్కలను అక్కడ నాటేస్తాడు. దాంతో పొలంలోని మొక్కలన్నీ ఒకే ఎత్తులో, ఒకే వయస్సులో వుండటం వల్ల ఒకేరకమైన కాపు ఇస్తున్నాయి. కేశవ్ భాయ్‌ని చూసి చుట్టుప్రక్కల ప్రాంతాల్లోని చాలామంది రైతులు ఇదే పద్ధతిని అవలంభించి, వనరులను మితంగా వాడటమే కాకుండా, అధికోత్పత్తిని సాధిస్తున్నారు.

**పశువులు చూలుకు రావటానికి చిట్కా:**

పశువులలో వేడి అధికమైనపుడు అవి చూలుకు రాకపోవడమే కాదు, పాల దిగుబడి కూడా తగ్గుతుంది. దీనికి విరుగుడుగా గుజరాత్‌కు చెందిన భారత్ సిన్హా ఒక కిలో 'శతావరి' అనే ఔషధ మొక్క వేళ్ళు, ఒక కిలో మర్రిచెట్టు బెరడు కలిపి మెత్తగా పొడిచేసి రోజుకు 500 గ్రా.ల చొప్పున, నాలుగు రోజులపాటు పశువుకు దాణాలో కలిపి తినిపిస్తే మంచి ఫలితం వుంటుందని, ఒక వారంలో పశువు చూలుకు సిద్ధమవుతుందని అంటున్నాడు. ఈ చిట్కాను ఇతను తన తండ్రి రామ్‌సింగ్ భాయ్ వద్ద నేర్చుకున్నానని, ఆయనా ఇదే పద్ధతిని అవలంభించేవాడని చెబుతున్నారు.



**పశువులు తొందరగా 'మాయి' వేయటానికి మర్రి ఆకులతో వైద్యం:**

పశువులకు దూడ పుట్టిన తరువాత తల్లి కడుపులో నుండి తొందరగా మాయి బయటకు రాకపోతే తల్లి పశువుకు రక్తస్రావం, అంటులోగాలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి కనుక త్వరగా మాయి వేయటమన్నది కొన్ని గంటల్లో పూర్తి కావాలి. ఈ సందర్భంలో లేత మర్రి ఆకులను దంచి దానిలో 500 గ్రా. సజ్జపిండి, ఒక లీటరు పాలను కలిపి పశువుచేత తాగిపిస్తే మాయి తొందరగా వేస్తుంది.



ఇదే చికిత్సను స్త్రీలకు కూడా గర్భస్రావం అయితే కూడా ఉపయోగించవచ్చు అంటారామె. దీనివల్ల పునరుత్పాదక అవయవాల ఆరోగ్యం, అండం పుట్టడము మళ్ళీ సవ్యంగా జరుగుతాయట.

**పశువులలో 'లంపీ స్కిన్' వ్యాధి నివారణకు చిట్కాలు:**

ఇటీవల పశువులకు 'లంపీ స్కిన్' అనే చర్మవ్యాధి సోకి చాలా పశువులు చాలా ఇబ్బందులకు గురవుతున్నాయి. ఈ చర్మ వ్యాధి చిన్న దూడల నుంచి పెద్ద పశువుల వరకు సోకుతోంది. ఈ వ్యాధి సోకిన పశువుల శరీరంపైన చూడటానికే భయంకరంగా వుండేలా దద్దుర్లు ఏర్పడుతాయి. ఈ వైరస్ వ్యాధి నివారణకు వైద్యులు 'గోట్ పాక్స్' అనే టీకా మందు వేసి నయం చేయటానికి ప్రయత్నిస్తున్నారు. కానీ ఈ వ్యాధి నివారణకు హర్యాణా రాష్ట్రానికి చెందిన 'ఫూల్ కువార్ భాయ్' అనే సాంప్రదాయ వైద్యుడు ఒక చిట్కాను తయారు చేసి ఈ వ్యాధి నివారణ చేస్తున్నాడు.



**ఔషధం తయారు చేయవలసిన విధానం :**

మర్రి చెట్టు ఆకులు - 10, రావి చెట్టు ఆకులు - 10 రోట్లో వేసి మెత్తగా నూరాలి. తర్వాత ఆ దంచిన ఆకుల ముద్దను ఒక లీటర్ నీటిలో కలిపి, ఈ నీరు సగం అయ్యేదాక పొయ్యిమీద వేడి చేసి కషాయం లాగా తయారు చెయ్యాలి. 100 మీ.లీ. ఈ కషాయం రోజుకు 5 సార్లు పశువుకు తాపించాలి.

అలాగే చర్మంపైన ఏర్పడ్డ దద్దుర్ల పైన ఈగలు వాలకుండా ఉండటానికి ..... 500 గ్రాముల ఆముదం ఆకులు, 200 గ్రా. తెల్ల గలిజేరు (పునర్నవ) ఆకులు తీసుకుని మెత్తగా నూరి, ఆ ముద్దను 2 లీటర్ల గోమూత్రం లో కలిపి ఆ మిశ్రమం ఒక లీటర్ (అంటే సగం అయ్యే వరకు) పొయ్యిపైన మరిగించి కషాయంలాగా తయారు చెయ్యాలి.

కషాయం చల్లారిన తర్వాత ఆ కషాయాన్ని 250 మి.లీ. ఆముదం నూనెతో కలిపి పశువు శరీరంపైన వ్యాధి సోకిన చోట పైపూత గా పుయ్యాలి.

ఇలా చేస్తే 4-5 రోజుల్లోనే శరీరంపైన సోకిన వైరస్ నివారించ బడుతుందని తెలియజేస్తున్నారు 'ఫూల్ కువార్ భాయ్' అనే సాంప్రదాయ వైద్యుడు.

**పశువులలో వడదెబ్బకి పరిష్కారం :**

ఎండాకాలంలో పశువులకు వడదెబ్బ తగిలితే 200 గ్రా. శతావరి ఆకులను నీటిలో (ఆకులు మునిగే వరకు) నానబెట్టి ఆ ఆకులను పశువుల నుదుటిమీద రోజు విడిచి రోజు వరుసగా వుంచితే పశువులను వడదెబ్బ బారినుండి కాపాడవచ్చు అంటున్నారు గుజరాత్‌కు చెందిన సునేంద్ర నగరవాసి భవన్‌భాయ్ మారుభాయ్ రాజ్‌పుత్.



**పప్పు ధాన్యాలను పురుగులనుండి కాపాడుకోవటం :**

పప్పు ధాన్యపు పంటలలో గొంగళి పురుగు బారినుండి రక్షించుకోవటానికి రెండున్నర కిలోల 'అదుసి' ఆకులను, అంతే ప్రమాణంలో కానుగ ఆకులను నీటిలో నానబెట్టి వడగట్టి పురుగు పట్టిన పంటపై పిచికారి చేస్తే మంచి ఫలితాన్నిస్తుంది అంటున్నారు గుజరాత్ రాష్ట్రానికి చెందిన సురేంద్రనగర్ నివాసి ప్రతాప్ భాయ్ ప్రభు భాయ్ రబారి.



**పశువులలో కాళ్ళ వాపులకి తంగేడు ఆకులతో చికిత్స :**

పశువులలో బెణుకుల వలన వచ్చిన వాపుల నివారణకై తంగేడు ఆకులను దంచి, కొద్దిగా వేడిచేసి, వాపు వున్న ప్రాంతంలో పూసినట్లయితే వాపులు త్వరగా తగ్గి, పశువులకు స్వస్థత చేకూరుతుంది అంటున్నారు గుజరాత్‌కు చెందిన సురేంద్ర నగర్ వాసి గీతాబెన్ ఘన్‌శ్యాంభాయ్ మణేక్.



## పశు సంపదను కాపాడుకుందాం

పాఠకులకో మనవి. మారుతున్న కాలంలో సాంప్రదాయ పశువైద్యులు కనుమరుగై పోతున్నారు. అక్కడక్కడా వున్న వారి జ్ఞానం వారితోనే అంతం కాకుండా భవిష్యత్ తరాలకు అందించాలంటే అటువంటి వైద్యాలు గ్రంథస్తంచేయుటం ఎంతో అవసరం. మీకు తెలిసిన పశువైద్యులు ఎవరైనా వుంటే వారి జ్ఞానాన్ని మాతో పంచుకోండి. ప్రచురించి అందరికీ అందజేద్దాం. **- ఎడిటర్**

## పాఠకులకు విన్నపము

మీ ప్రాంతంలో పంటల పైన కాని, పశువులపైన కాని చేసిన, చేస్తున్న ప్రయోగాలను గురించి వివరంగా తెలియజేస్తే మీ పేరున ఈ 'పల్లె జ్ఞానం' సమాజానికి తెలియజేస్తాము. పంటల తెగుళ్ళ నివారణ, పశువుల రోగాల నివారణకు సంబంధించిన మీకు తెలిసిన లేదా మీరు విజయవంతంగా ప్రయోగించిన పద్ధతులను తెలియజేయండి.

**- ఎడిటర్**

# సాంప్రదాయ పద్ధతిలో వన్య ప్రాణుల నుండి రక్షణ





- అల్లాడి ప్రభాకర్

ఇప్పుడు వన్య ప్రాణుల సంఖ్య చాలా ఎక్కువగా పెరుగుతోంది. ఒకప్పుడు అడవులలోనే నివసించే ప్రాణులైన పులులు, సింహాలు, ఏనుగులు, ఎలుగు బంట్లు మొదలైనవి ఇప్పుడు గ్రామాలు, పట్టణాలలోకి వచ్చి పంట పొలాలను ధ్వంస, చేస్తున్నాయి, అలాగే మనుషుల ప్రాణాలు తీస్తున్నాయి. వీటివల్ల రైతులు, గొర్ల కాపర్లు, బర్రెల కాపర్లు, గిరిజనులు, అటవీశాఖ అధికారులు.... ఇలా ఎందరి ప్రాణాలనో బలి తీసుకుంటున్నాయి.

ఒకప్పుడు వన్య ప్రాణులను రక్షించుకొనుటకు రైతులు పంట పొలాల్లో 'మంచె' లాగా ఏర్పాటు చేసుకొని ప్రక్కన కట్టెలు మండించి మంటను ఏర్పాటు చేసుకొనేవారు. అలాగే అడవిలో ఆదివాసీలు నివసించే చోట ఇంటిముందు ఎప్పుడూ కట్టెలు మండించి మంటను ఏర్పాటు చేసుకునేవారు. నాడు బాటసారులు రాత్రి సమయంలో ప్రయాణించే టప్పుడు చేతిలో మండేటి కర్రలు అలాగే దివిటీలను చేతిలో పట్టుకుని వెళ్ళేవారు.

వన్య ప్రాణులైన పులులు, సింహాలు, ఏనుగులు, ఎలుగు బంట్లు మొదలైన వాటినుండి రక్షించుకొనుటకు కర్రలు, బరిసెలు, తుపాకులు ఎలాంటి మారణాయుధాలతో ఎదిరించినా భయపడకుండా ఎదురు దాడి చేస్తాయి.

వన్య ప్రాణులు భయపడి పారిపోయేది ఒక్క అగ్నికి, మంటలకు మాత్రమే. ఇది వ్యవసాయదారులకు, అటవీ అధికారులకు మరియు గిరిజనులకు అందరికీ తెలిసిన విషయమే.

నా ఆలోచన ప్రకారం వన్య ప్రాణుల నుండి రక్షించుకొనుటకు అధునాతన పద్ధతి వినియోగించి, ఎల్.పి.జి. గ్యాస్ ద్వారా బర్నర్‌ను మండించే విధానం. ఈ గ్యాస్ సిలిండర్‌ను భుజాన వేసుకొని ఒక కర్ర ద్వారా మూడు అడుగుల దూరంలో మంటను మండిస్తూ వెళ్ళవచ్చు.

వన్య ప్రాణులకు ఎదురు వెళ్ళి ప్రమాదాన్ని పారద్రోలవచ్చు. వణ్య ప్రాణులు గుంపులు గుంపులుగా వచ్చినా సరే మనం కూడా ఎక్కువగా సిలిండర్‌లను పంపించి వాటిని పారద్రోలవచ్చు. ముఖ్యంగా భద్రత కొరకు ఏదైనా పొరపాటున మంటలు ప్రక్కన అంటున్నట్లయితే ముందు జాగ్రత్తగా మనతో పాటు ఒక చిన్న మంటలను ఆర్పే పరికరాన్ని ఉంచుకున్నట్లయితే మంటలను ఆర్పివేయవచ్చు.

ఈ విధానం ఎంతో సులువైనది. రైతులు, గొర్రెల, బర్రెల కాపరులు, గిరిజనులు, అటవీ అధికారులు ఈ విధానం ఉపయోగించి వన్య ప్రాణుల బారినుండి రక్షించుకుని, వ్యవసాయ పంటలను కూడా రక్షించుకోవచ్చు.

## సాంప్రదాయాన్ని మేళవించి ఇన్నోవేషన్

అరణ్యాల్లో సంచరించాల్సిన క్రూర జంతువులు జనారణ్యం, పంట పొలాల్లోకి వచ్చి మనుషులను భయభ్రాంతులను చేస్తున్న వార్తలు మనము పత్రికల్లో చూస్తూ ఉంటాము. కానీ 'పల్లెసృజన' పాఠకులకు చిరపరిచితుడైన సిద్ధిపేట జిల్లా, మెట్‌పల్లికి చెందిన సీరియల్ ఇన్నోవేటర్ "అల్లాడి ప్రభాకర్" ఈ సమస్యను సాంప్రదాయ కోణంలో ఆలోచించి ఒక ఇన్నోవేషన్‌ను రూపొందించాడు.

పూర్వం అటవీ ప్రాంతానికి సమీప గ్రామ ప్రజలు రాత్రి పూట ఎక్కడికైనా వెళ్ళాల్సి వస్తే 'దివిటీలు' చేత పట్టుకుని ప్రయాణం చేసేవారు. ఆ దివిటీ వల్ల దారి కనపడటంతో పాటు, క్రూర మృగాల నుండి కూడా రక్షణ పొందేవారు. ఏనుగులు, పులులు, చిరుతలు లాంటి క్రూర జంతువులు భయపడేది మంటలకే అని గమనించాడు. ప్రస్తుత సమాజంలో దివిటీలు తయారు చేసుకుని తీసుకు వెళ్ళే పరిస్థితి లేదు. ఈ సమస్యకు పరిష్కారంగా ఒక అధునాతన 'దివిటీ' తయారు చేశాడు అల్లాడి ప్రభాకర్.



ఆ దివిటీకి చిన్న గ్యాస్ సిలిండర్ ఏర్పాటు చేసుకుని వెలిగించుకుంటే మంట సన్నగా మండుతూ వుంటుంది. దానికి ఏర్పాటు చేసిన ఒక మీటను నొక్కితే చాలు ఆ మంట పెద్దదిగా బయటకు వెదజల్లుతుంది. అడవిలో ప్రయాణం చేసేటపుడు లేదా ఏనుగులు, చిరుతలు, పులులు లాంటివి గ్రామాలపై దాడి చేసినపుడు ఈ దివిటీ ద్వారా అప్పుడప్పుడూ ఆ మీటను నొక్కుతూ వుంటే వెలువడే ఆ మంటకు భయపడి జంతువులు తిరిగి అడవిలోకి పారిపోతాయి.

**ఇన్నోవేటర్ అల్లాడి ప్రభాకర్, ఫోన్ నెం. 9440037475**

## రైతు లోకానికి వెల్ల శ్రీనివాస్ అద్భుత ఇన్నోవేషన్

# సులువుగా మోటార్ 'ఆన్' 'ఆఫ్' చేసే రిమోట్



- వీరరాఘవ రెడ్డి

పూర్వం వ్యవసాయం వర్షాధారంగానే ఎక్కువగా జరిగేది. తర్వాతి స్థానం బావుల నుండి నీటిని తోడుకోవటం ద్వారా జరిగేది. అయితే ఈ బావుల ద్వారా జరిగే వ్యవసాయం ఎక్కువ శాతం ఉద్యాన పంటలు, తరువాతి స్థానం 'వరి' పండించటానికే ఎక్కువగా పరిమితమైంది. ప్రాజెక్టుల సంఖ్య పెరిగిన తర్వాత కాలువల ద్వారా వ్యవసాయం చేసి అధిక పంటలను పండించడం మొదలైంది. ఇది గమనించిన కాలువల సౌకర్యం లేని ప్రాంతాల్లో బోర్లు వేసి ఆ నీటితో పంటలు పండించడం మొదలైంది. తర్వాతి స్థానం గ్రామాల సమీపంలో గల నదుల నుండి నీటిని తోడుకోవటం ప్రక్రియ ప్రారంభమైంది. ఈ ప్రక్రియ ప్రారంభమైన తర్వాతనే మోటార్లతో నీటిని తోడుకునే విధానం విపరీతంగా పెరిగిపోయింది. ఈ మోటార్ల ద్వారా నీటిని పొలాలకు మళ్ళించడం ఎంతవరకు వచ్చిందంటే చాలా చోట్ల మోటార్‌కు – పొలానికి మధ్య దూరం 200 మీటర్ల నుండి 2 కి.మీ.కు పైగా దూరం కూడా నీరు పారించి పంటలు పండించుకుంటున్నారు. ఇదంతా కరెంటు మోటార్లు వచ్చిన తర్వాతనే పెరిగిన సేద్యం. అంతకు ముందు బావుల ద్వారా డీజిల్ ఇంజన్‌లతో నీటిని తోడుకునే వారు.

ఇప్పుడు పొలానికి పంపుసెట్‌కు గల దూరం పెరగటం వల్ల అనుకోని పరిస్థితుల్లో కరెంటు పోయినా, పొలానికి నీరు కట్టాలి అనుకున్నపుడు మోటారు వద్దకు వెళ్ళి మోటార్ ఆన్ చేసుకుని, పొలానికి వచ్చి పంటకునీరు పారించుకోవటం అనే ప్రక్రియ ప్రస్తుతం చాలా శ్రమతో కూడుకున్నదిగా మారిపోయింది. ఏ చిన్న అవాంతరం వల్ల మోటారు ఆగిపోయినా, మళ్ళీ అంత దూరం వెళ్ళి పంపును ఆన్ చేసుకు రావటం శ్రమతో పాటు, విసుగు కూడా కలుగుతుంటుంది.

ఈ సమస్య నివారణకు గత కొద్ది కాలంగా 'ఆటోమేటిక్ స్టార్టర్'లు వచ్చాయి. వీటివల్ల మధ్య మధ్యలో కరెంటు పోయినా, మళ్ళీ కరెంటు వచ్చిన వెంటనే దానంతట అదే మోటార్ ఆన్ కావటం వల్ల కొంత శ్రమ తగ్గింది. అయితే మొదట మోటార్ ఆన్ చేయటానికి, తిరిగి పంటకు నీరు పారించే పని అయిపోయిన తర్వాత మళ్ళీ మోటారు వద్దకు వెళ్ళి దాన్ని 'ఆఫ్' చేసి రావాల్సిందే. ఈ ఆటోమేటిక్ స్టార్టర్ వల్ల కేవలం మధ్య మధ్యలో కరెంటు పోయినప్పుడల్లా అంత దూరం వెళ్ళే పని తగ్గింది.

ఆ తర్వాత 'సెల్ ఫోన్'తో మిస్డ్ కాల్ ఇవ్వటం ద్వారా మోటార్ ఆన్ – ఆఫ్ చేసే పరికరాలు తయారు చేశారు ఇన్నోవేటర్లు. ఇది ఆటోమేటిక్ స్టార్టర్‌కన్నా మేలు అనిపించింది. కానీ ఈ పరికరాన్ని వినియోగించుకోవాలంటే ఈ పరికరంలో ఒక సిమ్ కార్డ్ ఏర్పాటు చేసి




రిమోట్ - రిసీవర్


పొలాలకు నీరు పారేందుకు పైపు లైన్లు వేస్తున్న దృశ్యం

దాన్ని ప్రతినెలా రీఛార్జ్ చేయాల్సి ఉంటుంది. ఇందుకొరకు ప్రతి నెలా కనీసం 200 రూపాయలకు పైగా ఖర్చవుతుంది. అంటే నిర్వహణా ఖర్చు ఏడాదికి 2 వేలకు పైగా ఉంటుంది.

ఈ సమస్యలన్నిటికీ చరమగీతం పాడాడు మహబూబాబాద్ జిల్లా, చిన్న గూడూరు మండలం, జయ్యారం గ్రామవాసి అయిన వెల్లె జగన్నాథం, సుగుణల కుమారుడు శ్రీనివాస్. ఇతనికి ఒక సోదరుడు, ఒక సోదరి ఉన్నారు. 46 సంవత్సరాల వయసు గల శ్రీనివాస్‌కు వివాహమైంది భార్య ఉమారాణి. వీరికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. పెద్దమ్మాయి పేరు లక్ష్మి, చిన్నమ్మాయి పేరు సరస. ప్రస్తుతం జీవనోపాధి దృష్ట్యా ఖమ్మంలో నివాసముంటున్నాడు. శ్రీనివాస్ 10వ తరగతి పూర్తయిన తర్వాత, ఇంటర్మీడియట్ లో ఆర్&టి ఒకేషనల్ కోర్సుచదివి ఆ తర్వాత ప్రైవేటుగా బేసిక్ ఎలక్ట్రానిక్స్ కోర్సు, టీవీ మరియు కంప్యూటర్ హార్డ్‌వేర్ మెకానిజం నేర్చుకుని ఇంట్లోనే టీవీలు, కేబుల్ పరికరాలను రిపేర్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అదనపు ఆదాయంగా పట్టణానికి సమీప గ్రామంలో (45 నిమిషాల ప్రయాణం) ఒక కేబుల్ టీవీ ఏర్పాటు చేసుకుని, అప్పుడప్పుడూ అక్కడి వెళ్ళి వస్తూ ఉంటాడు.

అలా తనకున్న ఎలక్ట్రానిక్స్ రంగంలో టీవీ మెకానిజం ద్వారా పొందిన జ్ఞానం ఉండటంతో, తమ పొలంలోని మోటార్ ఆన్ చేయటానికి తన తండ్రి సోదరులు పడుతున్న కష్టం, అప్పుడప్పుడూ వార్తల్లో మోటార్ స్టార్ట్ చేయటానికి వెళ్ళి విద్యుదాఘాతంతో చనిపోతున్న రైతులను గురించి తెలుసుకుని విచలిత మనస్సుతో దీనికి ఏదైనా పరిష్కారం చూడాలని ఆలోచించాడు. తాను చేసే పరికరం కొరకు రైతు ఎటువంటి నిర్వహణా ఖర్చు లేకుండా చెయ్యాలన్న ధ్యేయంతో తయారు చేసిందే ఈ 'రిమోట్ స్టార్టర్'.

పొలానికి నీరు పారించాలనుకున్న ప్రతి రైతు ఒక మోటార్ ఏర్పాటు చేసుకుని, దాన్ని స్టార్ట్ చెయ్యడానికి తప్పనిసరిగా ఒక స్టార్టర్‌ను ఏర్పాటు చేసుకోవాల్సిందే. ఈ స్టార్టర్‌లో 440 వోల్టుల వరకు విద్యుత్ ప్రసరణ జరుగుతూ ఉంటుంది. పొలంలో ఎలుకలు వైర్లను కత్తిరించడం ద్వారా కానీ, వర్షాకాలంలో స్టార్టర్‌పైన పడ్డ తడి ఆరనప్పుడు రైతు మామూలుగా మోటార్‌ను స్టార్ట్ చెయ్యబోయి విద్యుత్ షాకుతో చనిపోతున్న వారిని గురించి నిత్యం వార్తల్లో చూస్తూనే ఉన్నాం. అందుకే రైతు మోటార్ వద్దకు వెళ్ళాల్సిన అవసరం లేకుండా కేవలం జేబులో వున్న రిమోట్ స్విచ్ నొక్కడం ద్వారా మోటారు ఆన్ – ఆఫ్ చేసుకునేలా ఉంటుందీ మోటార్ రిమోట్.

కొందరు రైతుల పొలానికి, మోటారుకు మధ్య దూరం ఉన్న రైతులు కరెంటు సరఫరా ఆగిపోయినప్పుడల్లా మళ్ళీ మోటారు వద్దకు వెళ్ళి దాన్ని స్టార్ట్ చెయ్యాలంటే ఎంతో దూరం నడిచే శ్రమ, సమయం కూడా లేకుండా ఈ రిమోట్ ద్వారా ఉన్నచోటు నుంచే మోటార్‌ను ఆన్ చేసుకోవచ్చు. అయితే సాధారణంగా ఎక్కువ మంది రైతుల మోటార్లు 200 మీటర్ల లోపలే ఉంటుంది కాబట్టి శ్రీనివాస్ తయారు చేసిన రిమోట్‌ను ఆ పరిధిలో పని చేసేలా తయారు చేశాడు. దూరం ఎక్కువ ఉన్నరైతులకు తమ దూరాన్ని బట్టి రిమోట్ సామర్థ్యం పెంచి ఇస్తాడు.

ఇక్కడ రైతులు గమనించాల్సింది ఏమిటంటే, నీరు డెలివరి పాయింట్ వద్ద నిలబడి లేదా కనపడేటట్టు ఉండి రిమోట్ నొక్కితే వెంటనే నీరు వస్తుంది అంటే మోటార్ ఆన్ అయిందని నిర్ధారణ చేసుకోవచ్చు. ఈ రిమోట్‌ను ఉపయోగించే రైతు మోటారు ఏదైనా రిపేరుకు గురైతే తప్ప మోటార్ వద్దకు వెళ్ళాల్సిన అవసరమే ఉండదు. అందువల్ల పొలంలో వెళ్ళేటపుడు పురుగు పుట్ర భయం ఉండదు. కరెంటు షాకు వల్ల సంభవించే మరణాలు ఉండవు. కాబట్టి నీటి పంపు ఏర్పాటు చేసుకున్న ప్రతి రైతుకు ఇది తప్పనిసరి అవసరంగా మారుపోతుంది. శ్రమతో పాటు, భయాన్ని కూడా పోగొట్టిన ఈ ఇన్నోవేషన్ తయారు చేసినందుకు వెల్లె శ్రీనివాస్ అభినందనీయుడు.

ఈ రిమోట్ స్టార్టర్‌ను ఏర్పాటు చేసుకోవటం కూడా చాలా సులభం. గ్రామంలోని కనీస పరిజ్ఞానం వున్న ఏ ఎలక్ట్రిక్ మెకానిక్ అయినా దీన్ని అమర్చవచ్చు. ఏ ఫేజ్‌లోనైనా కరెంటు సరఫరా పోయినపుడు మోటారు కాలిపోకుండా మూడు ఫేజ్‌ల కనెక్షన్‌లను చక్కగా డిజైన్ చేశాడు శ్రీనివాస్.

కొందరు రైతులు పొలాల్లోనే తమ నివాస గృహం కూడా ఉంటుంది. అటువంటి వారు వరి మాగాణి లాంటి పంటలు వేసినట్ల యితే పొలానికి దగ్గరుండి నీరు కట్టాల్సిన అవసరం లేదు కాబట్టి ఇంట్లో నుండే రిమోట్ ద్వారా మోటార్ ఆన్ చేస్తే చాలు నీరు పారుతుంటుంది. అంటే ఇంట్లో తమ పనులు చేసుకుంటూనే పొలానికి నీరు కూడా కట్టవచ్చు అన్నమాట.

ఈ రిమోట్ పరికరాన్ని ఏర్పాటు చేయటానికి మళ్ళీ కొత్త స్టార్టర్ కొనాల్సి వస్తుందేమో అన్న సందేహం అవసరం లేదు. మీ స్టార్టర్ ఎంత పాతది అయినా సరే దానికే ఈ పరికరాన్ని అనుసంధానం చేసుకోవచ్చు. దీన్ని ఏర్పాటు చెయ్యటానికి ఎటువంటి అదనపు ఏర్పాటుచల చేయవలసిన అవసరం లేదు.

వెల్లె శ్రీనివాస్ తయారు చేసిన 'రిమోట్ స్టార్టర్'ను మొదట ఖమ్మం శివారులోని 'పల్లెగూడెం' గ్రామ రైతు "మీగడ రాము" పొలంలో ఏర్పాటు చేశాడు. ఈ రైతుకు అక్కడ 7 ఎకరాల పొలం ఉంది. అందులో దాదాపు 4 ఎకరాలు వరి మాగాణి సాగు చేస్తున్నాడు. ఈ పరికరం


రైతు రిమోట్ ఆన్ చేస్తున్న దృశ్యం

ఏర్పాటు చేసి దాదాపు రెండు నెలలు కావస్తోంది. దీనిపై రైతు రాము (రైతు రాము ఫోన్ నెం. 9912615031) ను వివరణ అడుగగా అతను వెలిబుచ్చిన అభిప్రాయం అతని మాటల్లోనే ఇలా ఉంది. "నేను దీన్ని ఏర్పాటు చేసుకునేకన్నా ముందు ఆటోమేటిక్ స్టార్టర్ ఉండేది. మాకు పరిచయం ఉన్న శ్రీనివాస్ రిమోట్ స్టార్టర్ తయారు చేశాను నీ మోటారు కు ఏర్పాటు చేసి చూద్దాం అంటే సరే అని నా స్టార్టర్ వద్ద బిగించాను. గతంలో మోటార్ ఆన్ – ఆఫ్ చెయ్యటానికి రోజుకు కనీసం మూడు నాలుగు సార్లు మోటారు వద్దకు వెళ్ళాల్సి వచ్చేది. ఆటోమేటిక్ స్టార్టర్ ఉన్నప్పుడైనా రోజూ సాయంత్రం వెళ్ళి దాన్ని ఆఫ్ చేసి రావాల్సి వచ్చేది. పైగా ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం వారు ఆటోమేటిక్ స్టార్టర్లను ఏర్పాటు చేసకోవద్దు అలా ఏర్పాటు చేసుకుంటే దాన్ని తీసివేస్తాము అంటున్నారు. ఈ స్టార్టర్ ఏర్పాటు చేసినప్పటి నుండి ఈ రెండు నెలల్లో ఒకటి రెండు సార్లు మాత్రమే మోటారు వద్దకు వెళ్ళడం జరిగింది. అప్పుడూ రోజూ మోటారు వద్దకు తిరగటం వల్ల అక్కడికి బాగా కాలి బాట ఏర్పాటు అయింది. ఇప్పుడు మోటారు వద్దకు వెళ్ళాల్సిన అవసరమే లేకుండా పోయింది కాబట్టి గడ్డి మొలిచి రస్తా కూడా మూసుకు పోయింది. నాకు ఈ రిమోట్ స్టార్టర్ వల్ల ఎంత సుఖంగా ఉందో చెప్పటానికి ఇదే మీకు సాక్ష్యం" అన్నాడు. "చిన్న రిమోట్ జేబులో వేసుకుని అవసరం అనుకున్నపుడల్లా మోటార్ ఆన్ చేసుకోవడం, ఆఫ్ చేసుకోవడం పొలంలో మిగతా పనులు చూసుకో వడం జరుగుతోంది. ముఖ్యంగా మోటార్ వద్దకు వెళ్ళి స్టార్టర్ ఆన్ చెయ్యాలంటే ఏమవు



ఇన్నోవేటర్ శ్రీనివాస్ — రైతు మీగడ రాము



రైతు పొలంలో రిమోట్ పనితీరును పరిశీలిస్తున్న 'పల్లెసృజన' బృందం

తుందో అనే భయమే లేకుండా పోయింది. మంచి స్టార్టర్ అందించిన 'వెల్లె శ్రీనివాస్'కు అభినందనలు అని తన సంతోషాన్ని వ్యక్తం చేశాడు మీగడ రాము.

ఈ రిమోట్ స్టార్టర్‌ను ఎన్ని హార్స్‌పవర్‌ల మోటారుకైనా ఏర్పాటు చేసుకోవచ్చు. మోటార్ ఆన్ చేసేందుకు స్టార్టర్ వున్న ప్రతి మోటారుకు దీన్ని ఏర్పాటు చేసుకుని విద్యుదాఘాతం జరుగుతుందేమో అన్న భయం లేకుండా మీరు ఉన్నచోటు నుంచే మీ మోటార్ ఆన్ చేసుకోవచ్చు.

ఈ పరికరం కూడా సాధారణ రైతుకు కూడా అందుబాటు ధరలోనే లభిస్తుంది, ఎటువంటి నిర్వహణా ఖర్చు కూడా ఉండదు కాబట్టి ప్రతి రైతు ఈ పరికరాన్ని ఏర్పాటు చేసుకుని నిరపాయకరంగా, శ్రమ లేకుండా మీ పొలంలోని మోటారును ఆన్ చేసుకుని మీ పొలాలకు నీటి వసతి కల్పించుకోవాలని తెలియజేస్తోంది 'పల్లెసృజన'. ఈ రిమోట్ స్టార్టర్‌ను విస్తృత ప్రచారంలోకి తీసుకు వచ్చి ప్రతి రైతుకు చేరేందుకు అవసరమైన కృషి చేస్తోంది 'పల్లెసృజన'. అధిక మొత్తంలో ఈ రిమోట్ స్టార్టర్లను తయారు చేసేందుకు అవసరమైన నిధులను సమకూర్చేందుకు కూడా ఏర్పాట్లు చేస్తోంది. వీలైనంత త్వరలో ఈ రిమోట్ స్టార్టర్ ప్రతి రైతుకు చేరుకోవాలని కోరుకుంటోంది 'పల్లెసృజన'. ●

**ఇన్నోవేటర్ వెల్లె శ్రీనివాస్ ఫోన్ : 9440827335**

## 'పల్లెసృజన' ఇన్నోవేటర్లకు విజ్ఞప్తి

'పల్లెసృజన' పత్రిక అప్రతిహతంగా 17 సం.గా మీ ముందుకు వస్తున్న విషయం మీకందరికీ విదితమే. స్వచ్ఛందంగా వాలంటరీ వ్యవస్థ మీద ఆదారపడి, వ్యాపార ప్రకటనలు, డొనేషన్‌లు లేకుండా ఇప్పటి వరకు ఈ పత్రికను తద్వారా నూతన ఇన్నోవేషన్లను, ఇన్నోవేటర్లను సమాజానికి పరిచయం చేస్తూ వారికి జాతీయ, అంతర్జాతీయ స్థాయి లో గుర్తింపు తీసుకు వస్తున్న విషయం కూడా మీకందరికీ తెలుసు. కోవిడ్ మహమ్మారి ప్రపంచ వ్యాప్తంగా సృష్టిం చిన అలజడి లో కూడా నిరాఘాటంగా పత్రిక నడిపే ప్రయత్నం లో సఫలీకృతులం అయ్యాము. కానీ, రోజు రోజుకూ పెరిగి పోతున్న పేపర్ ధరలు, ముద్రణా ఖర్చులను తట్టుకోవటం కొద్దిగా కష్టంగా మారుతోంది. కావున దయచేసి ఇన్నోవేటర్లు ఒక విషయం గమనించాలి. ఇప్పటి నుంచి మీకు చేరుతున్న పత్రిక ఉచితంగా పంపడం కొంత భారం గా అనిపిస్తోంది. కావున మీ పత్రికకు మీరు కూడా చందా దారులు కావలసిందిగా కోరుతున్నాము.

మీరు పత్రికకు అందిస్తున్న సహకారం మమ్మల్ని ఎప్పటికప్పుడు కార్యోన్ముఖులను చేస్తూ ముందుకు సాగేలా చేస్తోంది. కావున మీకు తెలిసిన వారికి, మీ మిత్రుల కు ఈ పత్రికను గురించి తెలియ జేసి, కొత్త చందాదారులను చేరేలా మీవంతు ప్రయత్నం చేయ గలరు. వీలైనంత వరకు పత్రిక ధర పెంచకుండా, చందా దారులను అధికం చేసినట్లయితే ముద్రణా ఖర్చు కొంత వరకు తగ్గుతుం దని భావిస్తున్నాము. 'పల్లె సృజన' ప్రతి పల్లెకు చేరాలన్నదే మనందరి ఆకాంక్ష. శుభ కార్యాల్లో ఈ పత్రిక చందానే మీరిచ్చే బహుమతిగా చేసుకుని పత్రిక ఎక్కువ మందికి చేరేలా చూస్తా రని ఆశిస్తున్నాము.

–ఎడిటర్

# ఆయుర్వేద జ్ఞాన మథనం



- 'వైద్య' ఉమా మహేశ్వర రావు

## గర్భిణీ స్త్రీలు చేయవలసినవి - చేయకూడనివి :

### చేయవలసినవి:

గర్భాధారణ అయింది అని తెలియగానే తప్పకుండా డాక్టరును సంప్రదించండి. మొదటి మూడు నెలల్లో కనీసం 4 సార్లు డాక్టరును సంప్రదించడం మంచిది. ఆహారంలో పళ్లు, ఆకు కూరలు, లేత బీన్స్, పప్పులు, పాలు, డ్రై ఫ్రూట్స్ ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఇటీవలి కాలంలో కేవలం తగినంత నీరు తీసుకోక పోవటం వల్ల గర్భస్రావం అవుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. కాబట్టి స్త్రీలు గర్భాధారణ జరిగింది అని తెలిసినప్పటి నుంచి తప్పనిసరిగా రోజుకు కనీసం 8 నుంచి 10 గ్లాసుల నీరు తప్పనిసరిగా తీసుకోవాలి.

ఐరన్ (ఇనుము), మల్టీ విటమిన్, మినరల్స్, క్యాల్షియం, జింక్, ఫోలిక్ ఆసిడ్ సమృద్ధిగా ఉన్న ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి. వీటిని మాత్రలు (ట్యాబ్‌లెట్ల) రూపంలో కాకుండా ఆహారం రూపంలో తీసుకోవడం ఉత్తమం. ఈ ఆహార పదార్థాలను మొదటి మూడు నెలలు మరియు ఆఖరు మూడు నెలలు తప్పనిసరిగా తీసుకోవడం మంచిది.

కాళ్ళ వాపులు రావటం, తలనెప్పి, మూత్ర విసర్జన తక్కువగా ఉండటం, చెమటలు తక్కువగా పట్టడం, ఊపిరి సరిగ్గా అందక పోవటం, ఆపకుండా దగ్గు రావటం, పిండం కదలిక జరుగుతున్నట్లు అనిపించక పోవటం లాంటి వన్నీ గర్భస్రావం జరిగే అవకాశమున్న లక్షణాలు. కాబట్టి ఇటువంటి లక్షణాలను గమనించిన వెంటనే వైద్యుడిని సంప్రదించడం మంచిది.

విటమిన్లు, మినరల్స్ ఎక్కువగా ఉండే పదార్థాలు క్యాబేజి, పాలు, కొబ్బరి, ఆకు కూరలు, పళ్ళు ఎక్కువగా తీసుకోవటం మంచిది. కర్బూజ, జామ, దానిమ్మ, బత్తాయి, కమలా పండ్లలో గర్భిణీ స్త్రీలకు కావలసిన పోషకాలు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా జామలో అత్యధికంగా అవసరమైన పోషకాలు ఉంటాయి. 'సి' విటమిన్ ఎక్కువగా ఉన్న పదార్థాలు తీసుకోవాలి. పైన చెప్పిన పండ్లలో 'సి' విటమిన్ పుష్కలంగా ఉంటుంది.

### చేయకూడని పనులు:

గర్భిణీ స్త్రీలు ముఖ్యంగా చేయకూడనివి కొన్ని ఉన్నాయి వాటిపట్ల జాగ్రత్త వహించడం మంచిది. ఉప్పు, నూనె, మసాలాలు ఎక్కువగా తీసుకోకపోవటం మంచిది. నూడిల్స్, ఛాట్ లాంటి బయటి ఆహార పదార్థాలకు వెంటనే స్వస్తి పలకటం మంచిది. పొగ త్రాగే వ్యక్తులకు వీలైనంత ఎక్కువ దూరంగా ఉండేలా జాగ్రత్త తీసుకోవటం మంచిది. వారు త్రాగే పొగను గర్భిణీ స్త్రీలు పీల్చుకోవటం వల్ల కూడా గర్భస్రావం జరిగే అవకాశాలు ఉంటాయి.

శరీరానికి ఎక్కువగా వేడి చేసే పదార్థాలను తీసుకోక పోవటం మంచిది.

### గర్భిణీ స్త్రీలతో పాటు అందరూ తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

ఇటీవలి కాలంలో చిన్న దెబ్బ తగిలినా, చిన్నపాటి ప్రమాదం జరిగినా ఎముకలు విరిగిపోవటం జరుగుతోంది. 'క్యాల్షియం' ఎక్కువగా ఉండే పదార్థాలను తీసుకోక పోవటం వల్ల ఎముకలు పెలుసువారిపోయి చిన్నపాటి ప్రమాదాలకే ఎముకలు విరిగిపోవటం జరుగుతోంది. దీన్నే వైద్యులు 'ఆక్టియో పొరాసిస్' అంటారు. కాబట్టి ప్రతిఒక్కరూ 'సి' విటమిన్ పుష్కలంగా ఉండే ఆహార పదార్థాలు, పళ్ళు, కూరగాయలు తమ ఆహారం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవటం మంచిది. మరీ ముఖ్యంగా 45 సంవత్సరాలు దాటిన స్త్రీలు తమ శరీరంలో ఎముకల గట్టిదనం కోసం క్యాల్షియం ఎక్కువగా కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవటం మంచిది. ఈ సమస్యనుంచి దూరంగా ఉండటానికి క్యాబేజీ, పాలు, కొబ్బరి, బీన్స్, మునక్కాయలు, మునగాకు, ఆకుకూరలు తప్పనిసరిగా తీసుకుంటూ ఉండాలి.

ప్రతిరోజూ పాలు ఒక గ్లాసు తీసుకున్నా కూడా మన శరీరానికి కావలసిన క్యాల్షియం, పోషకాలు సమృద్ధిగా లభించే అవకాశం ఉంటుంది. అందరూ తప్పక గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే మందుల ద్వారా కన్నా, ఆహారం ద్వారా తీసుకునే క్యాల్షియం నే శరీరం ఎక్కువగా తీసుకుంటుంది. కాబట్టి క్యాల్షియం తీసుకోవాలని మాత్రలు ఎక్కువగా వేసుకోకుండా 'సి' విటమిన్ ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవటం ఉత్తమం.

ఇటీవలి కాలంలో ఈ 'ఆక్టియో పొరాసిస్' అనే జబ్బు ఎక్కువ మందిలో కనిపిస్తోందని వైద్యులు చెబుతున్నారు. అందుకే చిన్నపాటి ప్రమాదాల్లో కూడా చేతులు, కాళ్ళు విరిగి పోవటం, వెన్నెముక జబ్బులు పెరిగిపోతున్నాయి అని వైద్యులు నిర్ధారిస్తున్నారు. మనకు పుష్కలంగా పంటల ద్వారా లభించే ఆహార పదార్థాలు కాకుండా బయట లభించే 'జంక్ ఫుడ్స్' పట్ల మక్కువ పెంచుకుని, వాటితోనే కడుపు నింపుకోవటం వల్ల ఇలాంటి ప్రమాదాలు ఎక్కువగా వుంటున్నాయని డాక్టర్లే నిర్ధారిస్తు న్నారు. కాబట్టి వీలైనంత వరకు ప్రమాదాలను కొని తెచ్చుకోవటం మానేసి, అంటే బయటి ఆహార పదార్థాలకు వీలైనంత వరకు స్వస్తి పలికి, పంటల ద్వారా లభించే ఆహారాన్ని తీసుకోవటం మంచిది.

**గమనిక:** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

'వైద్య' ఉమా మహేశ్వర రావు ఫోన్ నెం.: 9440286854

## వైద్యానికి ఉపయోగ పడే ఔషధ మొక్కలు

**మునగ :**

ప్రస్తుతం 'రక్తపోటు' (బి.పి.)తో చాలామంది బాధ పడుతున్న విషయం అందరికీ విదితమే. రక్తపోటును నియంత్రణలో ఉంచుకునేందుకు 50 గ్రా. లేత మునగ ఆకులు (వీలైనంత వరకు దేశీ రకం మునగ ఆకులైతే మంచిది), 50 గ్రా. తులసి ఆకులు తీసుకుని వాటిని రోట్లో వేసి మెత్తగా నూరాలి. ఆ తర్వాత 25 గ్రా. మిరియాలు తీసుకుని, వాటిని మెత్తటి పొడిగా చేసుకోవాలి. ఆ తర్వాత మునగ, తులసి ఆకుల మిశ్రమంతో ఈ మిరియాల పొడిని వేసి బాగా కలిపి, అవసరమైతే కొద్దిగా నీటిని కలిపి చిన్న చిన్న మాత్రలు (వేరుశనగ గింజంత) తయారు చేసుకుని ప్రతిరోజూ ఉదయం పరగడుపుననే రోజుకు 2 మాత్రల చొప్పున తీసుకుంటూ ఉంటే రక్తపోటు ఎప్పుడూ నియంత్రణలో ఉంటుంది. రక్తపోటు నియంత్రణకు అలోపతి మాత్రలు వాడి, వాటివల్ల సైడ్ ఎఫెక్ట్ వస్తుందన్న బాధ ఉండదు, పైగా ఈ మాత్రలను ఇంట్లోనే తయారు చేసుకోవటం వల్ల ఎటువంటి ఆర్థికపరమైన ఖర్చులూ ఉండవు.

కడుపులో గ్యాస్ సమస్యతో బాధ పడుతున్న వారు లేత మునగ ఆకులను తీసుకుని మెత్తగా నూరి మాత్రలుగా తయారు చేసి ఉంచుకోవాలి. ప్రతిరోజూ రెండు లేదా మూడు మాత్రలను 'పసుపు'లో అద్ది వేసుకున్నట్లయితే గ్యాస్ సమస్యతో పాటు మలబద్ధకం సమస్య కూడా నివారించ బడుతుంది. మునగ ఆకు మాత్రలను పసుపులో అద్దుకుని మింగటం ఇబ్బందిగా అనిపిస్తే, ఆకును నూరేటపుడే అందులో పసుపు వేసుకుని నూరుకున్నా ఏమీ ఇబ్బంది ఉండదు.

మునగ చెట్టు పూతను సేకరించి, స్వచ్ఛమైన నెయ్యిలో వేయించుకుని తిన్నట్లయితే కంటి జబ్బులు చాలావరకు నయమౌతాయి. మునగ ఆకును నెయ్యిలో వేయించుకని తిన్నట్లయితే కడుపులో ప్రేవులన్నీ శుభ్రపడతాయి.

మధుమేహ వ్యాధిగ్రస్తులు లేత మునగ ఆకులు, నేల ఉసిరి ఆకులు, లేత వేప ఆకులను సమానంగా గుప్పెడు ఆకులను తీసుకుని, వాటన్నిటినీ కలిపి కొద్దిగా కచ్చకచ్చగా నూరుకొని ఒక గ్లాసు నీటిలో వేసి, ఆ నీరు సగం అయ్యే వరకు పొయ్యిమీద వేడి చేసి, కషాయంగా తయారు చేసుకోవాలి. అలా తయారైన కషాయంలో ఏమీ కలుపకుండా, చేదు చేదుగా ఉన్నప్పటికీ అలాగే పరగడుపున తీసుకున్నట్లయితే మధుమేహం ఎప్పటికీ నియంత్రణలో ఉంటుంది. ఎవరికైనా పుండ్లు ఏర్పడి అవి కుళ్ళిన పరిస్థితుల్లో ఉన్నపుడు వాటిపైన ఇదే కషాయాన్ని వేసి శుభ్రం చేసినట్లయితే పుండ్లపైన ఏర్పడ్డ సూక్ష్మజీవులు నశించి, పుండ్లు త్వరగా నయమయ్యే అవకాశం ఉంటుంది. పుండ్లను శుభ్రం చేసేందుకు రసాయన మందులకు బదులు ఈ కషాయాన్ని ఉపయోగిస్తే ఎటువంటి రసాయన వాసనలు లేకుండా పుండ్లు శుభ్రంగా ఉంటాయి.

**నేల ఉసిరి :**

పచ్చకామెర్ల వ్యాధితో బాధపడే వారు నేల ఉసిరి ఆకులతో సహా మొత్తం మొక్కను తీసుకుని, నీటితో శుభ్రంగా కడిగి మెత్తగా నూరి చిన్న చిన్న మాత్రలుగా చేసుకుని ప్రతిరోజూ ఉదయం సాయంత్రం ఈ మాత్రలను తీసుకున్నట్లయితే పచ్చ కామెర్లు త్వరగా నయమౌతాయి. కడుపులో నులి పురుగులతో బాధ పడుతున్న వారు ఇదే నేల ఉసిరి మొక్కను మెత్తగా నూరి, కషాయంగా తయారు చేసుకుని తాగినట్లయితే కడుపులోని నులి పురుగులను నివారిస్తుంది.



- 'వైద్య' కొమెర జాజి

**తంగేడు మరియు నేల తంగేడు :**

కడుపులో గ్యాస్ ట్రబుల్, మలబద్ధకంతో బాధ పడేవారు నేల తంగేడు ఆకులతో పాటు మునగ ఆకులను కూడా సమానంగా కొన్ని ఆకులను తీసుకుని, మెత్తగా నూరి మాత్రలాగా తయారు చేసుకుని కడుపులోకి తీసుకున్నట్లయితే కడుపంతా సాఫీగా తయారవుతుంది. గ్యాస్ ట్రబుల్, మలబద్ధకం లాంటి రోగాలను శీఘ్రంగా నయం చేస్తుంది.

ఇదే సమస్యకు తంగేడు, నేల తంగేడు, మునగ ఆకులను సమానంగా తీసుకుని, నీడలో బాగా ఆరబెట్టి, ఒట్టిగా తయారైన తర్వాత వాటిని మెత్తటి పొడిగా చేసుకుని ప్రతిరోజూ ఒక స్పూను పొడిని నోట్లో వేసుకుని భోజనం చేసినట్లయితే కూడా కడుపులోని ప్రేవులు శుభ్రపడి గ్యాస్ ట్రబుల్, మలబద్ధకం లాంటి రోగాలు దరిచేరవు. ఇందులో అవసరమైతే 'సోనాముఖి' ఆకులను కూడా కలుపుకోవచ్చు. కానీ, సోనాముఖి ఆకులను కలపడం వల్ల కొద్దిగా వేడి ఎక్కువ చేస్తుంది. కొద్దిగా వేడి చేసినా, ఫర్వాలేదు అనుకునే వారు వీటిని కలుపుకోవచ్చు.

**పిప్పెంట ఆకు (దీన్నే కుప్పెంట, మురిపెండ అని కూడా అంటారు) :**

ఈ పిప్పెంట మొక్కలు గ్రామాల్లో ఎక్కడ పడితే అక్కడ లభిస్తాయి. చెవిలో చీము కారటం లాంటి రోగాలతో బాధ పడుతున్న వారు ఈ పిప్పెంట ఆకులు కొన్నింటిని తీసుకుని రసం తయారు చేసుకుని, ఒక్కో చెవిలో రెండు చుక్కల చొప్పున వేసుకున్నట్లయితే చెవుల్లో చీము కారటాన్ని నివారించవచ్చు.

శరీరంపైన కురుపులు ఏర్పడి నయం కావటానికి ఎక్కువ సమయం తీసుకుంటున్న వారు పిప్పెంట ఆకులను సేకరించి, బాగా మెత్తగా దంచి, అందులో కాస్త పసుపు, కాస్త నిమ్మరసం కలిపి పుండ్లపైన పైపూతగా పూసినట్లయితే పుండ్లు త్వరగా నయమౌతాయి. ఇందులో కొద్దిగా ఆవు నెయ్యి కలిపి పూసినా కూడా ఇంకా బాగా పని చేస్తుంది.

శరీరంపైన గడ్డలు ఏర్పడిన వారు ఈ పిప్పెంట ఆకును ఆవ నూనె లేదా నువ్వుల నూనె లేదా ఆముదం తీసుకుని, అందులో అర గుప్పెడు పిప్పెంట ఆకులను వేసి వేయించాలి. చల్లారిన తర్వాత ఆ ఆకులను మెత్తగా నూరి, శరీరంపైన గడ్డలు ఉన్నచోట పెట్టి, దానిపైన తమలపాకును బోర్లించి, మెత్తటి గుడ్డతో కట్టు కట్టినట్లయితే మూడు నాలుగు రోజుల్లో ఆ గడ్డలు పండువారి పగిలిపోతాయి. ●

**గమనిక :** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

'వైద్య' కొమెర జాజి, ఫోన్ నెం. : 9908411700

**ఎడిటర్ గారికి,**

నేను చిత్తూరు జిల్లా, చిత్తూరు మండలం, దొడ్డిపల్లె గ్రామం ఇంగ్లీషు మీడియం పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిని. ఈమధ్యనే నేను మా పాఠశాలకు 'పల్లెసృజన' పత్రిక చందా కట్టడం జరిగింది. పత్రిక చదివిన తరువాత చిన్న పిల్లల నుండి రైతు సోదరుల వరకు ఎన్నో రకాల ఇన్నోవేషన్ లను వెలుగులోకి తీసుకు వచ్చి, సమాజానికి అందజేస్తున్న 'పల్లెసృజన' అంటే ఎంతో అభిమానం ఏర్పాడింది. ఇలాంటి పత్రికను ప్రతి విద్యార్థికి గుర్తుండిపోయేలా చెయ్యాలన్న ఉద్దేశ్యంతో మా పాఠశాలలో ప్రతిరోజు ప్రార్థన అయిపోయిన తర్వాత విద్యార్థులకు 'పల్లెసృజన' పత్రికలోని ఒక పేజిలో ఉన్న విషయాలను గురించి విద్యార్థులకు విపులంగా వివరించి చెబుతున్నాను. ఈవిధంగా చేయటం వల్ల భవిష్యత్తులో కొందరు విద్యార్థులైనా తమ సృజనాత్మకతను వెలుగులోకి తీసుకు రావటానికి ఇది ఉపయోగ పడుతుందని నా ఉద్దేశ్య,. ఇంతటి మహత్తర యజ్ఞాన్ని మీరు ఇలాగే కొనసాగించాలని కోరుకుంటున్నాను. **– సిరాజ్ భాష, ప్రధానోపాధ్యాయుడు.**

**ప్రధానోపాధ్యాయులు గారూ,**

మీ అభిమానానికి, ప్రోత్సాహానికి ధన్యవాదములు. నేటి బాలలే రేపటి పౌరులు అని ఉద్భోదించే మీరు చిన్నారి విద్యార్థులకు 'పల్లెసృజన' గురించి ప్రతిరోజూ ప్రేయర్‌లో బోధిస్తున్నందుకు ముందుగా మీకు కృతజ్ఞతలు. చిన్నారుల జ్ఞానాన్ని వెలుగులోకి తీసుకు రావటంలో మేము చేస్తున్న కృషికి మీలాంటి ఆదర్శ ఉపాధ్యాయులు సహకరించడం మాకెంతో ఆనందంగా ఉంది. **– ఎడిటర్.**

**ఎడిటర్ గారికి,**

నేను ఈమధ్య అమెరికాలో ఒక ఆపిల్ తోటను సందర్శించడం జరిగింది. మనవద్ద కూడా పండేలా తయారు చేసిన ఆపిల్ మొక్కలను పల్లెసృజన వారు అందిస్తున్నారని తెలుసుకుని నేను తెప్పించుకున్నాను. ఈ సంవత్సరం అవి కాపుకు వస్తాయి. నేను నాటిన చెట్లు కూడా ఇక్కడి ఆపిల్ చెట్లలాగే ఉన్నాయి. మన ప్రాంతంలో కూడా పండే ఆపిల్ చెట్లను రైతులకు అందిస్తున్నందుకు అభినందనలు. **– కమలాకర్ రెడ్డి.**

**కమరలాకర్ రెడ్డి గారు,**

మీ ఆపిల్ మొక్కలు బాగా పెరుగుతున్నందుకు ఆనందంగా ఉంది. తెలుగు రైతులు ఆపిల్ పండించుకొని తింటున్నందుకు అభినందనలు. ఇన్నోవేషటర్ హరిమాన్ శర్మ గారికి మనందరి కృతజ్ఞతలు. **– ఎడిటర్**


## FORM IV

***Statement about ownership and other particulars about newspaper (PALLE SRUJANA)***

| | | | |
|---|---|---|---|
| 1. | Place of publication | : | **102, Vayupuri, Sainikpuri Post,** Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Teelangana |
| 2. | Periodicity of its publication | : | **Bi-Monthly** |
| 3. | Printer's Name | : | **P. Ganesham** |
| | Nationality | : | Indian |
| | Address | : | 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 4. | Publisher's Name | : | **P. Ganesham** |
| | Nationality | : | **Indian** |
| | Address | : | 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 5. | Editor's Name | : | **J. Seshi Mohan** |
| | Nationality | : | **Indian** |
| | Address | : | 2-1-513/2, Nallakunta, Hyderabad - 500 044. |
| 6. | Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one per cent of the total capital. | | |

I, **P. GANESHAM**, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date28-02-2017

**Signature of Publisher**

# పల్లెసృజన
www.pallesrujana.org

## అమ్మకానికి సిద్ధంగా వున్న రైతుల కోసం రైతుల ఇన్నోవేషన్లు

# మూలికా క్రిమి సంహారక మందులు

ఇన్నోవేటర్ : **వెంకటకృష్ణుడు**, కర్నూలు

## తులసి

'తులసి' ఒక అద్భుతమైన మూలికా పురుగు మందు. పంటల ఎదుగుదల, పూత బాగా వచ్చేలా చేస్తుంది. పంట ఎదుగుదల దశ నుండి, పూత వచ్చే వరకు రెండు లేదా మూడుసార్లు పిచికారి చేస్తే చాలు మంచి ఫలితాన్ని ఇస్తుంది. మిరప, జామ, నిమ్మ తోటలలో వేరు వ్యవస్థను దెబ్బతీసి, చెట్లు చనిపోయేలా చేసే 'నిమటోడ్స్' పురుగులను సమర్థవంతంగా ఎదుర్కొంటుంది. అప్పుడప్పుడే చనిపోయిన చెట్లు కూడా మళ్ళీ చిగురించేలా చేస్తుంది. సంవత్సరానికి ఒక్కసారి వేరు వ్యవస్థకు లీటరుకు 20 మి.లీ. మందు కలిపి అందిస్తే చాలు వేరుకు సంబంధించిన ఎటువంటి పురుగులను రానివ్వకుండా కాపాడుతుంది. ఎన్నో సంవత్సరాలుగా ఎంతోమంది రైతుల మన్ననలు పొందిన పురుగు మందు. మామిడి, నిమ్మ, దానిమ్మ, బత్తాయి తోటల రైతుల ప్రశంసలు అందుకున్న మందు 'తులసి'. వరిపైరుపై ఈ ఒక్క మందునే పిచికారి చేసి, ఎటువంటి రోగాలు రాకుండా కాపాడుకోవటంతో పాటు, అధిక దిగుబడి, ఆహారంలో రుచి కూడా వచ్చిందని వరి రైతుల కితాబు అందుకున్న మందు 'తులసి'




## పర్ఫెక్ట్




'తులసి' మందు మొక్కలు, పండ్ల తోటలు బాగా ఎదిగి పూత వచ్చేలా చేస్తే, 'పర్ఫెక్ట్' అనే ఈ మూలికా పురుగు మందు వచ్చిన పూత రాలిపోకుండా కాపాడటంతో పాటు, నల్లి, దోమ, ఇతర చిన్న చిన్న పురుగులు, కాయ కుళ్ళు తెగుళ్ళ లాంటిని సమర్థవంతంగా నివారించేలా చేస్తుందని రైతుల కితాబు అందుకున్న మందు. ఎంతోమంది మిరప, ప్రత్తి, మినుము, పెసర, వేరుశనగ, దానిమ్మ, మామిడి, నిమ్మ, బత్తాయి తోటల రైతులు ఈ పురుగు మందు వాడి, ఆరోగ్యకరమైన ఆహార ధాన్యాలను సమాజానికి అందించామన్న తృప్తిని మిగిల్చిన మందు. ఈ సంవత్సరం రైతులు మిరప తోటల్లో వేలాది రూపాయలు వెచ్చించినా నయం కాని 'తామర' (పూతలో నల్లటి పురుగులు) పురుగులను కేవలం రెండుసార్లు పిచికారి చేస్తే సమర్థవంతంగా ఎదుర్కొని పంటను కాంతివంతంగా తయారు చేసిన అద్భుత మూలికా క్రిమి సంహారిని.

## స్టాప్

గత సంవత్సరం నుండి ఉభయ తెలుగు రాష్ట్రాల మిర్చి రైతులకు కోట్లాది రూపాయలు ఆదా చేసిన బృహత్తరమైన మూలికా పురుగు మందు "స్టాప్". గత సంవత్సరం నుండి మిర్చి రైతులకు నిద్ర లేకుండా చేస్తున్న 'జెమిని వైరస్' (దీన్నే బొబ్బర, ఆకు ముడత, గజ్జి తెగులు అంటారు)ను సమర్థవంతంగా ఎదుర్కొన్న ఏకైక మూలికా పురుగు మందు. కేవలం రెండుసార్లు పిచికారి చేస్తే పంట మొత్తం కబళించిన జెమినీ వైరస్ రూపుమాసి పోవటంతో పాటు, మిరప తోటకు అందమైన రూపు, పూత వచ్చేలా చేసి, అధిక దిగుబడిని అందించిన మహత్తర పురుగు మందు. ఏ పంటపైన అయినా, ఎటువంటి వైరస్‌నైనా సరే సమూలంగా నాశనం చేసి, పంట రూపు రేఖలను మార్చటంతో పాటు, అధిక దిగుబడి వచ్చేలా చేసి, ఎంతో మంది రైతుల కళ్ళల్లో ఆనంద భాష్పాలను నింపిన మూలికా పురుగు మందు "స్టాప్".




## వండర్

ఇక ఇది రైతు చేతిలో పాశుపతాస్త్రమే!

పంటలను ఆశించే లద్దె పురుగు, పచ్చపురుగు, కాయతొలుచు పురుగు, కాండం తొలుచు పురుగు,ఆకుచుట్టు పురుగు లను సమర్థవంతంగా అరికడుతుంది.

ఏ పంటలోనైనా, పండ్ల తోటల్లోనైనా సరే, ఏ పురుగునైనా సరే వేటాడి, వెంటాడి చంపేసే అద్భుత సేంద్రియ పురుగు మందు







గత పది సంవత్సరాలుగా ఎంతోమంది రైతుల మన్ననలు పొందిన రైతు ఇన్నోవేషన్లు

**కావలసిన వారు సంప్రదించండి :**

బి. సుభాష్ చందర్, ఫోన్ : 9652801700
పల్లె వీరరాఘవ రెడ్డి, ఫోన్ :8125799904

పల్లెసృజన
77, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ – 500094.

PALLE SRUJANA Telugu Bi-monthly September-October 2022 RNI No. TELTEL 2012/74620

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

ఒక్కో సంచిక రూ. 30 /-లు మాత్రమే

ఇన్నోవేషన్ల వీడియోల కొరకై ఈ QR కోడ్‌ను స్కాన్ చేసి చూడవచ్చు.


























పల్లెసృజన సభ్యులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. సభ్యులుగా చేరాలనుకున్నవారు
చందా కట్టి, మీ చిరునామాను స్పష్టంగా 9866001678 కి పంపడం మరవకండి.

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-40253096
లేదా నేరుగా ఈ బ్యాంక్ లో జమ చేయండి.

**M/s Pallesrujana, Canara Bank, Sainikpuri, Secunderabad.**
**SB A/c No. 30232200019150, IFS Code : CNRB0013023**

PhonePe

"Phone Pe"
no 9866 00 1678

QR code for Phone Pe

లేదా

'గూగుల్ పే' చెయ్యాలనుకున్న వారు 9652801700 నెంబరుకు పంపి మీ చిరునామా ఎస్ఎంఎస్ లేదా వాట్స్‌యాప్‌లో పంపండి.

### సభ్యత్వ వివరాలు

| వివరములు | వ్యక్తిగతం | లైబ్రరి |
|---|---|---|
| రెండు సంవత్సరాలకి | 400/- | 1,000/- |